సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 264

శుక్రవారం 7-6-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



సునీల్ ఛెత్రి వీడ్కోలు

జాతీయ జట్టు తరఫున చివరి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడిన కెప్టెన్ - 13లో



రెండో రోజూ మార్కెట్ ర్యాలీ

సెన్సెక్స్ 692 పాయింట్లు అప్.. 201 పాయింట్లు ఎగసిన నిఫ్టీ - 13లో



కంగనకు కానిస్టేబుల్ చెంపదెబ్బ

చండీగఢ్ విమానాశ్రయంలో బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనాను సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టారు. వివరాలు 6లో ▸



ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

ఎన్డీయే సర్కారు ఏర్పాటుకు ప్రాణవాయువు అందిస్తున్న జేడీ(యూ).. బిహార్‌కు ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టాలని నిర్ణయించింది.

యథేచ్ఛగా హింస

కఠిన చర్యలు తీసుకోండి.. గవర్నర్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ

సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసిన పార్టీ నేతలు

పోలీసులు ఏం చేస్తున్నారని గవర్నర్ విస్మయం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అధికారం చేపట్టక ముందే టీడీపీ, జనసేన నాయకులు యథేచ్ఛగా సాగిస్తున్న హింసాకాండపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ నేతలు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విన్నవించారు. ఈమేరకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ తనూజ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ కేశినేని నాని, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి గవర్నర్‌కు గురువారం వినతిపత్రం అందచేసిన అనంతరం మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు అనంతరం బిహార్ తరహాలో రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకాండ, హింసాత్మక ఘటనలను గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. టీడీపీ మూకలు ఎన్నికల రోజు మధ్యాహ్నం నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లపై

మిగతా 2వ పేజీలో ▶



గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పచ్చ మూకల దాడులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి

అరాచకాలను అడ్డుకోవాలి

టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉంటాం

సోషల్ మీడియా సైనికులకు అండగా నిలుస్తాం: వైఎస్ జగన్

2 లో

అరాచకాన్ని అరికట్టండి

రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

2లో

ఊరూరా విధ్వంసం.. అదే టీడీపీ లక్ష్యం

- పలుచోట్ల శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలపై దాడి.. ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు కూల్చివేత
- సచివాలయాలపై అక్కసుతో పేట్రేగిన వైనం.. విజయనగరంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రచ్చ

10లో





ఆక్వాకు వరుణుడి దెబ్బ

ఉష్ణోగ్రతల్లో మార్పులు.. ఆక్వా చెరువులకు ఆక్సిజన్ సమస్య

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో సాగు

కైకలూరు: నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనాలు కారణంగా వాతావరణ మార్పుతో వర్షాలు కురుస్తున్నాయి. నిన్నటివరకు మండు వేసవిని తలపించేలా ప్రతాపం చూపిన భానుడికి నీలిమేఘాలు అడ్డుపడ్డాయి. వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. అప్పటివరకు నమోదైన 39 డిగ్రీల ఉష్ణోగ్రతలలో మార్పు వస్తోంది. దీంతో ఈ ఏడాది ఆక్వా రైతులకు ఆక్సిజన్ సమస్య భయపెడుతోంది. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొద్దిరోజులుగా చేపల చెరువుల్లో మార్పు కనిపిస్తోంది. వాతావరణంలో మార్పుతో ఆక్సిజన్ సమస్య తలెత్తితే రూ.కోట్లలో నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేధిస్తున్న వ్యాధులు

చేపల, రొయ్యల చెరువులను వ్యాధులు వేధిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చేపల, రొయ్యల సాగు ఉంది. రైతులు పట్టుబడులకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో వాతావరణం రైతులను భయపెడుతోంది. ఇప్పటికే చెరువులను పేను, తాటాకు తెగులు, రెడ్ డిసీజ్ వంటి వ్యాధులు పట్టిపీడిస్తోన్నాయి. ముఖ్యంగా రొయ్యల రైతులలో వైట్ వైరస్ రైతులను మరింత వేధిస్తోంది. వీటికి తోడు వాతావరణ మార్పులతో ఆక్సిజన్ సమస్య తలెత్తితే పూర్తిగా ఆక్వా రైతులు నష్టపోతారు.

ఏటా రూ.90 కోట్ల నష్టం

దేశంలోనే ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తోంది. ఇందులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా ఎగుమతుల్లో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఇప్పటివరకు ఎండలు మండిపోయి ఒక్కసారిగా వర్షం కురుస్తుండటంతో చెరువుల అడుగుభాగాన ఉన్న విష రసాయనాలు ఒక్కసారిగా పైకి వచ్చి ఆక్సిజన్ అందక చేపలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఇదే ప్రమాదంతో ఏటా జిల్లాలో రూ.90 కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఆక్సిజన్ సమస్య లక్షణాలు, నివారణ చర్యలను కైకలూరు మత్స్యశాఖ ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్ వివరించారు.



ఆక్సిజన్ సమస్య లక్షణాలు

- చెరువుల్లో రోహు, కట్లా పెద్ద సైజు చేపలు అధికంగా మరణిస్తాయి.
- ప్రధానంగా మొప్ప వ్యాధి సోకిన చేపలు మరణం ఎక్కువగా ఉంటుంది.
- ఉదయం చేపలు ఉపరితలంపైకి వచ్చి గాలి పీల్చుకుంటాయి.
- చెరువులో ప్లాంక్టిన్ గోధుమ రంగులో కనిపిస్తోంది.
- నీరు పచ్చబారిన రంగులోకి మారి పులిసిన వాసన వస్తోంది.
- అడుగుభాగంలో నత్తలు పైకి తేలుతాయి.

నివారణ పద్ధతులు

- ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమైనప్పుడు మేతలు కట్టకూడదు. కాల్షియం హైడ్రాక్సన్ ఎకరానికి 2 కేజీలు చల్లాలి.
- లైమ్ (సున్నం) ఎకరానికి 25 కేజీలు పిచికారీ చేయాలి.
- ప్లాంక్టిన్ ఉంటే సూపర్ ఫాస్పెట్ ఎకరానికి 25 కేజీలు చల్లాలి
- నీటిలో అమ్మోనియా ఉంటే యుక్క పౌడర్ ఎకరానికి అరకేజీ చల్లాలి.
- చెరువులో చనిపోయిన చేపలను తొలగించాలి.
- ఆక్సిజన్ సమస్య నుంచి కోలుకున్న తర్వాత టన్ను మేతకు 10–15 కేజీల మినరల్ మిక్సర్ కలపి చల్లాలి. చెరువులో ఏరియేటర్లు ఎక్కువగా తిప్పాలి.

మా ప్రాణాలు కాపాడండి

- ఏపీలో హింసపై సుప్రీంను ఆశ్రయించిన బాధితులు
- ఎన్నికల అనంతరం రాష్ట్రంలో భయానక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై యథేచ్ఛగా దాడులు
- గ్రామాలు వీడకుంటే చంపేస్తామంటూ హెచ్చరికలు
- ఆస్తుల ధ్వంసం.. మహిళలు, పిల్లలను హింసిస్తున్నారు
- పోలీసుల నిర్లిప్తతతో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి
- సాక్ష్యాధారాలతో ఈ-మెయిల్ ద్వారా సీజేఐకి ఫిర్యాదు
- సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారించాలంటూ అభ్యర్థన

2 లో

ప్రమాణ స్వీకారం

9వ తేదీన నరేంద్ర మోదీ



- నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్తగా ఎంపికైన 293 మంది ఎన్డీఏ లోక్‌సభ సభ్యులు శుక్రవారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. మోదీని తమ నేతగా ఎన్నుకోనున్నారు. అనంతరం ఆ ఎంపీల జాబితాను రాష్ట్రపతికి సమర్పించనున్నారు.

14 లో

12వ తేదీన చంద్రబాబు



- రాష్ట్ర సీఎంగా ఈనెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 11వ తేదీన టీడీపీ ఎమ్మెల్యేలు సమావేశమై బాబును టీడీపీ పక్ష నేతగా ఎన్నుకుంటారు. ఈ విషయం గవర్నర్‌కు నివేదించాక 12న ప్రమాణ స్వీకారం జరుగుతుంది. తొలివిడతలో సుమారు పది మందికి మంత్రివర్గంలో అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది.

14 లో

పెద్ద శాఖలను ఇవ్వలేం!

రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాలు బీజేపీకే

లోక్‌సభ స్పీకర్ పోస్టుపైనా ఇదే వైఖరి

6 లో

టీడీపీ అధ్యక్షుడిగా లోకేశ్!

ఏడాది తర్వాత రాష్ట్ర కేబినెట్‌లోకి?

5లో

స్టాక్ మార్కెట్ కుంభకోణంలో మోదీ, అమిత్ షా



- రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.30 లక్షల కోట్ల నష్టం
- ఎన్నికల సమయంలో పెట్టుబడి సలహాలు ఎందుకిచ్చారు?
- బీజేపీకి మెజార్టీ రాదని తెలిసినా షేర్లు ఎందుకు కొనాలని సూచించారు?.. 200 నుంచి 220 సీట్లు వస్తాయని నిఘా సంస్థలు చెప్పడం నిజం కాదా?
- తప్పుడు ఎగ్జిట్ పోల్స్ వెనుక గుట్టు ఏమిటి?.. బీజేపీకీ, విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య సంబంధం ఏమిటి?
- జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలి
- కాంగ్రెస్ నేత రాహుల్ డిమాండ్

6 లో

వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్



మన విశ్వసనీయతే పునర్వైభవానికి పునాది


వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు

పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశం

2 లో

నేలకూలుతున్న చరిత్ర!

- కనుమరుగవుతున్న చరిత్రాత్మక కట్టడాలు.. పైకప్పు దెబ్బతిని శిథిలమవుతున్న రంగిణీ మహల్
- గుప్తనిధుల కోసం మగ్బ్రా డూమ్‌ను తవ్వేసిన దుండగులు
- శిథిలావస్థకు చేరుకొన్న యూసూఫ్ సాహెబ్‌తకియా
- రూపురేఖలు కోల్పోయిన కోట ముఖద్వారం
- పట్టించుకోని కేంద్ర పురావస్తుశాఖ



గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, కండ్రిగ గ్రామాల్లో చరిత్రాత్మక కట్టడాలు శిథిలమైపోయి కనుమరుగు అవుతున్నాయి. కోటలోని రంగిణీ మహల్ వెనుకవైపు భవనం పైకప్పు ఓవైపు ఇప్పటికే కూలిపోయింది. టిప్పు సుల్తాన్ మేనమామ గుర్రంకొండ కోట పాలకుడు మీర్ రజాఅలీఖాన్ సమాధి ఉన్న మగ్బ్రా డూమ్‌ను గుప్తనిధుల కోసం దుండగులు తవ్వేశారు. మరోవైపు మగ్బ్రా డూమ్ పైకప్పు ఓ చోట కూలిపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. మిగిలిన భాగాల్లో కూడా పెచ్చులు ఊడిపడుతున్నాయి. గుర్రంకొండలోని టిప్పు సుల్తాన్ చదువుకున్న పాఠశాల చరిత్రాత్మక యూసూఫ్ సాహేబ్ తకియా కూడా శిథిలావస్థకు చేరుకొని మొండిగోడలు మిగిలాయి. కోట ముఖద్వారం కంపచెట్లతో నిండిపోయి తమ ప్రాభవాన్ని కోల్పోయి రూపురేఖలు మారిపోయింది. పట్టించుకుని అభివృద్ధి చేయాల్సిన కేంద్ర పురావస్తుశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది.

మరమ్మతులేవి?

చరిత్రాత్మక గుర్రంకొండ కోటలోని ప్రఖ్యాత రంగిణీ మహల్ శిథిలమైపోయి ఓ వైపు కూలిపోయింది. భవనం పైకప్పు దెబ్బతిని ముందువైపు పడిపోయింది. ఇది జరిగి ఆరేళ్లు కావస్తున్నా పురావస్తుశాఖ అధికారులు మరమ్మతుల ఊసే పట్టించుకోవడం లేదు. మరమ్మతులు కేవలం అధికారుల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కోటలో ముఖ్యమైన పర్యాటక ప్రదేశం రంగిణీ మహల్. కోట ముఖద్వారం దాటుకోగానే మొదటగా కనిపించేదే ఈ మహల్. పూర్వపు నవాబులు తమ ఆస్థానంలోని ఆస్థాన నాట్యగత్తెగా ఉన్న రంగమ్మ పేరుతో ఈ మహల్ నిర్మించారని చరిత్ర చెబుతోంది. మహల్ ముందువైపు రెండు అంతస్థులుగానూ, వెనుకవైపు మూడు అంతస్థులుగా కనిపించడం ఈ మహల్ ప్రత్యేకత. ఇంతటి ప్రాశస్త్యమున్న ఈ భవనం వైనుకవైపు రెండో అంతస్తు పైకప్పు ఓవైపు పూర్తిగా దెబ్బతిని కుంగిపోయింది. ఐదేళ్ల క్రితం అప్పట్లో కురిసిన వర్షాలకు ఉన్నట్టుండి ధ్వజస్తంభం రెండుగా చీలి పోయి పైకప్పు దెబ్బతిని ఒరిగిపోయింది. ముందుభాగంలో ఉన్న పైకప్పు ఓవైపు పూర్తిగా కూలిపోయింది. మిగిలింది ఎప్పుడు కూలిపోతుందో తెలియక పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు పలుమార్లు పర్యటించి వాటి మరమ్మతుల కోసం ఎంత మేరకు నిధులు అవసరమవుతాయో అంచనాలను రూపొందించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు. ఇలా పలుమార్లు అధికారులు పర్యటించడం ప్రతిపాదనలు పంపించడంతోనే కాలం గడుస్తోంది. ఇంతవరకు మరమ్మతులు చేపట్టిన ధాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రతినిత్యం ఈ మహల్‌ను సందర్శించడానికి పెద్ద ఎత్తున పర్యాటకులు ఇక్కడికి విచ్చేస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత సంతరించుకొన్న ఈ కట్టడాలు శిథిలావస్థకు చేరుకొని నేడో రేపో కూలిపోయే దశకు చేరుకొన్నాయి.

రూపురేఖలు కోల్పోయిన యూసూఫ్ సాహేబ్ తఖియా

ఈ పురాతన కట్టడం ఒకప్పటి టిప్పుసుల్తాన్ చదువుకున్న పాఠశాల. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ తండ్రి హైదరాలీ మైసూర్ రాజుల తరపున జయించాడు. ఈ కోటకు తన భార్య సోదరుడైన మీర్ రజాఅలీఖాన్‌ను పాలకుడిగా నియమించాడు. చిన్నతనంలో గుర్రంకొండ కోటలో మేనమామ ఇంట పెరిగిన టిప్పు సుల్తాన్ గుర్రంకొండపై ఎనలేని ప్రేమాభిమానాలు పెంచుకొన్నాడు. ఆయన చిన్న తనంలో ఇక్కడే యూసూఫ్ సాహేబ్ తఖీయా (తఖీయా అంటే పాఠశాల అని అర్థం)లో విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. హైదరాలీ పాలనా కాలంలో ముస్లీమ్ మతగురువు హజరత్ షాకమాల్ దువ్వామ్ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ఇస్లామ్ సూక్తులు ప్రబోధిస్తూ గుర్రంకొండకు చేరుకొని యూసుఫ్ సాహేబ్ తఖియాను ర్పాటు చేసుకొన్నాడు. షాకమాల్ పేరుప్రఖ్యాతులు తెలుసుకొన్న హైదరాలీ తన కుమారుడు టిప్పుకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు శ్రీరంగపట్నం రావాలని కోరాడు. అందుకు ఆయన నిరాకరించడంతో టిప్పుసుల్తాన్‌ను గుర్రంకొండకే పంపించి యూసూఫ్ సాహేబ్ తఖీయాలో విద్యాబుద్ధులు చెప్పించాడు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ చరిత్రాత్మక కట్టడం నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొంది. కేవలం నాటి కాలంలో నిర్మించిన ఇటుకల గోడలు మాత్రం ఉన్నాయి.

క్లుప్తంగా...

ఎన్నికల కోడ్ ముగిసింది
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును కూడా నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఒక ప్రకటలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 16న షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన ప్రవర్తన నియమావళి.. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత 48 గంటల వరకు అమల్లో ఉందన్నారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాలకు, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతనంగా ఎంపికైన అభ్యర్థుల జాబితా ఖరారవ్వడంతో ఎన్నికల ప్రక్రియ ముగిసిందన్నారు. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును కూడా నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని చెప్పారు.

గవర్నర్‌కు శాసన సభ్యుల జాబితా



గవర్నర్‌కు ఎమ్మెల్యేల జాబితాను అందజేస్తున్న మీనా


సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికైన శాసన సభ్యుల జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా.. గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. భారత ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాష్‌కుమార్, రాష్ట్ర అదనపు సీఈవోలు కోటేశ్వరరావు, హరేంధిరప్రసాద్, జాయింట్ సీఈవో వెంకటేశ్వరరావులతో కలిసి మీనా గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

28వరకు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని అరెస్టు చేయొద్దు
కండిషన్ బెయిలును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఈనెల 28వ తేదీ వరకు అరెస్టు చేయవద్దంటూ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం.కిరణ్మయి గురువారం ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు డాక్టర్ గోపిరెడ్డి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకుమాను బాలహనుమంతరెడ్డి వెల్లడించారు. గతంలో ఇదే కోర్టు ఈనెల 6 వరకు అరెస్టు చేయవద్దంటూ కండిషన్ బెయిలు ఇచ్చిందన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా మరోసారి కండిషన్ బెయిలును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

జీఎస్ఎల్ ఆధ్వర్యంలో 'ఫ్యూజ్' సర్టిఫికేషన్ కోర్సు

సాక్షి, అమరావతి: దేశంలో మొట్టమొదటి ఫండమెంటల్ యూస్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ (ఫ్యూజ్) కోర్సును శుక్ర, శనివారాల్లో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు గురువారం తెలిపారు. అమెరికన్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్స్ సొసైటీ, యూఎస్ఏ ద్వారా ఫ్యూజ్ కోర్సు ఆమోదించబడినట్లు పేర్కొన్నారు. లైఫ్ టైమ్ సర్టిఫికెట్ రూపంలోని ఈ కోర్సు అన్ని విభాగాల సర్జన్లకు, సర్జరీ పీజీ విద్యార్థులకు సదావకాశమన్నారు. 2 రోజుల పాటు శస్త్రచికిత్సలో ఎనర్జీ ఆధారిత పరికరాల సురక్షిత వినియోగంపై ఐదుగురు అమెరికన్ సర్జన్లు సమగ్ర శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ పొందేవారు ఎలక్ట్రోసర్జరీ ప్రాథమిక అంశాలు, ఆపరేటింగ్ రూమ్ అగ్నిప్రమాదాల వంటి ప్రతికూల ఘటనలకు అవకాశాలు, నివారించే పద్ధతులు, శస్త్ర చికిత్స విభాగాల్లో ఉపయోగించే ఎనర్జీ పరికరాల గురించి సమగ్ర అవగాహన పొందుతారన్నారు. ఆసక్తి కలిగిన యువ వైద్యులు విచారణ, నమోదు కోసం 9550521218, 9885446606 నంబర్లను సంప్రదించాలన్నారు.



మన అదృష్టం! 8 మంది ఎమ్మెల్యే ఉన్నారు !
ఇంకా ఎక్కువ మంది ఉంటే
ఇంకా ఎక్కువ ఎంపీలు వచ్చేవి!






వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను కలిసిన అరకు ఎంపీ తనూజ రాణి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

మన విశ్వసనీయతే పునర్వైభవానికి పునాది

ప్రతి గడపకూ మంచి చేసిన చరిత్ర మనదే

- కుమ్మక్కు కుట్రలతో సీట్లు తగ్గినా వైఎస్ జగన్ కృషితోనే 40 శాతం ఓట్లు సాధించగలిగాం
- గత ఐదేళ్ల సుపరిపాలనకు గీటురాయిలా నిలుస్తాయి
- నిస్సంకోచంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం
- వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ విశ్వసనీయతే పార్టీ పునర్వైభవానికి పునాదిగా నిలుస్తుందని, గత ఐదేళ్ల సుపరిపాలనను రాబోయే పాలనతో ప్రజలు కచ్చితంగా బేరీజు వేసుకుంటారని పలువురు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట మీద నిలిచిన పార్టీగా వైఎస్సార్ సీపీకి ప్రజల మనసులో ఎప్పటికీ చోటు ఉంటుందని, పార్టీ పునర్ వైభవానికి ఇదే గట్టి పునాది అని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పలువురు ఎమ్మెల్సీలు, నేతలు గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఫలితాలపై ఒక్కొక్కరూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఏమన్నారంటే...

- మన ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేయడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.
- యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాం. మేనిఫెస్టో హామీలను 99 శాతానికిపైగా అమలు చేయడంతో పేద వర్గాల్లో సంతోషం వ్యక్తమైంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలు పెంపొందేలా వైఎస్ జగన్ చేసిన విశేష కృషి కచ్చితంగా ప్రజల మనసుల్లో నిలిచిపోతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రజల జీవితాలను మార్చే దిశగా గొప్ప అడుగులు వేశాం. ప్రతి గడపకూ మంచి చేశాం. పార్టీ కచ్చితంగా పునర్ వైభవం సాధిస్తుందని మాకు గట్టి విశ్వాసం ఉంది.
- రాజకీయ ఒత్తిళ్లకు ఈసీ తలొగ్గడం, కొందరు పోలీసు అధికారులు కుట్రల్లో కుమ్మక్కు కావడం, ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై అనుమానాలు, పోలింగ్ బూత్‌ల వద్ద మన ఓటర్లను కట్టడి చేయడంతో సీట్లు గణనీయంగా తగ్గినా వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓట్లు రావడం వెనుక ఐదేళ్ల పాటు వైఎస్ జగన్ చేసిన కృషి ఉంది. గత ఐదేళ్లలో అమలు చేసిన పథకాలు, చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే కనిపిస్తున్నాయి. మేమంతా నిస్సంకోచంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం. గడచిన ఐదేళ్ల సుపరిపాలనకు ఒక గీటురాయిలా నిలుస్తాయి. కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు తీరుపై కచ్చితంగా ప్రజలు దృష్టి సారిస్తారు.

ఎన్నికల తీరుపై అనుమానాలు

ఎన్నికలు జరిగిన తీరుపై పలువురు నేతలు జగన్ వద్ద అనుమానాలు వ్యక్తం చేశారు. పార్టీకి గట్టి పట్టున్న గ్రామాల్లో సైతం ఓట్లు రాకపోవడం సందేహించాల్సిన అంశమని, ఈవీఎంల వ్యవహారంపై పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడిన తరువాత ఎన్నికల్లో తీవ్ర అక్రమాలకు పాల్పడ్డాయన్నారు. ఈసీ ఒత్తిళ్లకు లొంగిపోయి హడావుడిగా పోలీసు అధికారులను బదిలీ చేసి కూటమికి అనుకూలంగా వ్యవహరించే వారిని నియమించడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లను భయ భ్రాంతులకు గురి చేశారని చెప్పారు. పోలీసుల అండతో టీడీపీ నేతలు పోలింగ్ సమయంలో భయానక పరిస్థితులు సృష్టించారన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా నిలవాలి: వైఎస్ జగన్

కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకముందే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ మూకలు ఉన్మాదంతో స్వైర విహారం చేస్తున్నాయని, పలుచోట్ల దాడులకు తెగబడుతున్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రస్తావించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ప్రాణాలకు హాని తలపెట్టడమే కాకుండా ఆస్తుల విధ్వంసానికి తెగబడుతున్నాయన్నారు. దీనిపై వెంటనే స్పందించిన వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు అండగా నిలిచి భరోసా కల్పించాలని నాయకులను ఆదేశించారు. పార్టీ తరఫున న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ప్రక్రియ మొదలైందని తెలిపారు. ఈ ఘటనలను రాష్ట్రపతి, గవర్నర్ దృష్టికి తెచ్చి పార్టీ తరఫున ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు, వైస్ చైర్మన్ జకియా ఖానమ్, నూతనంగా గెలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, తాటిపత్రి చంద్రశేఖర్, బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీలు మద్దిల గురుమూర్తి, తనూజ రాణి తదితరులున్నారు. ఎమ్మెల్సీలు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రూహుల్లా, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, విడదల రజని, పేర్ని నాని, ఉషా శ్రీచరణ్, కె.నాగేశ్వరరావు, వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహన్ రావు, కైలే అనిల్ కుమార్, పార్టీ నాయకులు దేవినేని అవినాష్, ఉప్పాల రాము, మాజీ ఎంపీ కేశినేని నాని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యథేచ్ఛగా హింస



గవర్నర్‌ను కలిసిన అనంతరం రాజ్‌భవన్ నుంచి వెలుపలకు వస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

దాడులకు తెగబడి పలు చోట్ల గృహ దహనాలు, ఆస్తులను ధ్వంసం చేశాయన్నారు. మహిళలు, పిల్లలను సైతం హింసించి భయ భ్రాంతులకు గురి చేశాయని తెలిపారు. టీడీపీ, జనసేన విధ్వంస కాండకు సంబంధించి వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి విస్తుపోయిన గవర్నర్.. పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, కళ్ల ముందే దాడి జరిగినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదని గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. నూజివీడులో కౌన్సిలర్‌పై పోలీసుల సమక్షంలోనే కత్తులతో దాడి జరగటాన్ని గవర్నర్ దృష్టికి తెచ్చామన్నారు. ఈ ఘటనలపై డీజీపీతో చర్చించి చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారన్నారు.

పర్యవసానాలు తప్పవు

వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకున్న వారిపై దాడులు చేసేందుకే అధికారంలోకి వచ్చారా? అని టీడీపీ నేతలను పేర్ని నాని ప్రశ్నించారు. ఎర్ర పుస్తకం పేరుతో హింసకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లకాలం మీరే అధికారంలో ఉండరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కూటమి నాయకులకు సూచించారు. చంద్రబాబు ఒత్తిడితో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. దాడులను ఆపకుంటే పర్యవసానాలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తలను కాపాడుకునేందుకు కమిటీలు, లీగల్ టీమ్స్

రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను కాపాడుకునేందుకు 26 జిల్లాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రత్యేక కమిటీలను వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసినట్లు పేర్ని నాని వెల్లడించారు. బాధితులను పరామర్శించడంతో పాటు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ హింసాకాండను మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేస్తామన్నారు. 26 జిల్లాలో ఏర్పాటైన లీగల్ టీమ్‌లు బాధితులకు అండగా నిలుస్తాయని, శుక్రవారం నుంచి చురుగ్గా పని చేస్తాయని తెలిపారు. కింది స్థాయి పోలీసులు కేసులు నమోదు చేయకుంటే ఎస్పీలను కలిసి న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు.

మా ప్రాణాలు కాపాడండి

- ఏపీలో వ్యవస్థీకృత హింసపై సుప్రీంను ఆశ్రయించిన బాధితులు
- ఎన్నికల అనంతరం రాష్ట్రంలో భయానక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా దాడులు
- గ్రామాలు వీడకుంటే చంపేస్తామంటూ హెచ్చరికలు
- ఆస్తుల ధ్వంసం.. మహిళలు, పిల్లలను హింసిస్తున్నారు
- పోలీసుల నిర్లిప్తతతో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి
- సాక్ష్యాధారాలతో ఈ-మెయిల్ ద్వారా సీజేఐకి బాధితుల ఫిర్యాదు
- సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారించాలంటూ అభ్యర్థన

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులు దాడులతో వ్యవస్థీకృత హింసకు పాల్పడుతుండటంపై బాధితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గ్రామాలు, ఆస్తులను వదిలేసి కట్టుబట్టలతో వెళ్లకుంటే హతమారుస్తామంటూ హెచ్చరిస్తున్నారని, ఆస్తులను ధ్వంసం చేస్తూ పిల్లలు, మహిళలను సైతం హింసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయని విన్నవించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న వ్యవస్థీకృత హింసను సుమోటోగా ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)గా స్వీకరించి ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించాలని అభ్యర్థించారు. వ్యవస్థీకృత హింసకు సంబంధించి మీడియా కథనాలు, సోషల్ మీడియా వీడియోల సాక్ష్యాధారాలతో బాధితులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి గురువారం ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు.

బాధితుల ఆక్రందన ఇదీ..

- ప్రస్తుతం రాష్ట్రంలోని పాలనా యంత్రాంగంలో నెలకొన్న అస్థిర పరిస్థితులను ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులు, పిల్లలు, మహిళలపై వ్యవస్థీకృత హింసకు పాల్పడుతున్నాయి. ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి.
- పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో అసాంఘిక శక్తులు యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడుతున్నాయి. గత 24 గంటల్లో హింసాత్మక సంఘటనలు భారీగా పెరిగాయి.
- సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించకుంటే ఈ వ్యవస్థీకృత హింస నుంచి బాధితులకు రక్షణ లభించదు. ఈ అంశాన్ని సుమోటో పిల్‌గా స్వీకరించి విచారించాలి. రాష్ట్ర ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాలి.

'అనంత'లో టీడీపీ దౌర్జన్యకాండ

అనంతపురం: ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కార్యకర్తలు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అరాచకాలు సృష్టిస్తున్నారు. గురువారం కూడా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు తెగబడ్డారు. ఉరవకొండలోని కణేకల్లు క్రాస్ వద్ద హోటల్‌లో బుధవారం టీ తాగుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఒక్కసారిగా తల, కాళ్లు, చేతులపై కర్రలతో దాడి చేశారు. ఇంత జరుగుతున్నా అక్కడే బందోబస్తులో ఉన్న స్పెషల్ పార్టీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యురాలు ఆశాబీ ఇంట్లోకి టీడీపీ కార్యకర్తలు చొరబడి ఆమె కుమారులు అక్బర్, ఇర్ఫాన్‌లపై దాడి చేశారు. చిలమత్తూరు మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల వద్దకు టీడీపీ కార్యకర్తలు వెళ్లి దాడులకు తెగబడ్డారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహమూర్తిపై దాడి చేసి, తల పగులగొట్టారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగభూషణం ఇంట్లో చొరబడి దాడికి యత్నించారు. తాడిమర్రి మండలం ఎం.అగ్రహారంలో గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లలో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో సచివాలయం ఆర్చ్‌పై ఉన్న వైఎస్సార్ బొమ్మను ధ్వంసం చేశారు. సచివాలయం, రైతు భరోసా శిలా ఫలకాలను ధ్వంసం చేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఉప్పరపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే బోర్డులను ధ్వంసం చేశారు.


టీడీపీ దాడులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి

- అరాచకాలను అడ్డుకోవాలి
- టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉంటాం
- సోషల్ మీడియా సైనికులకు అండగా నిలుస్తాం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొందని, గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని పచ్చ మూకల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అరాచకాలను తీవ్రంగా ఖండించారు. దాడులను అడ్డుకోవాలని గురువారం ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్) ద్వారా గవర్నర్‌కు విజ్ఞప్తి చేయడంతో పాటు, పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. 'రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ ముఠాలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. ఐదేళ్లు పటిష్టంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలి. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం' అని పేర్కొన్నారు.

కౌంటింగ్‌లో ఓట్ల తేడాలపై అధ్యయనం

- పోలింగ్ అక్రమాలపై కాలమే సమాధానం చెబుతుంది
- ఏమాత్రం అవినీతికి తావు లేకుండా ప్రజలకు పథకాలు అందించాం
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిని, ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచాం
- అంతకన్నా మెరుగ్గా పథకాలను అందిస్తామన్న కూటమిని ప్రజలు నమ్మారు
- ప్రజలకు అందుబాటులో ఉంటాం – కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో తేడాలపై అధ్యయనం చేస్తున్నామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. పోలింగ్ అక్రమాలపై కాలమే సమాధానం చెబుతుందని అన్నారు. ఆయన గురువారం ఉమ్మడి విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇక్కడ మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎలాంటి అవినీతికి తావు లేకుండా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందించిందని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలని విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలు తెచ్చామన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని, ప్రజల తలసరి ఆదాయాన్ని, వారి కొనుగోలు శక్తినీ పెంచామని వివరించారు. అంతకన్నా మెరుగ్గా సంక్షేమ పథకాలను అందిస్తామన్న కూటమిని నమ్మి ఈ ఎన్నికల్లో ప్రజలు వారిని గెలిపించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కూటమి ఆ హామీలన్నీ అమలు చేయాలని కోరారు. ప్రాజెక్టుల్లో కొద్దిపాటి మిగులు పనులనూ పూర్తి చేసి ప్రజలకు వాటి ఫలాలను అందించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు. ఏమాత్రం తేడా చేసినా నష్టపోయేదీ ప్రజలేనని అభిప్రాయపడ్డారు. ప్రజలు నష్టపోకూడదని, వారికి అన్నివిధాలా మేలు జరగాలని పార్టీ తరఫున ఆశిస్తున్నామన్నారు. ఐదేళ్ల పాటు ప్రజాసేవకు అవకాశమిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. ఇకపైన కూడా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా, ప్రత్యర్థులు ఇబ్బందులకు గురిచేసినా ఏమాత్రం వెరవకుండా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు చెప్పారు. వారికి అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రులు పీడిక రాజన్నదొర, పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అరాచకాన్ని అరికట్టండి

- ఏపీలో విధ్వంసకాండపై రాష్ట్రపతి, గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై యథేచ్ఛగా దాడులు
- తక్షణం జోక్యం చేసుకుని శాంతి భద్రతలు కాపాడాలని వినతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా కొనసాగుతున్న దాడులు, హింసాకాండను తక్షణం అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను పార్టీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వేళ అల్లరిమూకలు సంధి కాలాన్ని ఎంపిక చేసుకుని విధ్వంసాలకు తెగబడటం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టం చేసింది. అరాచక శక్తులు చెలరేగుతున్నా పోలీసు యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత దిగజారుస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేలా తక్షణం కఠిన చర్యలకు ఆదేశించాలని కోరింది. ఈమేరకు రాష్ట్రపతి, గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్ రెడ్డి గురువారం విడివిడిగా లేఖలు రాశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మరో లేఖ ద్వారా కోరారు. ఆ లేఖల్లో పేర్కొన్న వైఎస్సార్‌సీపీ ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు ఇవీ..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, పిల్లలపై దాడులు..

రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అసాంఘిక శక్తులు యథేచ్ఛగా హింసాకాండకు పాల్పడుతున్నాయి. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపిన వారిని లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయి. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలు, పిల్లలపై దాడులకు దిగడంతోపాటు ఇక మీదట మరింత తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బహిరంగంగానే హెచ్చరిస్తున్నాయి. బాధిత కుటుంబాలు ప్రాణ భయంతో ఇళ్లు, గ్రామాలను విడిచిపెట్టి వెళుతున్నాయి. వైఎస్సార్‌సీపీకి చెందినవారి ఆస్తులపై దాడులు చేస్తూ జీవనాధారాన్ని నాశనం చేస్తుండటంతో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి.

పోలీసు శాఖ నిర్లిప్తత

అల్లరి మూకలు దాడులకు పాల్పడుతున్న ఉదంతాలు ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలో ప్రసారమవుతున్నా పోలీసు యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందనా లేదు. పరిస్థితి తీవ్రతను ఏమాత్రం పట్టించుకోకుండా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. గత 24 గంటల్లో దాడులు, దౌర్జన్యాలు అమాంతం పెరగడం వెనుక పక్కా కుట్ర ఉంది.

ఇవిగో ఆధారాలు

వైఎస్సార్‌సీపీనేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై రౌడీమూకల దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసకాండకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, మీడియాలో ప్రచురితమైన కథనాలను మీకు సమర్పిస్తున్నాం. వాటిని పరిశీలించి రాష్ట్రంలో యథేచ్ఛగా సాగుతున్న విధ్వంసకాండ తీవ్రతను గుర్తించాలని కోరుతున్నాం. తక్షణం దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించాలి. శాంతి భద్రతలను కాపాడి ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించండి.

క్లుప్తంగా...

గతంలో చేసిన ఉపాధ్యాయ బదిలీలకు బ్రేక్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో పరస్పర బదిలీలు పొంది, ఎన్నికల నియమావళి అనంతరం కొత్త ప్రాంతంలో పోస్టింగ్ పొందాల్సిన ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులను నిలిపివేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి ఏప్రిల్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగత, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వారందరినీ ఏప్రిల్ నెలలో బదిలీ చేసిన విద్యా శాఖ విద్యార్థుల పరీక్షల అనంతరం కొత్త ప్రాంతంలో చేరేలా ఆదేశాలు ఇచ్చారు. అదే నెలలో ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. గురువారం నియమావళి ముగిసింది. అయితే, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు గతంలో చేసిన బదిలీలను నిలిపివేస్తూ ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశాలిచ్చారు.

ఉద్యోగులపై ఎన్నికల సస్పెన్షన్లు ఎత్తివేయాలి

ఎన్నికల సంఘానికి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా కోడ్ నిబంధనల పేరుతో పలువురు ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్లు ఎత్తివేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్నాడు, అనంతపురం జిల్లాలో నెలకొన్న హింసాత్మక ఘటనలను అడ్డుకోవడంలో విఫలమయ్యారనే కారణంగా సస్పెన్షన్‌కు గురైన ఐపీఎస్ అధికారులు బిందుమాధవ్, అమిత్ బర్దార్‌పై ఎన్నికల సంఘం సస్పెన్షన్‌ను ఎత్తివేసిందని లేఖలో గుర్తు చేశారు. చాలామంది ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదులు వ్యక్తిగత, రాజకీయ ద్వేషంతో కూడుకున్న తప్పుడు ఫిర్యాదులేనని సురేష్ బాబు పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయిన ఉద్యోగులు కూడా సస్పెన్షన్లకు గురయ్యారని తెలిపారు. తక్షణమే ఆ ఉద్యోగులపై ఉన్న సస్పెన్షన్ ఉత్తర్వులు, ఉద్యోగులకు ఇచ్చిన మెమోలను ఉపసంహరించుకునేలా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రేవ్ పార్టీపై దర్యాప్తు ముమ్మరం

బనశంకరి: బెంగళూరులోని ఎల్రక్టానిక్ సిటీ వద్ద ఇటీవల నిర్వహించిన రేవ్ పార్టీ కేసు కీలక మలుపు తిరిగే అవకాశం ఉంది. ఈ పార్టీలో డ్రగ్స్ సేవించారనే అభియోగంతో నటి హేమను సీసీబీ పోలీసులు విచారిస్తున్నారు. మరో రెండు రోజులపాటు ఆమెను కస్టడీకి తీసుకున్నారు. డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న వంద మందికిపైగా రక్తపరీక్షలు నిర్వహించగా, 86 మంది మత్తు పదార్థాలు సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. వారిలో విడతలవారీగా నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారు. అదేవిధంగా హేమకు కొందరు డ్రగ్ పెడ్లర్లతో సంబంధం ఉన్నట్లు సీసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ మాత్రమేగాక కొన్ని అక్రమ కార్యకలాపాలు కూడా నిర్వహించినట్లు సీసీబీకి సమాచారం లభించింది. పార్టీకి వచ్చిన యువతులకు, అక్కడ పాల్గొన్నవారితో అసలు పరిచయమే లేదని, ఆ యువతుల వద్ద లక్షలాది రూపాయలు పట్టుబడటం కూడా సందేహాలకు తావిస్తోందని సిట్ వర్గాలు తెలిపాయి.

పీహెచ్‌డీ ప్రవేశ ఇంటర్వ్యూలు వాయిదా

తిరుపతి సిటీ (తిరుపతి జిల్లా): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి ప్రకటించిన ఇంటర్వ్యూల షెడ్యూలు వాయిదా పడిందని ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు జరగాల్సిన ఇంటర్వ్యూలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, తదుపరి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

విభజన హామీలపై పోరాడాలి

నూతన ప్రభుత్వానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి సూచన

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): నూతనంగా ఏర్పడనున్న కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన హామీలపై పోరాడాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి సూచన చేసింది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సమితి ప్రతినిధి చలసాని శ్రీనివాస్, జైభారత్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ కావల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏ విధంగా ఆదాయ వనరులు సమకూరుస్తుందో చూడాలని తెలిపారు. అవన్నీ నెరవేరాలంటే ప్రత్యేక హోదాయే మార్గమన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయలేదని, ఇప్పుడు ఆ అవకాశం కూటమికి వచ్చిందని చెప్పారు. రైల్వేజోన్‌ను దేశంలో ఎక్కడా లేని విధంగా విభజన చేశారన్నారు. విభజన హామీలపై పోరాడే సమయం వచ్చిందని, ఆ దిశగా కృషి చేయాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని, రాష్ట్ర విభజనలో చాలా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ గొలివి అప్పలనాయుడు, ఏజే స్టాలిన్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగుతున్న అభిమానుల గుండెలు

జగన్ ఓటమిని తట్టుకోలేక పలువురి మృతి

మృతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

అండగా ఉంటామంటూ భరోసా

సాక్షి, నెట్‌వర్క్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ ఓటమిని తట్టుకోలేక గురువారం కూడా పలువురు గుండెపోటుతో మృతిచెందారు. మృతుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులకు సమీపంలోని గాంధీగనర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కిల్లో మోహన్



తండ్రి కిల్లో అప్పారావు(55) ఈ నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపులో జగన్‌కు వ్యతిరేకంగా వస్తున్న ఎన్నికల ఫలితాలను చూసి గుండె నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి.. మెరుగైన వైద్యం కోసం 108లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వైఎస్సార్ జిల్లాలో..



వైఎస్సార్ జిల్లా తెల్లపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని మాలేపాటి పెద్దనరసింహులు (65) గురువారం మృతిచెందాడు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా తన స్వగృహంలో టీవీ చూస్తూ వైఎస్సార్‌సీపీ ఓటమిని చూసి తట్టుకోలేక ఒక్కసారికి గుండెపోటుకు గురయ్యారు. వెంటనే 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ప్రాణాలు విడిచినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుడికి భార్య పార్వతి, కుమార్తె, ముగ్గురు కుమారులున్నారు.

గుంటూరు జిల్లాలో..



గుంటూరు జిల్లా కొమ్మూరు ఎస్సీ కాలనీకి చెందిన మూకిరి ఏషయ్య(46)వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అంటే ఎంతో అభిమానంగా ఉండేవాడు. మూడు రోజుల కిందట వెలువడిన ఎన్నికల ఫలితాలను చూసి అన్యాయం జరిగిందంటూ తీవ్ర మనోవేదనకు లోనవుతూ బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యుడు చెప్పాడు. ఆటో నడుపుకొనే ఏషయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనకాపల్లి జిల్లాలో..



అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ములగపూడికి చెందిన చిరుకూరి రాజుబాబు(72) వైఎస్సార్‌సీపీ అభిమాని. వైఎస్ జగన్ రెండోసారి సీఎం అవుతారని గ్రామంలో అందరితో చెబుతుండేవాడు. కౌంటింగ్ పూర్తయ్యాక వైఎస్సార్‌సీపీకి ఎక్కువ సీట్లు రాలేదని తెలియడంతో ఆందోళన చెందాడు. ఇక వలంటీర్లు పెన్షన్లను ఇంటికి తీసుకువచ్చి ఇవ్వరంటా.. అనే ప్రచారం జరగడంతో రెండు రోజులుగా దిగాలుగా ఉన్నాడు. గురువారం గుండెల్లో మంట వస్తుందంటూ కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు.

ప్రకాశం జిల్లాలో..



ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేములకు చెందిన వైఎస్సార్ వీరాభిమాని అన్నపురెడ్డి చిన గురవారెడ్డి(71) వైఎస్సార్‌సీపీ అభిమాని. దర్శి ఎమ్మెల్యేగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి గెలవడంతో బుధవారం గ్రామస్తులతో కలిసి దర్శి వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డితో చినగురవారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎవరికీ అన్యాయం చేయలేదని, అందరికీ న్యాయం చేశారని, ఆయనకు ఇంత అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే దిగులుతో ఇంటికి చేరుకున్న చినగురవారెడ్డి గురువారం రాత్రి గుండెపోటుతో ప్రాణాలు విడిచారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి జిల్లా చియ్యవరం గ్రామానికి చెందిన శ్రీరాములు(24) వైఎస్సార్‌సీపీకి వీరాభిమాని. ఆయన తన తల్లి పోలమ్మతో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలవడం, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విజయం లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై అన్నం తినడం మానేశాడు. తల్లి ఎంత బతిమాలినా మెతుకు ముట్టలేదు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఒక్కసారిగా స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు.

అబ్బయ్యచౌదరి ఓటమితో అభిమాని ఆత్మహత్య



దెందులూరులో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఓటమితో వైఎస్సార్‌సీపీ వీరాభిమాని రామారావుగూడెం యువకుడు సూరవరపు సాయిలింగాచార్యులు(23) ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం రామారావుగూడేనికి చెందిన సాయిలింగాచార్యులు వైఎస్సార్‌సీపీకి, కొఠారు అబ్బయ్యచౌదరికి వీరాభిమాని. ఇటీవల ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. జూన్ నాలుగో తేదీన వెలువడిన ఫలితాలు చూసి మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం అబ్బయ్యచౌదరిని కలుస్తానని చెప్పి బయలుదేరగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తల దాడులు జరుగుతున్న నేపథ్యంలో రెండు రోజులు ఆగి వెళదామని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు నచ్చజెప్పారు. ఈ క్రమంలో అభిమాన నేత ఓటమిని భరించలేక.. తీవ్ర మనోవేదనతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయి ఆత్మహత్య సమాచారం అందుకున్న అబ్బయ్యచౌదరి ఏలూరు వైద్యశాలకు వెళ్లి సాయి భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మృతుడి కుటుంబానికి కొడాలి నాని రూ.5 లక్షల సాయం

తన ఓటమిని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి భరోసా



సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కొడాలి నాని ఓటమిని జీర్ణించుకోలేక కృష్ణా జిల్లా గుడివాడ మండలంలోని సైదేపూడికి చెందిన పిట్టా అనిల్‌కుమార్(26) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కాగా గురువారం రాత్రి అనిల్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, పార్టీ నాయకులతో కలసి వెళ్లి పరామర్శించారు. రూ.5 లక్షల సాయమందించారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనిల్ పిల్లల చదువుకు అయ్యే ఖర్చంతా తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

రాజీనామా చేసి వెళ్లిపోండి

- ఇక మా వాళ్లు వచ్చి పాలన చేస్తారు
- తక్షణమే వర్సిటీలోని వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించండి
- ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు టీఎన్‌ఎస్‌ఎఫ్, టీడీపీ కార్యకర్తల అల్టిమేటం



ఎస్కేయూ వీసీ కె.హుస్సేన్‌రెడ్డిని రాజీనామా చేయాలని హెచ్చరిస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్, టీడీపీ నాయకులు

అనంతపురం: 'మా ప్రభుత్వం వచ్చింది. మావాళ్లే పాలిస్తారు. మీరంతా రాజీనామా చేసి వెళ్లిపోవాలి. అలాగే యూనివర్సిటీలోని వైఎస్సార్ విగ్రహాన్ని శుక్రవారం ఐదు గంటల్లోపు తొలగించాలి. లేకపోతే మీ ఇష్టం..' అంటూ తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్‌ఎస్‌ఎఫ్) నాయకులు, టీడీపీ కార్యకర్తలు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(ఎస్కేయూ) వీసీ కె.హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్యలకు అల్టిమేటం జారీ చేశారు. ఎన్నికల్లో టీడీపీ గెలిచిన నేపథ్యంలో ఆ పార్టీ కార్యకర్తలు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు గురువారం ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద సంబరాలు నిర్వహించారు. అనంతరం రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య చాంబర్‌కు వెళ్లి వెంటనే రాజీనామా చేయాలని పట్టుబట్టారు. 'ప్రభుత్వం మారింది. మాకు అనుకూలమైన అధికారిని నియమించుకుంటాం. వెంటనే వెళ్లిపోండి..' అని హెచ్చరించారు. అనంతరం వీసీ హుస్సేన్‌రెడ్డి చాంబర్‌కు వెళ్లి పదవికి రాజీనామా చేయాలని పట్టుబట్టారు. ఎస్కేయూలో ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని వెంటనే తొలగించాలన్నారు. ఇందుకోసం యూనివర్సిటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌ను పిలిపించాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిన వీసీ యూనివర్సిటీ ఎస్ఈని పిలిపించారు. యూనివర్సిటీలోని వైఎస్సార్ విగ్రహాన్ని తక్షణమే తొలగించాలని ఆయన్ను కూడా టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి సీఐ, ఎస్ఐ చేరుకుని టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు, టీడీపీ కార్యకర్తలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. వర్సిటీ ఉద్యోగి తిమ్మప్ప కూడా వీసీని బెదిరించడం మంచి పద్ధతి కాదని, క్రమశిక్షణగా ఉండాలని కోరారు. దీంతో వారంతా వైఎస్సార్ విగ్రహాన్ని ఎప్పటిలోగా తొలగిస్తారో చెబితే తాము వెళ్లిపోతామన్నారు. ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో శుక్రవారం వైఎస్సార్ విగ్రహం తొలగిస్తామని అధికారులు తెలిపారు. దీంతో టీఎన్‌ఎస్‌ఎఫ్, టీడీపీ నాయకులు వెళ్లిపోయారు.

అప్పటికప్పుడు పాలకమండలి సమావేశం

ఎస్కేయూలో వైఎస్సార్ విగ్రహాన్ని పాలకమండలి అనుమతితో ఏర్పాటుచేసినందున విగ్రహం తొలగించేందుకు కూడా పాలకమండలి అనుమతి కావాలి. దీంతో వీసీ, రిజిస్ట్రార్ గురువారం సాయంత్రం అందుబాటులో ఉన్న పాలకమండలి సభ్యులతో సమావేశం ఏర్పాటుచేశారు. యూనివర్సిటీలో వైఎస్సార్ విగ్రహం తొలగింపు డిమాండ్ గురించి ప్రభుత్వానికి లేఖ రాసి, ప్రభుత్వ సూచన మేరకు వ్యవహరించాలని పాలకమండలి నిర్ణయించింది. కాగా, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జేఎన్‌టీయూ(ఏ)లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఆడిటోరియానికి ఎన్టీఆర్ పేరు పెట్టారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించలేదు. ఆడిటోరియం పేరును మార్చలేదని, టీడీపీ ఇంకా అధికారం చేపట్టకమునుపే ఇలాంటి చర్యలకు పూనుకోవడాన్ని విద్యార్థులు, అధ్యాపకులు తప్పుపడుతున్నారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

- పలుచోట్ల పిడుగులు పడే అవకాశం



తిరుమల ఆలయం వెలుపల జోరువానలో వస్తున్న భక్తులు

విశాఖపట్నం (ఏయూ క్యాంపస్): నైరుతి రుతు పవనాలు మధ్య అరేబియా సముద్రంలోను, కర్ణాటకలోని మిగిలిన భాగాలు, దక్షిణ మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తరాంధ్ర మరికొన్ని ప్రాంతాల్లో ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ వెల్లడించారు. శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం అల్లూరి, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువులో 44 మి.మీ, నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 40 మి.మీ, శ్రీ సత్యసాయి జిల్లా నంబుపూలకుంటలో 39 మి.మీ, నెల్లూరు జిల్లా సైదాపురంలో 39 మి.మీ, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 36 మి.మీ, తిరుపతి జిల్లా పుత్తూరులో 30 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైందని వివరించారు.

తిరుమలలో భారీ వర్షం

తిరుమల: తిరుమలలో భారీ వర్షం కురిసింది. తిరుమల అంతా జలపాతాలను తలపిస్తున్నాయి. భక్తులు కొద్దిపాటి ఇబ్బందులకు గురైనా ప్రకృతి ఇస్తున్న చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. తిరుమలలో రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. భారీగా కురిసిన వర్షానికి నాలుగు మాడ వీధులు జలమయమయ్యాయి.


జలాశయాలన్నీ ఖాళీ

- కనిష్ట స్థాయికి చేరుకున్న నీటి నిల్వలు
- కేంద్ర జలసంఘం తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లోని శ్రీశైలం, నాగార్జునసాగర్‌తోపాటు దేశవ్యాప్తంగా 150 ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ జలాశయాల గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 257.812 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) కాగా.. ఇందులో లైవ్‌స్టోరేజ్ సామర్థ్యం 178.784 బీసీఎంలు. ఈ రిజర్వాయర్లలో గురువారం సాయంత్రానికి కేవలం 39.765 బీసీఎంలు మాత్రమే నిల్వ ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి ఆ రిజర్వాయర్లలో 50.549 బీసీఎంలు నిల్వ ఉండేవి. గత పదేళ్లలో ఇదే కనిష్ట నీటినిల్వ. ఈ మేరకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజా నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలంలో 806.7 అడుగుల్లో 32.42 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 504.6 అడుగుల్లో 122.69 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టులో 94.85 అడుగుల్లో 0.41 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. అలాగే, రాష్ట్రంలో పెన్నా బేసిన్‌లోని గండికోటలో 2.52 టీఎంసీలు, సోమశిలలో 8.16 టీఎంసీలు, కండలేరులో 7.25 టీఎంసీలు ఉన్నాయి. నైరుతి రుతు పవనాల ప్రభావంవల్ల నదీ పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిస్తే జలాశయాల్లోకి వరద ప్రవాహం ప్రారంభమవుతుంది.

కార్యకర్తలను కాపాడుకుంటాం

- ఫలితాలు వచ్చిన 4 గంటల్లోనే రాప్తాడులో 27 దాడులు జరిగాయి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- కార్యకర్తల్లో ధైర్యం నింపుతాం: మాజీ ఎంపీ మాధవ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ప్రాణాలు అడ్డువేసైనా టీడీపీ దాడుల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన 4 గంటల్లోనే రాప్తాడులో 27 అవాంఛనీయ ఘటనలు జరిగాయని ప్రకాష్‌రెడ్డి చెప్పారు. కనగానపల్లి మండలంలోని 7 గ్రామాల్లో, రామగిరిలో 6 గ్రామాల్లో, చెన్నేకొత్తపల్లిలో 7 గ్రామాల్లో, ఆత్మకూరులో 5 ప్రాంతాల్లో, రాప్తాడులో రెండోచోట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వారి ఆస్తులపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారన్నారు. చాలామందికి తీవ్ర గాయాలై ఆస్పత్రుల పాలయ్యారని చెప్పారు. గోరిదిండ్లలో వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చారన్నారు. ఎస్కేయూలోనూ వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తున్నారని అన్నారు. ఈ దాడులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎవరిపైనా తమ నాయకులు, కార్యకర్తలు ఇలా దాడులకు పాల్పడలేదని తెలిపారు. ఎవరెంతగా రెచ్చగొట్టినా శాంతియుతంగా ఉండాలని కార్యకర్తలకు చెప్పామని, అది వైఎస్సార్‌సీపీ నైజమన్నారు. పార్టీ శ్రేణులపై దాడులు జరుగుతున్నా ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆ పార్టీ పెద్దలు నోరుమెదపడం లేదన్నారు. పోలీసు వ్యవస్థను నమ్ముదామని, వారు స్పందించకుంటే కోర్టులను ఆశ్రయిద్దామని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి, మంచి చేస్తే స్వాగతిద్దామన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారా? ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ ఇస్తారా? సీపీఎస్ రద్దు చేస్తారా? 20 లక్షల ఉద్యోగాలిస్తారా అని ప్రశ్నించారు.

తాలిబన్ల తరహాలో దాడులు

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. టీడీపీ శ్రేణులు తాలిబన్ల తరహాలో దాడులకు పాల్పడుతున్నారన్నారు. తమ ప్రాణాలను అడ్డు వేసైనా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. దాడులపై జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారిలో మనోధైర్యాన్ని నింపుతామని తెలిపారు.

భూమి చుట్టూ 310 రౌండ్లు

వందేభారత్ రైళ్లు అంత దూరం తిరిగాయంటున్న రైల్వేశాఖ

సాక్షి, హైదరాబాద్: రైల్వే ఆధునికీకరణలో భాగంగా కొత్తగా ప్రారంభించిన వందేభారత్ రైళ్లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రైళ్లకు ఇప్పుడు ఉన్న డిమాండ్ అంతాఇంతా కాదు. 2019 ఫిబ్రవరి 15న ప్రారంభమైన వందేభారత్ రైళ్లు ఇప్పటి వరకు తిరిగిన నిడివిని పరిశీలిస్తే.. 310 పర్యాయాలు భూపరిభ్రమణం చేసిన దూరంతో సమానమట. ఇది సరికొత్త రికార్డు అంటూ రైల్వే శాఖ వివరాలు వెల్లడించింది.

సెమీ హైస్పీడ్ రైళ్లుగా...

రైళ్ల వేగాన్ని గరిష్టస్థాయికి తీసుకెళ్తూ సెమీ హైస్పీడ్ రైళ్లుగా వీటిని ప్రారంభించారు. గంటకు 160 కి.మీ. వేగ సామర్థ్యమున్న ఈ రైళ్లు సగటున 130 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 60 వరకు సర్వీసులు (స్పెషల్ రైళ్లు కలుపుకొని) సేవలు అందిస్తున్నాయి. తొలి రైలు 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. అన్ని వందేభారత్ రైళ్లు 18423 ట్రిప్పులు తిరిగాయి. వీటి మొత్తం నిడివి1,24,87,540 కిలోమీటర్లుగా నమోదైంది. ఇది 310 పర్యాయాలు భూమి చుట్టూ పరిభ్రమించిన దూరంతో సమానమని రైల్వే శాఖ పేర్కొంది. గత ఏడాది కాలంలో 97,71,705 కి.మీ.లు తిరిగినట్టు వెల్లడించింది.

105.57 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్ల సగటు 105.57 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో తిరుగుతున్నాయి. వీటిలో కేరళలో తిరుగుతున్న వందేభారత్ రైలు గరిష్ఠంగా 175.3 శాతం ఆక్యుపెన్సీ రేషియోను నమోదు చేసింది. వందేభారత్ రైళ్లలో తిరుగుతున్న ప్రయాణికుల్లో 26–45 ఏళ్ల మధ్య ఉన్నవారు 45.9 శాతంగా నమోదవుతోంది. కేరళలో తిరుగుతున్న వందేభారత్ సర్వీసుల్లో అత్యధికంగా 15.7 శాతం వృద్ధులు ప్రయాణిస్తున్నట్టు తేలింది. గోవాలో తిరుగుతున్న వందేభారత్ రైళ్లలో అత్యధికంగా 42 శాతం మంది మహిళా ప్రయాణికులుంటున్నారు.

ప్రజల వెంటే ఉంటాం

- 99 శాతం మేనిఫెస్టో అమలు చేసినా ప్రజలు ఇంకా ఏదో కోరుకున్నారు
- స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడాల్సిన బాధ్యత కూటమిదే
- ఓటమికి కారణాలను సమీక్షిస్తాం
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, తాము ప్రజల వెంటే ఉంటామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి పైనే దృష్టి పెట్టిందని, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంస్కరణలను అమలు చేశామని చెప్పారు. అయితే, పార్టీ కార్యకర్తలకు తగిన గౌరవం లభించలేదన్నారు. నేరుగా ప్రజలకే సంక్షేమ పథకాలు అందజేసి, పార్టీలకు అతీతంగా పథకాలు అందజేశామని, ఈ క్రమంలోనే కార్యకర్తలను కొంత నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమేనన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం మేనిఫెస్టోను అమలు చేశారని, ప్రజలు అడగకుండానే సంక్షేమ కార్యక్రమాలను అందజేశారని తెలిపారు. అయినప్పటికీ ఎన్నికల్లో ఇటువంటి ఫలితం రావడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అడగకుండానే ప్రజలకు అన్నీ చేసిన వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వలేదంటే, ప్రజలు ఇంకా ఏదో కోరుకుంటున్నారన్న భావన తమకు ఏర్పడిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవస్థలో మార్పులు తెచ్చామని, దీనిని కూడా ప్రజలు స్వాగతించలేదేమోనని చెప్పారు. ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పాలనను అందించినా ఇలాంటి తీర్పు ఇవ్వటం బాధాకరంగా ఉందన్నారు. ఓటమికి కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేశారని, ఈ అంశం ప్రభుత్వానికి రెఫరెండం అని అన్నారు. మూడు రాజధానులు ప్రకటించినా అమరావతికి తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని తెలిపారు. అమరావతితో పాటు విశాఖ నగర అభివృద్ధికి కూడా కృషి చేయాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. తమ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కూటమికి ఓటేస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగి తీరుతుందని తెలిసినా కూడా గాజువాక ప్రజలు కూటమికే ఓటు వేశారన్నారు. ఇప్పటికైనా కూటమి భాగస్వామ్య పార్టీలు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎవరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడబోమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించిన 48 గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. వీటిని అరికట్టే బాధ్యత పవన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ కార్యకర్తలను వేధిస్తే సహించబోమని హెచ్చరించారు.

కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలకు అభినందనలు

ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్, పురందేశ్వరితో పాటు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా గెలిచిన వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ప్రజలకు వారు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కేంద్రానికి వీరి అవసరం ఉన్నందున.. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కావల్సిన నిధులను సాధించాలని చెప్పారు.

“అల్లాహ్ ప్రజల కొరకు ఏ కారుణ్యాన్ని పంపినా దానిని ఆపేవాడు ఎవ్వడూ లేడు. ఏ కారుణ్యాన్నైనా ఆయన ఆపితే, ఆ తరువాత దానిని పంపగలవాడు కూడా ఎవ్వడూ లేడు. ఆయన సర్వ శక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 7 జూన్ 2024

మెక్సికో పీఠంపై మహిళ!

అపారమైన వనరులున్నా ఏనాడూ కంటి నిండా కునుకు లేని మెక్సికో ప్రజానీకం అధ్యక్ష ఎన్నికల్లో వరసగా రెండోసారి సైతం వామపక్ష మొరెనా పార్టీకి పట్టంగట్టారు. ఆరుపదుల వయసుగల యూదు మహిళ క్లాడియా షీన్‌బామ్‌ను అధ్యక్ష పీఠానికి ఎన్నుకున్నారు. రెండు శతాబ్దాల రిపబ్లిక్ చరిత్రలో మహిళ దేశాధినేత కావటం ఇదే ప్రథమం. జనాభాలో యూదులు అత్యల్ప సంఖ్యాకులు కావటం గమనించదగ్గది. వచ్చే అక్టోబర్‌లో ఆమె పదవీబాధ్యతలు చేపడతారు. ఆకలి,నిరుద్యోగం, డ్రగ్స్ విజృంభణ, వ్యక్తుల అదృశ్యం... ఒకటి కాదు, మెక్సికోను సవాలక్ష సమస్యలు పీడిస్తున్నాయి. అంతటా నిరాశా నిస్పృహలు అలుముకున్న తరుణంలో అంతవరకూవున్న రెండు పార్టీల వ్యవస్థను బద్దలుకొడుతూ మొరెనా పార్టీ రంగంలోకొచ్చింది. 2018లో ఆరేళ్లకాలానికి అధ్యక్షుడైన ఆండ్రెస్ మ్యాన్యువల్ లొపెజ్ అబ్రడార్ (ఆమ్లో) ఆశించిన స్థాయిలో పాలించకపోయినా శాంతిభద్రతలను కాస్త అదుపు చేయగలిగారు.

అదే సమయంలో సంక్షేమపథకాలు అందించటం, మౌలిక సదుపాయాలు పెంచటం మొరెనా పార్టీని రెండోసారి అందలం ఎక్కించింది. అలాగని అంతా సవ్యంగా ఉందని కాదు. ఏడాదికి సగటున 30,000 హత్యలు జరగటం, అందులో 90 శాతం మిస్టరీగా మిగిలిపోవటం మెక్సికో ప్రత్యేకత. ఈ హత్యల్లో డ్రగ్స్ మాఫియాల వాటాతోపాటు, వాటిని అదుపు చేసే సాకుతో పారా మిలిటరీ దళాలు సాగించే నరమేధమూ ఉంటుంది. మారుమూల పల్లెల్లో ఏదో ఒకచోట హఠాత్తుగా ఖననం చేసిన శవాల గుట్టలు లేదా మాదకద్రవ్యాల డంప్‌లు బయటపడతాయి. అమెరికాకు చాటుగా వలసదారుల తరలింపు మరో పెద్ద వ్యాపారం. మూడునెలలక్రితం అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొండ ప్రాంత ఆవాసాలపై మాదకద్రవ్య ముఠాలు డ్రోన్లతో బాంబుల వర్షం కురిపించి వందలాది పౌరులను హతమార్చటంతోపాటు ఇళ్లను దహనం చేశారు. గ్రామస్థులు తమ సమాచారం పారా మిలిటరీ దళాలకు చేరేస్తున్నారన్నది వారి అనుమానం. ఈ అధ్యక్ష ఎన్నిక సందర్భంగా దాదాపు డజనుమంది అభ్యర్థుల్ని మాదకద్రవ్యాల ముఠా కాల్చిచంపింది. ఇన్ని సమస్యలతో సతమతమయ్యే దేశానికి అధ్యక్షురాలు కావటం నిజానికి కత్తి మీద సామే. చిత్రమేమంటే అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆమె శాంతిభద్రతల అదుపు కోసం ఏం చేస్తానన్నది చెప్పలేదు. కానీ మెక్సికో నగర మేయర్‌గా పనిచేసిన అనుభవం ఆమెకు అక్కరకొస్తుందన్న ఆశ జనానికి ఉంది. నగరాన్ని సీసీ కెమెరాలతో నింపడం, నేరాలు తరచూ జరిగే ప్రాంతాల్లో నిరంతరం పోలీసు బలగాలను మోహరించటం వంటివి హత్యలను గణనీయంగా తగ్గించాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ సంఖ్య వాస్తవాలను ప్రతిబింబించటం లేదన్నది విపక్షాల ఆరోపణ.

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన 1968 నాటి విద్యార్థి ఉద్యమంతో సహా అనేక సామాజికోద్యమాల్లో పాల్గొన్న యూదు కుటుంబంలో జన్మించటం వల్ల అటు రాజకీయాలపైనా, ఇటు పర్యావరణంపైనా ఆమెకు ఆది నుంచీ ఆసక్తి. అందుకే ఆ రంగంలో ఆమె పీహెచ్‌డీ చేయటంతో పాటు క్యాలిఫోర్నియా యూనివర్సిటీలో తన అధ్యయనాన్ని కొనసాగించి నైపుణ్యానికి పదును పెట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినందుకు 2007లో నోబెల్ పురస్కారాన్ని గెల్చుకున్న శాస్త్రవేత్తల బృందంలో క్లాడియా ఒకరు. 2018లో తెరపైకొచ్చిన మొరెనా పార్టీ ఆమెను సహజంగానే ఆకర్షించింది. వెంటనే మెక్సికో మేయర్ పదవి కూడా వరించింది. ఆ పదవికి మహిళ ఎన్నిక కావటం కూడా అదే ప్రథమం. 31 రాష్ట్రాలూ, 13 కోట్ల జనాభాగల దేశంలో నేరాలను అరికట్టడం మెక్సికో నగరాన్ని దారికి తెచ్చినంత సులభం కాదు. చాలా రాష్ట్రాల్లో మాదకద్రవ్య ముఠాలు వాహన సముదాయాల్లో ఏకే-47 తుపాకులతో సంచరించటం, పోలీసులు సమాచారం అందుకుని వచ్చేలోపే హత్యాకాండ ముగించి నిష్క్రమించటం తరచు కనబడే దృశ్యాలు. తల్లిదండ్రుల ఆలనా పాలనాలేని పిల్లల్ని, యువతను చేరదీస్తామని వారిలో అమాయకంగా కనబడేవారికి ప్రాధాన్యమిచ్చి ఏళ్ల తరబడి ఆయుధ శిక్షణ ఇచ్చి మాదకద్రవ్యాల పంపిణీకీ హత్యలకూ వినియోగిస్తామని మాదకద్రవ్య ముఠా నాయకుడొకరు చెప్పాడు. ఆ కోణంలో దృష్టి సారించి పాఠశాల విద్య నుంచే స్కాలర్‌షిప్ లిచ్చే పథకాన్ని ఆమ్లో అమలుచేశారు. కానీ పెద్దగా ఫలించలేదు.

ఇవన్నీ అంతర్గత సమస్యలు. పొరుగునున్న అమెరికాతో అనేక పేచీలున్నాయి. ఆ దేశంలో ట్రంప్ తిరిగి అధికారంలోకి రాబోతున్నారన్న కథనాలు మెక్సికోకు ఇబ్బందిగానే ఉన్నాయి. ఆ దేశం నుంచి వలసలను అరికట్టడానికీ, మాదకద్రవ్యాలను కట్టడి చేయటానికీ సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానని గతంలో ట్రంప్ ప్రకటించి పని మొదలెట్టినా బైడెన్ వచ్చాక ఆగిపోయింది. మరోపక్క లాటిన్ అమెరికా దేశాల్లో అమెరికాతో వాణిజ్యం నెరపే దేశాల్లో మెక్సికోయే నంబర్ వన్. అందువల్ల ఆ దేశాన్ని అంత సులభంగా అమెరికా వదులుకోలేదు. పైగా మెక్సికో పరిశ్రమల్లో ఉత్పత్తయ్యే కార్ల విడిభాగాల వల్లే అమెరికాలోని డెట్రాయిట్‌లో కార్ల పరిశ్రమలు సజావుగా సాగుతున్నాయి. మెక్సికో పవన విద్యుత్‌తోనే అమెరికా తయారీరంగ పరిశ్రమలు లక్షలమంది అమెరికన్లకు ఉపాధినిస్తున్నాయి. హృద్రోగులకు వాడే పేస్‌మేకర్లు మొదలుకొని పండ్లు, కూరగాయలు, ఆహారధాన్యాల వరకూ చాలా భాగం మెక్సికో నుంచి రావాల్సిందే. అందుకే ఇరుదేశాల వాణిజ్యమూ నిరుడు 80 వేల కోట్ల డాలర్ల వరకూ సాగింది. కనుక నేరస్థముఠాలను అరికట్టి శాంతిభద్రతలు తీసుకురాగలిగితే మెక్సికో సుసంపన్న దేశాల్లో ఒకటై నిలుస్తుంది. క్లాడియా ఆ పని చేయగలరా అన్నదే పెద్ద ప్రశ్న.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.పాడ్యమి సా.4.53 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మృగశిర రా.8.16 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.4.46 నుండి 6.23 వరకు, (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.25 నుండి 1.17 వరకు, **అమృతఘడియలు:** ప.11.40 నుండి 12.34 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కాంగ్రెస్‌కు ఊపు... మోదీకి మేలుకొలుపు

అభిప్రాయం



సంజయ్ బారు

భారత్‌ను 'కాంగ్రెస్ ముక్త్' చేస్తానన్న మోదీ తన విధానాల ద్వారా అదే కాంగ్రెస్ పునరుద్ధరణకు తన వంతు కృషి చేశారు. ఫలితంగా బీజేపీ మెజారిటీ తగ్గింది. కేంద్రంలో సంకీర్ణం అనివార్యమైంది. ఎన్డీయే ప్రభుత్వ సుస్థిరతకు బలహీనపడిన మోదీ ఏం చేస్తారు? సంకీర్ణాల కంటే ఒకే పార్టీ మెజారిటీ ప్రభుత్వాలే మంచివనే అభిప్రాయం ఉంది. వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి, పేదరికం తగ్గింపు, ఉపాధి పెరుగుదల వంటి అంశాల పరంగా దేశానికి అత్యుత్తమ కాలం 1991 నుండి 2014 వరకు గల పావు శతాబ్దం. పీవీ నరసింహరావు, వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ లాంటి పెద్దమనుషులు అప్పటి సంకీర్ణ ప్రభుత్వాలకు నాయకత్వం వహించారు. మోదీ వారిలా వ్యవహరించగలరా?

అమెరికా పౌరహక్కుల నేత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌కు ఒక కల ఉండేది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఒక కల ఉంది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వెళుతున్నప్పుడు భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఒక కల ఉండింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 400కు పైగా సీట్లు వస్తాయని ఆయన ఊహించారు. ఈ వారం ఆ కల చెదిరిపోయింది. 2014లో బీజేపీని పునరుద్ధరించడం మోదీ చేసిన ప్రధాన రాజకీయ తోడ్పాటు. కాగా, 2024లో ఆయన చేసిన అతిపెద్ద రాజకీయ దోహదం భారత జాతీయ కాంగ్రెస్ పునరుద్ధరణ.

నిజానికి, రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'తో తన సొంత గుర్తింపులోకి వచ్చారు. మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ పార్టీకి పరిణతి చెందిన, వివేకవంతమైన నాయకత్వాన్ని అందించారు. అయితే మోదీ తన రెండవ పాలనా కాలంలో చేపట్టిన విధానాలు, విభజన రాజకీయాలు, అథమ స్థాయి ఎన్నికల ప్రచార సరళి అనేవి టోకున కాంగ్రెస్ అదృష్టాన్ని పునరుద్ధరించడంలో తమ పాత్రను పోషించాయి. భారత్‌ను 'కాంగ్రెస్ ముక్త్'గా మారుస్తానని మోదీ 2014 ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 2024 ఎన్నికల ముగింపులో, అదే కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణలో తన వంతు కృషి చేసినందుకు మోదీకి ఆ పార్టీ కృతజ్ఞతలు చెప్పాలి. ఒక దశాబ్ద కాలంగా వెనుకబడి పోయిన దశ నుండి యవ్వన, శక్తిమంతమైన కాంగ్రెస్ ఉద్భవించింది.

మోదీ మూడోసారి ప్రధానిగా చరిత్ర సృష్టించబోతున్నారు. ప్రశ్న ఏమిటంటే, ఎన్డీయే ప్రభుత్వ సుస్థిరతకు బలహీనపడిన మోదీ ఏం చేస్తారు? మరీ ముఖ్యంగా, నారా చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ వంటి మిత్రపక్షాలపై ఆధారపడబోతున్న ఎన్డీయే ప్రభుత్వ విధానం ఎలా ఉండబోతోంది? మరోసారి ప్రభుత్వ స్థాపన కోసం మోదీ తన 'హామీలు' ఇచ్చారు. అధికారం కోసం మోదీ పక్షాన ఉన్నప్పటికీ చంద్రబాబు గానీ, నితీష్‌గానీ బీజేపీ ఎజెండా వైపు సైద్ధాంతికంగా మొగ్గు చూపడం లేదు. మరి ఈ కలయిక పనిచేస్తుందా?

2024 జూన్ చాలావరకు 2004 మే లాగా అనిపిస్తుంది. ప్రతి రాజకీయ విశ్లేషకుడు, ఎన్నికల నిపుణుడు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఎన్డీయే విజయం సాధిస్తుందని అంచనా వేశారు. కానీ ఫలితాలు రాగానే స్టాక్ మార్కెట్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. కొన్ని గంటల్లోనే, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్(యూపీఏ) అనే కొత్త కూటమికి శంకుస్థాపన జరిగింది. లెఫ్ట్ ఫ్రంట్ బయటి మద్దతుతో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. అమిత్ షా... ప్రమోద్ మహాజన్ కావచ్చు గానీ మోదీ మాత్రం వాజ్‌పేయి కాదు. వాజ్‌పేయి వెనక్కి తగ్గారు. కానీ మోదీ, షా వెనక్కి తగ్గుతారా? మొత్తానికి ఎన్నికల ప్రచారం 'మోదీ కి గ్యారంటీ' గురించే. ఆయన హామీలను నిలబెట్టడానికి ఎన్డీయే ప్రభుత్వం సుముఖంగా ఉంటుందా?



చంద్రబాబు, నితీష్‌లపై దేశం ఒక ముఖ్యమైన బాధ్యతను మోపింది. ఇద్దరూ చిత్తశుద్ధి లేదా దార్శనిక దృష్టి గల వ్యక్తులుగా నిరూపితం కాలేదు. ఇద్దరూ స్వప్రయోజనాలు, అధికారం కోసం తహతహలాడుతున్నారు. అయినప్పటికీ, సాధారణ వ్యక్తుల నుండి హీరోయిజాన్ని డిమాండ్ చేసే విచిత్రమైన మార్గం చరిత్రకు ఉంది. విధి, రాజకీయాలు పీవీ నరసింహారావుకు ఎలాంటి పాత్రను కేటాయించడం జరిగిందో గుర్తుంచుకోండి. రాజకీయ విరమణ అంచున, ఆధ్యాత్మిక మార్గం పట్టడానికి తన బ్యాగులను సర్దుకుంటూన్న పీవీ నరసింహారావును ప్రధానమంత్రిని చేయడమే కాకుండా, దేశ విధిని మార్చే నిర్ణయాలను తీసుకునే బాధ్యతను కూడా చేపట్టేలా చేశాయి. మోదీ, షాల ఆధిపత్యంలో, నియంత్రణలో ఉన్న ప్రభుత్వానికి జూనియర్ భాగస్వాములుగా ఉన్న నితీష్, చంద్రబాబు అలాంటి పాత్ర పోషించగలరా? కష్టమే మరి. ఎందుకంటే ప్రధానమంత్రి ఆదేశం మేరకు అన్ని సంస్థలు ప్రతిరోజూ వారిని అదుపులో ఉంచుతాయి. మోదీ తన జీవిత పర్యంతం కఠినమైన రాజకీయ బేరసారాలను సాగిస్తూ వచ్చారు. సుష్మా స్వరాజ్‌ను పక్కన పెట్టి, అరుణ్ జైట్లీని తన విశ్వాసంలోకి తీసుకుని, లాల్ కృష్ణ అద్వానీ నుంచి బీజేపీని ఆయన ఎలా లాక్కున్నారో గుర్తు చేసుకోండి. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే... చంద్రబాబు, నితీష్ అలాంటి బేరాలు చేసేంత గట్టిగా ఉండగలరా?

సంకీర్ణ ప్రభుత్వాల కంటే ఒకే పార్టీ మెజారిటీ ప్రభుత్వాలే మంచివి అని ఒక సాధారణ అభిప్రాయం ఉంది. కానీ వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. అనేక విధాలుగా, స్వాతంత్ర్యానంతర మొదటి దశాబ్దం తర్వాత... ఆర్థికాభివృద్ధి, పేదరికం తగ్గింపు, ఉపాధి పెరుగుదల, ప్రపంచ ప్రొఫైల్ మరియు దేశీయ సామాజిక స్థిరత్వం వంటి అంశాల పరంగా దేశానికి అత్యుత్తమ కాలం 1991 నుండి 2014 వరకు గల పావు శతాబ్దం. ముగ్గురు మేధావులు, అందరినీ కలుపుకొనిపోయే వివేకవంతులైన పెద్దమనుషులు భారతదేశ ప్రధానులు అయ్యారు. పీవీ నరసింహా రావు, అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ అప్పటి సంకీర్ణ ప్రభుత్వాలకు నాయకత్వం వహించారు. పీవీ విషయంలో కాంగ్రెస్ పార్టీయే స్వయంగా ఒక సంకీర్ణంలా పనిచేసింది. వాజ్‌పేయి, మన్మోహన్ స్పష్టమైన సంకీర్ణాలకు నాయకత్వం వహించారు. ఖర్గే వంటి మరో ప్రసన్నమైన పెద్దమనిషి నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే, అది సుస్థిరతతో పాటు వివేకవంతమైన విధానాలను అందించదని నమ్మడానికి ఎటువంటి కారణమూ లేదు.

మోదీ వ్యక్తిత్వం, భావజాలం, ఆకాంక్షల దృష్ట్యా ఆయన మూడవసారి తన అధికార అన్వేషణలో అన్ని ప్రయత్నాలూ చేస్తారు. సంకీర్ణానికి ఆయన ఎలాంటి ప్రధానమంత్రి అవుతారో చూడాలి. తాను ఎలా ప్రవర్తిస్తారు, ఎలా పని చేస్తారు అనేది తన మిత్రపక్షాలు, తన సీనియర్ సహోద్యోగులు, బ్యూరోక్రసీ, జ్ఞానం, ధైర్యంపై ఆధారపడి ఉంటుంది. బ్యూరోక్రసీని వంగమని అడిగినప్పుడు తరచుగా అది పొర్లుదండాలు పెడుతుంది. మోదీ, షా పాలన భారత ప్రజాస్వామ్యంలోని ప్రతి వ్యవస్థనూ నిర్వీర్యం చేసింది. చంద్రబాబు, నితీష్ వారిని అదుపు చేయగలరా?

కన్యాకుమారి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే విమానంలో మోదీ మూడు కీలకాంశాలను పేర్కొంటూ ఒక వ్యాసం రాశారు. మొదటిది – ఇక మీదట ఇండియా... భారత్ మాత్రమే! అధికారికంగా ఈ మార్పు చేయాలంటే, దానికి రాజ్యాంగ సవరణ అవసరం అవుతుంది. దీనిపై ఆయన ముందుకు సాగలేరు. రెండవది– 'జీవితంలో ప్రతి అంశంలో' దేశానికి సంస్కరణ అవసరమని సూచించడం ద్వారా మోదీ 'సంస్కరణ' అనే పదానికి కొత్త నిర్వచనాన్ని వివరించారు. తాజాగా బలహీనపడిన మోదీ అటువంటి సంస్కరణకు నాయకత్వం వహించగలనని భావిస్తున్నారా? మూడవది– దేశం 'కొత్త కల' కనవలసిన అవసరాన్ని ప్రస్తావిస్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను మోదీ అనుకరించారు. ఒక దశాబ్దం క్రితం 'అమెరికన్ డ్రీమ్'లోంచి జిన్‌పింగ్ 'చైనా డ్రీమ్'ను ఎక్కువ భాగం అరువు తెచ్చుకున్నారు. కాకపోతే అమెరికన్ స్వప్నం, చైనా స్వప్నం రెండూ 'మంచి జీవితాన్ని గడపడం' గురించినవి. దేశ ప్రజలు 'వికసిత్ భారత్' కావాలని కల కనాలని మోదీ అంటున్నారు.

తదుపరి కేంద్ర ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహిస్తారనే దానితో సంబంధం లేకుండా భారతదేశం 'వికసిత్'గా ఉంటుంది. కాబట్టి, లోక్‌సభలో 400కు పైగా స్థానాల మోదీ కల సాకారం కానప్పటికీ, అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దేశ స్వప్నం మాత్రం కాలక్రమేణా సాకారం అవుతుంది. బీజేపీ, ఇంకా మోదీ విషయానికొస్తే, ఓటర్ల మేల్కొలుపు పిలుపుతో వారి కలలు చెదిరిపోయాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మర్యాద ముఖ్యం



తమ సాటి మనుషులను దూషించేవాళ్లు, అదేపనిగా అవమానించేవాళ్లు ఇస్లాం ప్రవక్త ప్రేమికులు కాలేరు. మర్యాదపూర్వకంగా ఒక చర్చలో భాగం కాలేనివాళ్లు విశ్వాస సంరక్షకుడు కాలేరు; అది ఏ విశ్వాసం అయినా సరే. కొంతమంది మనుషులను నిందిస్తూనే ఉంటారు. వాళ్లు ప్రవక్తను ప్రేమించలేరు.

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

పొరుగు ముఖ్యం



నూతన మోదీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి మాల్దీవుల అధ్యక్షుడు ముయిజునూ కూడా ఆహ్వానించారు. ఇరుగు పొరుగు ముందు! ఎప్పటికీ మాల్దీవులు వ్యూహాత్మకంగా ఇండియాకు చాలా ప్రాధాన్యం కలిగినదే.

– గీతా మోహన్, జర్నలిస్ట్

లేరు లెజెండ్స్



ఇరవై ఏళ్లలో తొలిసారి... అవును, ఇరవై ఏళ్లలో తొలిసారి... పురుషుల ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్స్‌లో నాదల్, ఫెదరర్, జొకొవిచ్ ఆడటం లేదు.

– ఎం.ఎస్.పార్థ్, ఫెదరర్ అభిమాని

మరో దేశం



అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా సాగుతున్న నరమేధం కేసులో దక్షిణాఫ్రికాతో చేతులు కలుపుతు న్నట్టు స్పెయిన్ ప్రకటించింది. ఈ కేసులో చేరుతున్న మొదటి యూరప్ దేశం అది.

– కార్లోస్ అజెవేడో, పోర్చుగల్ యాక్టివిస్ట్

వివరణ రావాలి!



500 కంటే తక్కువ ఓట్ల మార్జిన్‌తో బీజేపీ 30 స్థానాలు గెలిచింది. 1000 కంటే తక్కువ మార్జిన్‌తో 100కు పైగా గెలిచింది. ఇంత తక్కువ మార్జిన్లు ఉన్నప్పుడు వాటిని ఏమార్చడానికి అవకాశం ఉంటుందని అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ (సవ్యసాచి దాస్) చెప్పింది గుర్తుందా? అదనపు ఓట్ల గురించి ఎన్నికల కమిషన్ ఇంకా వివరించాల్సే ఉంది. ఈ స్థానాలను విశ్లేషించడం ఉపయుక్తంగా ఉంటుంది.

– కె. సుజాతా రావు, ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారి

తెలుస్తోందా?



పాలస్తీనియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఎంతమంది యూదులున్నారు? సున్నా. ఇజ్రాయెల్ పార్లమెంటులో ఎంతమంది ముస్లిం అరబ్బులున్నారు? పది మంది. గాజాలో ఎంత మంది యూదులు నివసించగలరు? సున్నా. ఎంత మంది అరబ్బు ముస్లింలు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు? 16 లక్షలు. సమస్య ఎక్కడుందో, పరిష్కారం ఎవరు కోరుతున్నారో స్పష్టం.

– అమ్జద్ తాహా, పశ్చిమాసియా అంశాల వ్యాఖ్యాత

ఈ మాత్రానికే...



అహంకారం, మితిమీరిన ఆత్మవిశ్వాసం అని బీజేపీని చాలామంది నిందిస్తున్నారు. వాళ్ళకు నాది ఒకటే ప్రశ్న. కేవలం 99 స్థానాలు మాత్రమే గెలిచిన కాంగ్రెస్ నిన్నటి నుంచి ఎట్లా నీలుగుతున్నదో మీరు అసలు గమనించారా?

– అద్వైత కళ, సినిమా రచయిత

ఇన్ బాక్స్

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు!

పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్డీఏకి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. మోదీ హవా లేదనేది స్పష్టమైంది. 'భారతదేశాన్ని రక్షించండి! ప్రజాస్వామ్యాన్ని కాపాడండి!' అని దేశవ్యాప్తంగా 'ఇండియా' కూటమి, దాని భాగస్వామ్య పార్టీలు, సోషల్ మీడియా మేధావులు, అనేకమంది జర్నలిస్టులు చేసిన కృషి, ప్రజల స్పందన ద్వారా భారతదేశ లౌకిక సమాఖ్య స్ఫూర్తి కాపాడ బడింది. 400 సీట్లకు పైగా సాధించాలన్న బీజేపీ కల నెరవేరలేదు. ఎన్డీఏ 293 సీట్లతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. 'ఇండియా' కూటమి తన బలాన్ని పెంచుకొని 233 సీట్లు పొందగలిగింది.

రామ జపం చేసిన అయోధ్యలో కూడా బీజేపీ ఓడిపోయింది. యూపీలో అధికారంలో ఉండి కూడా కేవలం 37 సీట్లకే పరిమితమైంది. 'ఇండియా' కూటమి 43 స్థానాలు కైవసం చేసుకుంది. మహారాష్ట్రలో శివసేన కూటమిని విచ్ఛిన్నం చేసినందుకు ఎన్డీఏను ప్రజలు తిరస్కరించారు. 30 సీట్లు గెలుచుకొని 'ఇండియా' కూటమి బీజేపీని నిర్వీర్యపరిచింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ తన పట్టు నిలబెట్టుకుంది. దక్షిణాదిన బలం పెంచుకోవాలని చూసిన బీజేపీ తమిళనాడులో ఒక్క సీటూ గెలవలేదు. కేరళలో ఒక్క స్థానం పొందింది. కర్ణాటకలో ఎనిమిది స్థానాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ– జనసేనలతో కలిసి 21 స్థానాలు గెలుచుకుంది. తెలంగాణలో కేసీఆర్ వైఫల్యం బీజేపీకి అనుకూలించింది. జాతీయ రాజకీయాల్లో నేషనల్ ఫ్రంట్ పెట్టి ఆనాడు ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారు. నేడు మతోన్మాద ఎన్డీఏ పాలన మైనారిటీల పైనా, దళితులపైనా దాడులు కొనసాగిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్పిస్తున్న విధానాలను చంద్రబాబు సమీక్ష చేసుకొని ఎన్డీఏ భాగస్వామ్యం విషయంలో పునరాలోచన చేయాలి. భారతదేశ లౌకిక ఫెడరల్ స్ఫూర్తిని కాపాడాల్సిన చారిత్రక కర్తవ్యం చంద్రబాబుపై ఉంది. బిహార్‌లో నితీష్ కుమార్ సైతం ఎన్డీఏ కూటమి నుండి వేరు పడకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రజల తీర్పును గౌరవించి ఫాసిస్ట్ శక్తులను మూడోసారి అధికార పీఠం ఎక్కకుండా నిరోధించాలి.

– దినవహి హరినాథ్

తూర్పు ఆసియాలో కొత్త సమీకరణాలు

అభిప్రాయం



రెహానా

నాలుగున్నర ఏళ్ళ తర్వాత సియోల్ వేదికగా చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాల మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశం ప్రపంచ రాజకీయ నాయకులు, విశ్లేషకుల్లో ఆసక్తిని రేపుతోంది. తూర్పు ఆసియాలో భౌగోళిక రాజకీయాల్లో కొత్త సమీకరణాల దిశగా అడుగులు పడనున్నాయా అన్న చర్చ మొదలయ్యింది. ఒకరిపై ఒకరికి ఉన్న అనుమానాలు, ఉద్రిక్తతలు పక్కన పెట్టి స్నేహ సంబంధాల బలోపేతానికి జరుగుతున్న ఈ ప్రయత్నాన్ని భారత దేశం కూడా నిశితంగా గమనించాల్సిందే.

వాస్తవంగా 2008లోనే చైనా, జపాన్, దక్షిణ కొరియా ఒక కూటమిగా ఏర్పడ్డాయి. చివరిసారిగా 2019లో త్రైపాక్షిక సమావేశం జరిగింది. వాస్తవంగా ఈ మూడు దేశాల మధ్య త్రిముఖ కోణాల్లో సంఘర్షణలు ఉన్నాయి. జపాన్–దక్షిణ కొరియా దేశాల మధ్య శత్రుత్వానికి చారిత్రక నేపథ్యమే ఉంది. 1910 నుంచి 1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసే వరకు జపాన్ వలస పాలనలో దక్షిణ కొరియా మగ్గింది. అందుకే ఆ దేశం ఇప్పటికీ జపాన్ చేసిన గాయాలను మర్చిపోలేదు. అటు చైనా– జపాన్ మధ్య కూడా గత ఏడాది ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫుకుషిమా న్యూక్లియర్ రియాక్టర్ నుంచి వ్యర్థ జలాలను శుద్ధి చేసి పసిఫిక్ సముద్రంలో జపాన్ విడుదల చేయటాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగానే జపాన్ నీటిని విడుదల చేస్తోందని అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ, ఐక్యరాజ్య సమితి స్పష్టం చేసినా చైనా మాత్రం వెనక్కి తగ్గలేదు. జపాన్ నుంచి చేపల దిగుమతిపై చైనా, దక్షిణ కొరియాలు ఆంక్షలు విధించాయి. చైనా–జపాన్ దేశాల మధ్య ఉన్న డియాయు ద్వీపం ప్రాదేశిక జలాల్లో నాలుగు నెలల కిందట చైనా గస్తీ నిర్వహించటంతో ఇరు దేశాల మధ్య మళ్ళీ ఉద్రిక్తతలు తలెత్తాయి. తూర్పు చైనా సముద్రంలోని సెంకాకు ద్వీపాలకు సంబంధించి ఇరు దేశాల మధ్య వివాదం చాలా కాలంగా కొనసాగుతూనే ఉంది. వాస్తవంగా రెండో ప్రపంచ యుద్ధ సమయం అంటే 1939–1945 మధ్య కాలంలో దక్షిణ చైనా సముద్ర ప్రాంతం జపాన్ అధీనంలోనే ఉండేది. యుద్ధంలో జపాన్ ఓటమితో ఈ ప్రాంతంలో చైనా ప్రాబల్యం పెరిగింది. మరోవైపు అమెరికాతో తమ సంబంధాల బలోపేతానికి దక్షిణ కొరియా కృషి చేస్తుండటాన్ని చైనా జీర్ణించుకులేకపోతోంది.



ఇక దక్షిణ చైనా సముద్రం, ఇండో పసిఫిక్ జలాల్లో చైనా దూకుడు పెంచటంతో జపాన్, దక్షిణ కొరియాల్లో ఆందోళన ఉంది. ఇలా మూడు దేశాల మధ్య వివిధ అంశాల్లో తీవ్ర విభేదాలు, అపనమ్మకాలు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా... ప్రస్తుతం అన్నింటినీ పక్కన పెట్టి ఒకే తాటిపైకి రావటం ఆసియా ఖండంలో కీలక పరిణామం. చైనా అధ్యక్షుడి తర్వాత నంబర్ టూ గా పరిగణించే ప్రీమియర్... లీ కియాంగ్ అన్నట్లు ఇది మరో శుభారంభం. ఈ సమావేశంలో మూడు దేశాలు పరస్పర సహకారం, భద్రత, వాణిజ్యం, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న వృద్ధ జనాభా సమస్య వంటి కీలక అంశాలపై చర్చతో పాటు ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ దిశగా అడుగులు వడిగా వేయటం మరో ప్రధాన విషయం.

ఈ మూడు తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాల ప్రభావం ప్రపంచంపై కూడా ఉంటుంది అనటానికి వీరి గ్లోబల్ డొమెస్టిక్ ప్రొడక్ట్ వాల్యూమ్ ఒక ప్రామాణికం. గ్లోబల్ గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్‌లో 25 శాతం వాటా ఈ మూడు దేశాలదే. అంతే కాదు జపాన్, సౌత్ కొరియాలకు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక్కడే మరో ఈక్వేషన్ కూడా ఉంది. ఆసియా ఖండంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా మారి తనకు సవాలు విసురుతున్న చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవటానికి అమెరికాకు ఆసియాలో బలమైన స్నేహితులు కావాలి. అందుకే దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి అగ్రరాజ్యం మిలటరీ డ్రిల్స్‌ను విస్తరిస్తోంది. అదే సమయంలో ఈ రెండు దేశాలకూ, అమెరికాకు మధ్య దూరం పెరగాలని ఆకాంక్షిస్తోంది చైనా. ఆసియా ఖండంలో శాంతి సామరస్యాలు పెరగటాన్ని ఆహ్వానించాల్సిందే. అయితే అదే సమయంలో ఈ భౌగోళిక రాజకీయ పరిణామాలు, మరింత బలపడేందుకు డ్రాగన్ చేస్తున్న ప్రయత్నాల పట్ల మన దేశం అప్రమత్తంగా ఉండాలి.

వ్యాసకర్త ఏపీ సమాచార కమిషనర్, ఆంధ్రప్రదేశ్


పొద్దు పోతున్నది...

'పొద్దు పోయెనే శ్రీరాముని పూని భజింపవే మనసా!'

అని దిగులు పడతారు త్యాగరాజ స్వామి ఒక కీర్తనలో.

'నిద్దుర చేత కొన్నాళ్ళు, విషయ/ బుద్ధుల చేత కొన్నాళ్ళు' అంటూ... జీవితంలో మూడోవంతు కాలం నిద్రలోనూ; ఇంద్రియ విషయాల మీదా, సుఖాల మీదా ఉన్న ఆరాటం తీర్చుకునే ప్రయత్నంలో మరింత కాలం వ్యయమై పోతుండె! అని వాపోయారు.

పొద్దున లేచి, త్రితాపములను, నరుల/ పొగడి, పొగడి కొన్నాళ్ళు, వట్టి ఎద్దు రీతి, కన్నతావుల భుజియించి,/ ఏమి తెలియక కొన్నాళ్ళు, ముద్దుగ తోచు భవసాగరమున/మునిగి లేచుచు కొన్నాళ్ళు, పద్దుమాలిన పామర జనులతో వెర్రి/ పలుకులాడుచు కొన్నాళ్ళు, ఓ మనసా!



జ్యోతిర్మయం

ఉదయం లేచినప్పట్నుంచి, తాపత్రయపడుతూ, వాళ్ళకూ వీళ్ళకూ భజన చేస్తూ, కేవలం పశువులా ఎక్కడ ఏది కనిపిస్తే దాన్నంతా భుజిస్తూ, పైపై మెరుగులతో ఆకర్షించే సంసార సాగరంలో మునకలు వేస్తూ ఉండటంలోనూ, సాటి అజ్ఞానులతో సారహీనమైన పోచికోలు చర్చలలోనూ చాలాకాలం నష్టమై పోతుండె!

ముదమున ధన, తనయ, ఆగారముల చూచి/ మదము చేత కొన్నాళ్ళు, అందు, చెదిరినంత, శోకార్ణవగతుడై/జాలి చెందుటయు కొన్నాళ్ళు, ఎదటి వచ్చ చూచి తాళలేక, తా/ నిలను తిరుగుట కొన్నాళ్ళు, ముదిమది తప్పిన ముసలితనమున/ ముందు వెనక తెలియక కొన్నాళ్ళు.

కొన్నాళ్ళు ధనమూ, సంతానమూ, ఇల్లూ అనుకుంటూ, వాటిని చూసి మదించటంలో గడిచె. అవి బెడిసికొడితే, మళ్ళీ దుఃఖంలో మునిగి, దైన్యతలో కొన్నాళ్ళు. ఎదుటివాడు పచ్చగా ఉంటే, ఏడుస్తూ కొన్నాళ్ళు. పెద్ద వయసు మీదపడేసరికి, బుద్ధి పనిచేయని స్థితిలో కొన్నాళ్ళు... మొత్తం మీద, **బాగుగ నామ కీర్తనములు సేయుటే, భాగ్యమని అనక త్యాగరాజ నుతుడైన శ్రీరాముని తత్త్వము తెలియక కొన్నాళ్ళు.** ఎంతో పొద్దు గడిచింది. గమనించుకొని, పొద్దు కొంతయినా మిగిలి ఉండగానే, కోదండ రాముడి మీద మనసు పెట్టి భజించకపోతే, జన్మ వ్యర్థం అని నాదబ్రహ్మ హెచ్చరిక.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో బుధవారం పొలానికి వెళ్లిన ఓ మహిళకు వజ్రం లభ్యమైంది. దీన్ని గురువారం ఓ వజ్రాల వ్యాపారి రూ.1.50లక్షల నగదు, జత కమ్మలు ఇచ్చి కొనుగోలు చేశారు.


కైకరంలో చికెన్ షాపు ధ్వంసం, కారుపై రాళ్లు

టీడీపీ, జనసేన కార్యకర్తల వీరంగం



ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగి.. ఒకచోట చికెన్ షాపును ధ్వంసం చేసి, మరో చోట కారుపై రాళ్లు వేశారు. కూటమి విజయం సాధించిన సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు గ్రామంలో గురువారం ఊరేగింపు నిర్వహించారు. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బొర్రా నారాయణరావుకు చెందిన చికెన్ దుకాణాన్ని టీడీపీ, జనసేన కార్యకర్తలు ధ్వంసం చేశారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత యెలిశెట్టి శ్రీనివాసరావు ఇంటి వద్ద హల్‌చల్ చేసి, కారుపై రాళ్లు వేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంయమనం పాటించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు శ్రీనివాసరావు ఇంటి వద్ద పహారా ఏర్పాటు చేశారు. చికెన్ షాపు ధ్వంసం ఘటనలో బాధితుడు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చింతలపూడి శివారులో చిరుత సంచారం



ఛార్లెస్ నగర్‌లో చిరుత పాదముద్రలు

చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడి శివారు చార్లెస్ నగర్‌లో చిరుత పులి సంచరిస్తుంది. పట్టణానికి చెందిన పలువురు గురువారం చిరుత పులి అడుగుల గుర్తులను చూసి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు చిరుత జాడలను కనిపెట్టడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని టి.నరసాపురం మండలం బందంచర్ల అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు వారం క్రితమే అటవీ అధికారులకు సమాచారం అందించడంతో వారు పులి అడుగు జాడలను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గత ఆదివారం చింతలపూడి సమీపంలోని వాటర్ ట్యాంక్ సమీపంలోని వేదాల ఉదయ కుమార్ పొలంలో పులి అడుగు జాడలను పోలి ఉన్న పెద్ద పెద్ద పాద ముద్రలను గుర్తించి అధికారులకు సమాచారమిచ్చారు. మండలంలోని కంచనగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత పి.నాగేశ్వరరావుకు చెందిన ఏడాది వయస్సు ఉన్న లేగ దూడను చంపి తిన్న ఘటన జరిగింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు లేగదూడను తినడానికి మళ్లీ పులి వస్తుందని భావించి మృత దేహం సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో మరుసటి రోజు రాత్రి దూడ మృత దేహం వద్దకు వచ్చిన చిరుత సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. బుధవారం రాత్రి తోటల్లో నడుచుకుంటూ చింతలపూడి పట్టణ సమీపానికి చేరుకుని ఉంటుందని భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఎవరూ బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే చిరుతను పట్టుకుంటామని తెలిపారు.

కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిసిన పవన్



మోదీతో పవన్, భార్య, కుమారుడు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకిరా నందన్‌లను మోదీకి పవన్ పరిచయం చేశారు. అనంతరం మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. అకిరా నందన్ భుజం తట్టి మోదీ పలకరించారు. ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాల్లో జనసేన 21 స్థానాల్లో గెలుపు సాధించడంపై మోదీ హర్షం వ్యక్తం చేస్తూ పవన్‌ను అభినందించారు. అలాగే హైదరాబాద్‌లో చిరంజీవిని పవన్ కలిశారు. ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా చిరంజీవి ఆయన్ను అభినందించారు. తల్లి హారతిచ్చి పవన్‌ను ఆశీర్వదించారు.



చిరంజీవి నివాసంలో సంబరాలు

'నీట్'గా గోల్‌మాల్?

మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో దేశవ్యాప్తంగా పలుచోట్ల కాపీయింగ్ జరిగినట్లు ఆరోపణలు



- హరియాణాలోని ఓ సెంటర్‌లో ఒకే గదిలో పరీక్ష రాసిన అనేక మందికి 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు
- 5 చొప్పున నెగెటివ్ మార్కులున్నా కొందరికి 717, 718, 719 మార్కులు వచ్చినట్లు పత్రికల్లో ప్రచార ప్రకటనలు
- ఈ వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేస్తున్న కొన్ని కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు
- కోర్టుకు వెళ్లాలని భావిస్తున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో చేరేందుకు దేశవ్యాప్తంగా గత నెల 5న జరిగిన నీట్ ఎంట్రన్స్‌లో పలుచోట్ల గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరిగినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు అనేక కార్పొరేట్ కాలేజీలు కూడా కాపీయింగ్ జరిగిందన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో నీట్ పరీక్ష సందర్భంగా పెద్ద ఎత్తున కాపీయింగ్ జరిగిందని, కొన్ని కాలేజీల్లో ఒకే విధమైన టాప్ మార్కులు పలువురికి రావడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిసారీ తెలుగు రాష్ట్రాలకు జాతీయ స్థాయిలో టాప్ ర్యాంకులు వచ్చేవి. కానీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన ఫలితాల ప్రకారం ఈసారి టాప్ ర్యాంకులు పెద్దగా రాలేదు. గతేడాది దేశవ్యాప్తంగా నీట్‌లో 720కి 720 మార్కులు సాధించిన విద్యార్థులు ఇద్దరు ఉండగా ఈసారి 67 మంది ఉన్నారు. ఇంత మందికి నూరు శాతం మార్కులు రావడంపట్ల కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాదిలో ఒక సెంటర్‌లో ఒకే రూమ్‌లో రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8 మందికి 720 మార్కులు రావడంపై విమర్శలు వస్తున్నాయి. ఇదేమీ యాదృచ్ఛికం కాదని అంటున్నారు. ఏదో గోల్‌మాల్ జరిగిందని అంటున్నారు.

గ్రేస్ మార్కులు కలిపారంటూ ప్రచారం

720కి 717, 718, 719... ఇలా సాధ్యంకాని మార్కులు ఏ పరిస్థితుల్లోనూ రాకూడదని అంటున్న నేపథ్యంలో ఎన్‌టీఏ గ్రేస్ మార్కులు కలిపిందన్న ప్రచారం జరుగుతోంది. రెండు గ్రేస్ మార్కులు కలిపారని అంటున్నారు. కానీ ఎన్‌టీఏ అధికారికంగా ప్రకటన జారీ చేయలేదు. కాబట్టి ఇది ఏ మేరకు వాస్తవమనేది తెలియదు. ఇలా కలిపితే తెలుగు రాష్ట్రాల నీట్ విద్యార్థులకు కూడా కలపాలి కదా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులందరినీ చెక్ చేశామని, ఎక్కడా తెలుగు రాష్ట్రాల్లో గ్రేస్ మార్కులు కలవలేదంటున్నారు. కాపీయింగ్, గ్రేస్ మార్కుల ప్రచారంపై కొందరు తల్లిదండ్రులు కోర్టుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

720కి 717, 718, 719 మార్కులు ఎలా?

గతేడాది దేశవ్యాప్తంగా నీట్ పరీక్షకు 20.38 లక్షల మంది హాజరవగా ఈసారి 23.33 లక్షల మంది హాజరయ్యారు. గతేడాది 11.45 లక్షల మంది అర్హత సాధించగా ఈసారి 13.16 లక్షల మంది అర్హత సాధించడం విశేషం. తెలంగాణ నుంచి గతేడాది 72,842 మంది నీట్ రాయగా 42,654 మంది అర్హత సాధించారు. ఈసారి 77,849 మంది పరీక్ష రాస్తే 47,371 మంది అర్హత సాధించారు. తెలంగాణలో ఈసారి ఎవరికీ 720కి 720 మార్కులు రాలేదు. ఇక కొందరికి 720 మార్కులకుగాను 717, 718, 719 వంటి మార్కులు వచ్చాయి. కానీ ఈ పద్ధతిలో రావడం సాధ్యం కానేకాదు. ఉదాహరణకు ఒక విద్యార్థి 720 మార్కులకు పరీక్ష రాస్తే అందులో ఒక ప్రశ్న తప్పయితే ఐదు మైనస్ మార్కులు పడతాయి. అంటే ఆ విద్యార్థికి 715 మార్కులే వస్తాయి. ఒకవేళ ఒక ప్రశ్న రాయకుంటే 4 మార్కులు తగ్గి 716 మార్కులు వస్తాయి. కానీ 717, 718, 719 మార్కులు ఎలా వస్తాయని పలు కార్పొరేట్ కాలేజీల అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి మార్కులు వచ్చినట్లు తాము గుర్తించలేదని.. ఉత్తరాది రాష్ట్రాల్లో వెలుగు చూశాయంటున్నారు. కొన్ని పత్రికల ప్రకటనల్లోనూ వాటిని చూసినట్లు చెబుతున్నారు.

రఘువీర్‌కు 'వినూత్న రైతు' అవార్డు

న్యూఢిల్లీలో జరిగిన జాతీయ కేవీకే మేళాలో అవార్డు ప్రదానం



ఐఏఆర్ఐ డైరెక్టర్ ఏకే సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నందం రఘువీర్

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన అభ్యుదయ యువరైతు నందం రఘువీర్‌కు భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ(ఐఏఆర్ఐ) వినూత్న రైతు అవార్డు–2024ను అందజేసింది. న్యూఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ కృషి విజ్ఞాన కేంద్రాల(కేవీకే) మేళాలో ఐఏఆర్ఐ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏకే సింగ్ ఈ అవార్డును రఘువీర్‌కు ప్రదానం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ నుంచి అందుకున్న ఏకైక ఆదర్శ రైతుగా రఘువీర్ నిలిచారు. అంతరించిపోతున్న పురాతన ధాన్యపు సిరులను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్న సంకల్పంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి దేశవ్యాప్తంగా పర్యటించి 257 రకాల పురాతన వరి విత్తనాలను సేకరించారు. వీటిలో 10కి పైగా జీఐ ట్యాగ్ కలిగిన వంగడాలు కూడా ఉన్నాయి. పెనమలూరులో తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో తాను సేకరించిన పురాతన విత్తనాలతో విత్తన సంరక్షణ చేస్తున్నారు. ఎనిమిది జిల్లాల్లో విత్తన నిధులను ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రాంతమైన పెదబయలు మండలంలో పురాతన దేశీ విత్తన నిధిని ఏర్పాటుచేశారు. గిరిజన రైతులకు పురాతన వంగడాలను ఉచితంగా అందిస్తూ వాటి పునరుత్పత్తికి కృషిచేస్తున్నారు. రఘువీర్ గత ఏడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ మొక్కల జన్యురక్షకుని అవార్డు, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు చేతుల మీదుగా జాతీయ ఉత్తమ రైతు అవార్డుల తోపాటు మిజోరాం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 2022లో ఉత్తమ రైతు అవార్డులను అందుకున్నారు. అంతరించిపోతున్న పురాతన విత్తనాలను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా తాను ముందుకువెళుతున్నానని రఘువీర్ 'సాక్షి'కి తెలిపారు. ఐఏఐఆర్ నుంచి వినూత్న రైతు అవార్డు అందుకోవడం తనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

'మధ్యవర్తిత్వం' వల్ల సమయం, డబ్బు ఆదా

నగరంపాలెం: మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని సుప్రీం కోర్టు మీడియేషన్/కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఢిల్లీ నుంచి వీకే బన్సల్, మన్మోహన్‌శర్మ (జిల్లా జడ్జిలు) అన్నారు. గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాలులో గురువారం న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సుప్రీంకోర్టు మీడియేషన్/కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ–న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై రెండో విడత 40గంటల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా న్యాయవాదులకు అవగాహన కార్యక్రమంలో వీకే బన్సల్, మన్మోహన్‌శర్మ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, ఒకటో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), వై.గోపాలకృష్ణ, బార్ కౌన్సిల్ సభ్యుడు వి.బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి అనూరాధ, మహిళా కార్యదర్శి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు అరుదైన ఘనత

ప్రపంచ కంటైనర్ పోర్టుల పనితీరు సూచీలో టాప్-20లో చోటు / 18వ స్థానాన్ని సొంతం చేసుకున్న సంస్థ




విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ మరో అరుదైన ఘనత సాధించింది. ప్రపంచ బ్యాంక్ రూపొందించిన కంటైనర్ పోర్టుల పనితీరు సూచీ(సీపీపీఐ)లో టాప్–20లో స్థానం సంపాదించింది. విశాఖ కంటైనర్ టెర్మినల్ అద్భుత ప్రతిభ కనబరిచి 18వ స్థానాన్ని దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా కంటైనర్ పోర్టుల పనితీరును సీపీపీఐ పరిగణనలోకి తీసుకోగా.. ఇందులో విశాఖ పోర్టు సరికొత్త మైలురాయిని అందుకుంది. ఈ సూచీల ద్వారా వ్యాపారవేత్తలు పోర్టులను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. పోర్టు సామర్థ్యం, నౌక టర్న్ అరౌండ్ సమయాలు ఎంతో ముఖ్యమైన ప్రమాణాలుగా నౌకల యజమానులు భావిస్తారు. విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో క్రేన్‌లు గంటకు 27.5 కదలికలను నమోదు చేస్తుంటాయి. బెర్త్‌లో షిప్ నిలిపే సమయం 13 శాతంగా ఉంటోంది. అలాగే పోర్టులో టర్న్ రౌండ్‌కు 21.4 గంటల రికార్డు సమయం ద్వారా అత్యుత్తమ సూచీలను నెలకొల్పింది. 65కు పైగా కంటైనర్ లైన్లు కలిగి ఉంది. కంటైనర్ టెర్మినల్‌కు 8 నిరంతర సర్వీసులున్నాయి. ఈ అసాధారణ ఘనతను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్టేక్ హోల్డర్లు, రైల్వేలు, కస్టమ్స్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు అభినందించాయి. భవిష్యత్‌లో మరిన్ని రికార్డులు సాధించడానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయి. ఈ ఘనతను సాధించడంలో కీలకంగా పనిచేసిన సిబ్బందిని విశాఖ పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. పోర్టు సమర్థతను ఈ ఘనత చాటి చెప్పిందన్నారు.

సరుకు రవాణాలో 4వ స్థానం

2023–24వ ఆర్థిక సంవత్సరంలో విశాఖ పోర్టు సరుకు రవాణాలో మెరుగైన పనితీరును కనబరిచి దేశంలోని మేజర్ పోర్టులలో 4వ స్థానంలో నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే సరుకు రవాణాలో 13.5 శాతం వృద్ధిని కనబరిచింది. ఈ ఘనత పట్ల కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా శాఖ సంతృప్తి వ్యక్తం చేసింది. పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తును ప్రశంసించింది.

మారిన చంద్రబాబును చూస్తారు

- రాజకీయ పాలనే... బ్యూరోక్రాట్ల పాలన ఉండదు
- 12న ప్రమాణస్వీకారం చేస్తా
- ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి పని చేయాలి
- టీడీపీ ఎంపీల సమావేశంలో చంద్రబాబు



సాక్షి, అమరావతి: 'నేను పాత చంద్రబాబును కాదు. ఇకపై మీరు మారిన కొత్త చంద్రబాబును చూస్తారు' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు టీడీపీ తరఫున ఎన్నికైన ఎంపీలతో వ్యాఖ్యానించారు. గతంలో మాదిరిగా రాష్ట్రంలో బ్యూరోక్రాట్ల పాలన ఉండదని, పూర్తి రాజకీయ పాలన ఉంటుందని చెప్పారు. అధికారులు చెప్పినట్లు కాకుండా, రాజకీయంగానే నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ఆయన గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న పలువురు ఎంపీలు సమావేశానికి హాజరవగా, మిగిలిన వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. శుక్రవారం జరిగే ఎన్డీయే సమావేశానికి ఎంపీలందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన చెప్పారు. ప్రజలు భారీ మ్యాండేట్ ఇచ్చారని, దాన్ని చూసుకుని ఎవరూ ఆకాశంలో ఎగరొద్దని హెచ్చరించారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా వినియోగించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోలేదని, జగన్ కేసుల మాఫీ అజెండాతోనే ఢిల్లీలో పైరవీలు చేశారని అన్నారు. టీడీపీ ఎంపీల కర్తవ్యం వేరని, ప్రజల కోసం పని చేయాలని చెప్పారు. ఈ నెల 12వ తేదీన ప్రమాణస్వీకారం చేస్తానని, ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించామని, ఆయన వస్తానని చెప్పారని తెలిపారు.

తరచూ వచ్చి కలవండి

తాను ఎప్పటికీ మారరనే అపవాదు ఉందని, ఇక ఆ తప్పు చేయనని బాబు చెప్పారు. ఇప్పుడు తాను పూర్తిగా మారిపోయానన్నారు. ఎంపీలు ఎవరూ తన దగ్గరకు రావడానికి జంకవద్దని, తరచూ వచ్చి తనను కలవాలని, పనిలో ఉన్నా పక్కకు వచ్చి మాట్లాడతానని తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఈ ఐదేళ్లు తన కోసం ప్రాణాలకు తెగించి కష్టపడ్డారని, కత్తి మీద పెట్టినా జై టీడీపీ, జై చంద్రబాబు అన్నారని తెలిపారు. అధికార పార్టీ ఒత్తిడికి ఎవరూ లొంగిపోలేదన్నారు. ఇక నుంచి ప్రతి విషయాన్ని తాను పట్టించుకుంటానని, అందరి మాటలూ విని ఏం చేయాలో అది చేస్తానని స్పష్టం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి పని చేయాలని, విభేదాలకు ఆస్కారం ఇవ్వవద్దని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేల పరిధి ఏమిటనే దానిపైనా స్పష్టత ఇస్తానని, ఆ ప్రకారం పని చేయాలని సూచించారు. అందరూ కలిసి కార్యకర్తలు, నేతలకు న్యాయం చేయాలన్నారు. ఈసారి ఎన్నికైన ఎంపీల టీమ్ చాలా బాగుందని, గతంలో ఎర్రన్నాయుడు ఉన్నప్పుడు ఇలాంటి టీమ్ ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా పార్లమెంటులో పని చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని గౌరవించాలని చెప్పారు. వ్యవస్థలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా, ఆ వ్యవస్థే తిరిగి కాటేస్తుందని హెచ్చరించారు. పదవులు శాశ్వతం అని ఎవరూ అనుకోవద్దని చెప్పారు.

గంటల తరబడి వాహనాలు నిలిపేయొద్దు

తనతో పాటు, వీఐపీ సెక్యూరిటీ పేరుతో కాన్వాయ్ వెళ్లే మార్గాల్లో గంటల తరబడి వాహనాలను నిలిపివేయవద్దని పోలీసులకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. గురువారం ఢిల్లీ బయలుదేరిన చంద్రబాబు, తన కాన్వాయ్ వెళ్తున్న క్రమంలో సాధారణ ప్రజల వాహనాలను పోలీసులు నిలిపివేయడాన్ని గమనించి ఆ మేరకు ఆదేశాలిచ్చారు. దీంతో ఉండవల్లి నివాసం నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్లేలోపే గుంటూరు ఎస్పీ, విజయవాడ సీపీలకు బాబు భద్రతా సిబ్బంది సమాచారం ఇచ్చారు. భవిష్యత్తులో కూడా సామాన్య ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. బారికేడ్లు, రోడ్లు మూసివేత, షాపుల బంద్ వంటి చర్యలు వద్దని తెలియజేశారు.

చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం మధ్యాహ్నం రేవంత్‌రెడ్డి నివాసంలో మహబూబాబాద్ నియోజకవర్గ ఫలితాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నుంచి చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని, విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకునేందుకు సహకరించాలని కోరారు. మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విప్ రాంచంద్రనాయక్ తదితరుల ముందే కాబోయే ఏపీ సీఎంతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

బాసర అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ శ్రీనివాస రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ వైదిక బృందం, ఈవో విజయ రామారావు స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో న్యాయమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్, ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదాలు న్యాయమూర్తి దంపతులకు అందజేశారు.

టీడీపీ అధ్యక్షుడిగా లోకేశ్!?

ఏడాది తర్వాత రాష్ట్ర కేబినెట్‌లోకి!

సాక్షి, అమరావతి: ఐదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతోంది. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ భవిష్యత్తుకు అనుగుణంగా నియామకాలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. అందులో భాగంగానే చంద్రబాబు తన కుమారుడు లోకేశ్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. ఆయన్ను టీడీపీ అధ్యక్షుడిగా నియమించాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. ఇప్పుడు అందరూ లోకేశ్ మంత్రివర్గంలో చేరి కీలక మంత్రిత్వ శాఖల బాధ్యతలు తీసుకుంటారనే చర్చ నడుస్తోంది. గతంలోనూ ఆయన చంద్రబాబు మంత్రివర్గంలో ఐటీ, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు మంగళగిరిలో ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయన కచ్చితంగా గతంలో మాదిరిగా మంత్రివర్గంలో చేరతారనే అభిప్రాయం పార్టీలో నెలకొంది. రెండు, మూడేళ్ల తర్వాత చంద్రబాబు ఆయన్ను సీఎం పీఠంపై కూర్చోబెట్టే అవకాశాలున్నాయని చర్చించుకుంటున్నారు. అయితే, చంద్రబాబు కుటుంబంలో మాత్రం ప్రస్తుతం ఆయన్ను పార్టీ అధ్యక్షుణ్ణి చేసి అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ కీలకంగా వ్యవహరించేలా చేయాలనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తూ ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ అందరితో సంబంధాలు పెంచుకునేందుకు లోకేశ్ ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాది తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో చేరతారని ఆ తర్వాత ఇంకా పైస్థాయి పదవి స్వీకరించడానికి ఆయన మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ రకమైన చర్చ ఆయన కుటుంబంలో జరుగుతోంది. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసే సమయానికి ఈ అంశంపై ఒక అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ నిర్ణయం మార్చుకుంటే చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసినప్పుడే ఆయన మంత్రిగా ప్రమాణం చేసే అవకాశం ఉందని టీడీపీ ముఖ్య నేతల సమాచారం.

వినాయకుడి ఆలయం కూల్చివేత

సాక్షి, చిత్తూరు: ఓ కుటుంబం వినాయకుడి గుడిని కూల్చేసింది. ఈ ఘటన గురువారం చిత్తూరు జిల్లా గుడిపాల మండలం చీలాపల్లిలో జరిగింది. 2014లో దాతాల సహకారంతో ఓ కుటుంబ పెద్ద గ్రామంలో వినాయకుడి గుడి నిర్మాణానికి పునాదులు వేశారు. కొద్దిరోజులకే ఆ కుటుంబ పెద్ద చనిపోయాడు. కొన్నాళ్లకు అతని కుమారుడు కూడా చనిపోయాడు. ఈ గుడి నిర్మాణంతో గ్రామానికి అరిష్టం జరుగుతుందని ఆ కుటుంబం భావించింది. తర్వాత గుడి కూల్చివేతకు సిద్ధపడ్డారు. అయితే గ్రామస్తులు కొంత మంది అప్పట్లో అడ్డుపడ్డారు. దీంతో ఆలయం కూల్చివేత ఆగిపోయింది. గురువారం ఆ కుటుంబ సభ్యులు గుడిని జేసీబీతో కూల్చివేశారని గ్రామస్తులు చెబుతున్నారు.

తెలంగాణ

మావోయిస్టుల ఏరివేతకు 'జల్‌శక్తి'

- వర్షాకాలంలోనూ ఆటంకం లేకుండా ఏర్పాట్లు
- రోప్‌వే ఏర్పాటు చేసిన భద్రతా దళాలు
- చింతవాగుపై సులువు కానున్న రాకపోకలు
- బస్తర్‌లో మావోయిస్టుల ఏరివేతకు ప్రత్యేక వ్యూహం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులకు పట్టు ఉన్నట్లు చెప్పుకునే బస్తర్ అడవుల్లో ఎండాకాలంలో సహజంగానే పోలీసు బలగాలది పైచేయి అవుతోంది. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో వంద మందికి పైగా మావోయిస్టులు హతమవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, వానాకాలానికి వచ్చేసరికి అడవులు చిక్కబడటం.. వాగులు, వంకలు ఉప్పొంగడంతో పోలీసుల కూంబింగ్‌కు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వానాకాలంలోనూ బస్తర్ అడవుల్లో మావోయిస్టుల నుంచి ఎదురయ్యే దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు భద్రతా దళాలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా అడవుల్లోకి సులభంగా చొచ్చుకెళ్లేందుకు వీలుగా గతంలో ఎన్నడూ లేనివిధంగా రోప్ వేను అందుబాటులోకి తెచ్చాయి.

బేస్ క్యాంపుల ఏర్పాటు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు సరిహద్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు, ధర్మారం, కవరుగట్ట, కొండపల్లి, బట్టిగూడెం, బాసగూడ ప్రాంతాలు మావోయిస్టులకు అడ్డాలుగా ఉన్నాయి. అతికష్టంపై భద్రతా దళాలు చింతవాగుకు ఇరువైపులా ఉన్న పామేడు, ధర్మారంలో బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసుకున్నాయి. అయితే ఈ ఏడాది జనవరి 16న రాత్రి 600 మందికి పైగా మావోయిస్టులు ఈ రెండు క్యాంపులను చుట్టుముట్టి భీకరంగా దాడి చేశారు. సుమారు మూడు గంటల పాటు సాగిన దాడిలో ఆరు వందలకు పైగా గ్రనేడ్లు విసిరారు. ఈ దాడిలో భద్రతా దళాలకు చెందిన నలభై మందికి తీవ్రగాయాలైనట్టు సమాచారం. అప్పటికే చింతవాగుపై వంతెన నిర్మాణ పనులు మొదలుపెట్టినా సకాలంలో పూర్తి కాలేదు. దీంతో ఏటా వానాకాలంలో మూడు నెలల పాటు ఉప్పొంగే చింతవాగు భద్రతా దళాలకు ప్రధాన సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా భద్రతా దళాలు వంతెనకు ప్రత్యామ్నాయంగా యుద్ధప్రతిపాదికన రోప్‌వేను నిర్మించాయి. ఈ రోప్‌వే ద్వారా రెండు క్యాంపుల మధ్య రాకపోకలకు ఆటంకాలు ఉండవని భద్రతా దళాలు భావిస్తున్నాయి.

ఆపరేషన్ జల్‌శక్తి: వేసవిలో మావోయిస్టు ప్రభావిత అడవుల్లోకి చొచ్చుకెళ్లిన భద్రతా దళాలు అక్కడ క్యాంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇలాంటి క్యాంపులకు వానాకాలంలో భద్రత కరువైపోతోంది. భద్రతా దళాల రక్షణ వ్యవస్థను చీల్చుకుంటూ క్యాంపుల మీద మావోయిస్టులు దాడులు చేస్తున్నారు. దీంతో వానాకాలంలో కూడా బస్తర్ అడవులపై పట్టు సాధించేందుకు భద్రతా దళాలు ఆపరేషన్ జల్‌శక్తి పేరుతో ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. వరదలు ఎదుర్కొని, దట్టమైన అడవుల్లో కూంబింగ్ నిర్వహించడంపై భద్రతా దళాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగానే రాకపోకలకు వీలుగా వంతెనలు, రోప్‌వేల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి.

120 మంది హతం

కేంద్రం చేపట్టిన మావోయిస్టుల ఏరివేత ఇప్పుడు తుదిదశ (ఆపరేషన్ కగార్ – ది ఫైనల్ మిషన్)కు చేరింది. బస్తర్ అడవుల్లో ఏర్పాటైన వందలాది క్యాంపుల్లో 10 వేల మంది పారామిలిటరీ దళాలు పాగా వేశాయి. వేసవి ఆరంభంలో భద్రతా దళాల దూకుడుకు కళ్లెం వేసేందుకు మావోయిస్టు పార్టీ టెక్నికల్ కౌంటర్ – అఫెన్సివ్ క్యాంపెన్(టీసీ–ఓసీ) పేరుతో దాడులు మొదలెట్టింది. దీనికి ప్రతిగా భద్రతా దళాలు ఆపరేషన్ సూర్యశక్తి పేరుతో ప్రతి వ్యూహాన్ని రూపొందించుకుని దాడులకు దిగాయి. అందువల్లే ఈ ఏడాది మావోయిస్టు పార్టీ నుంచి భద్రతా దళాలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. ఇదే క్రమంలో భద్రతా దళాలు జరిపిన దాడులు, ఎన్‌కౌంటర్లలో 120 మందికి పైగా మావోయిస్టులు చనిపోయారు. ఇక ఇప్పుడు జల్‌శక్తి పేరుతో వానాకాలంలోనూ దూకుడు పెంచేందుకు భద్రతా దళాలు సిద్ధమవుతున్నాయి.

స్టాక్ మార్కెట్ కుంభకోణంలో మోదీ, షా

- ఎన్నికల సమయంలో పెట్టుబడి సలహాలు ఎందుకిచ్చారు?
- బీజేపీకి మెజార్టీ రాదని తెలిసినా షేర్లు కొనాలని ఎందుకు సూచించారు?
- 200 నుంచి 220 సీట్లు వస్తాయని నిఘా సంస్థలు చెప్పడం నిజం కాదా?
- తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాల వెనుక గుట్టు ఏమిటి?
- బీజేపీకీ, విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య సంబంధం ఏమిటి?
- జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.30 లక్షల కోట్ల నష్టం

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ వారిచ్చిన సలహాలు నమ్మి రిటైల్ ఇన్వెస్టర్లు రూ.30 లక్షల కోట్లు పోగొట్టుకున్నారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ఫేక్' ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన రోజు స్టాక్ మార్కెట్ సూచీలు విపరీతంగా పెరిగిపోయాయని, ఈ నెల 4న ఎన్నికల అసలు ఫలితాలు వెల్లడయ్యాక సూచీలు ఒక్కసారిగా కుప్పకూలాయని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మోదీ, అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్ గురించి మాట్లాడారని, షేర్లు కొనాలంటూ ప్రజలకు సూచించారని చెప్పారు. స్టాక్ మార్కెట్లు, షేర్ల గురించి ప్రధానమంత్రి, హోంమంత్రి బహిరంగంగా మాట్లాడడం దేశంలో ఇదే మొదటిసారి అని గుర్తుచేశారు. ప్రధానమంత్రి, హోంమంత్రి చేసే పని స్టాక్ మార్కెట్ సలహాలు ఇవ్వడమేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇన్వెస్ట్‌మెంట్ సలహాలు ఎందుకిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు లెక్క తప్పుతాయని బీజేపీ నేతలకు ముందే తెలుసని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 220 సీట్ల వరకు వచ్చే అకాశం ఉందని అంతర్గత అధికారిక సర్వేలో తేలిందన్నారు. 200 నుంచి 220 సీట్లు వస్తాయంటూ నిఘా సంస్థలు మోదీ ప్రభుత్వానికి నివేదించాయని తెలిపారు. ఇదంతా తెలిసి కూడా 5 కోట్ల కుటుంబాలకు పెట్టుబడి సలహాలు ఎందుకిచ్చారని మోదీ, అమిత్ షాపై రాహుల్ మండిపడ్డారు.

రిటైల్ ఇన్వెస్టర్లను ముంచేశారు

షేర్ల విలువను తారుమారు చేసిన ఆరోపణలపై సెబీ దర్యాప్తును ఎదుర్కొంటున్న బిజినెస్ గ్రూప్‌నకు చెందిన మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో మోదీ, అమిత్ షా స్టాక్ మార్కెట్ పెట్టుబడి సలహాలను ఇచ్చారని రాహుల్ పేర్కొన్నారు. తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల చేసిన వారికి, బీజేపీకీ, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు ఒక్కరోజు ముందు పెట్టుబడి పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించారు. దీని వెనుక భారీ కుట్ర ఉందన్నారు. మోదీ, అమిత్ షా సలహాలను విశ్వసించి పెట్టుబడిన పెట్టిన భారత రిటైల్ ఇన్వెస్టర్ల సంపదను కొందరు బడాబాబులు కాజేశారని ఆరోపించారు. ఇన్వెస్టర్లను ముంచేసి రూ.వేల కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. మోదీ, అమిత్ షాతోపాటు తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ప్రకటించిన వారిపై దర్యాప్తు జరపాలని రాహుల్ డిమాండ్ చేశారు.



మీడియాకు గణాంకాలు వివరిస్తున్న రాహుల్, జైరాం రమేశ్

మీడియా సమావేశంలో రాహుల్ వెల్లడించిన ప్రకారం ఎప్పుడేం జరిగిందంటే

మే 13: జూన్ 4 (ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే రోజు) కంటే ముందే షేర్లు కొనేసి పెట్టుకోండి అని అమిత్ షా సూచించారు.

మే 19: జూన్ 4న స్టాక్ మార్కెట్ రికార్డులు బద్దలవుతాయి. కొత్త రికార్డులు సృష్టించడం ఖాయం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

జూన్ 1: సార్వత్రిక ఎన్నికల్లో తుది దశ పోలింగ్ జరిగింది. సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి.

జూన్ 3: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రాబోతున్నట్లు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడంతో స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో పుంజుకుంది. సూచీలు ఆల్ టైమ్ అత్యధిక స్థాయికి చేరుకున్నాయి.

జూన్ 4: ఓట్ల లెక్కింపు మొదలైంది. బీజేపీకి మెజార్టీ సీట్లు వచ్చే అవకాశం లేదని తేలింది. దాంతో స్టాక్ మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలింది. మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన చిన్నస్థాయి ఇన్వెస్టర్ల సంపద రూ.30 లక్షల కోట్ల మేర కరిగిపోయింది.

పస లేని ఆరోపణలు

పీయూష్ గోయల్ మండిపాటు

స్టాక్ మార్కెట్‌లో అతిపెద్ద కుంభకోణం జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఖండించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి ఎదురైన ఓటమిని తట్టుకోలేక ఇలాంటి పస లేని ఆరోపణలు చేస్తున్నారని రాహుల్‌పై మండిపడ్డారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించడానికి పెద్ద కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. ఇన్వెస్టర్లను దగా చేయొద్దని సూచించారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాల తర్వాత మన మార్కెట్‌లో విదేశీ పెట్టుబడిదారులు అధిక రేట్ల వద్ద భారీగా షేర్లు కొన్నారని, వాటిని భారత ఇన్వెస్టర్లు విక్రయించి,



లాభం పొందారని పీయూష్ గోయల్ వివరించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.67 లక్షల కోట్లు ఉన్న స్టాక్ మార్కెట్ విలువ ఇప్పుడు రూ.415 లక్షల కోట్లకు చేరిందని గుర్తుచేశారు. దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా లబ్ధి పొందారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందిందన్నారు. మార్కెట్‌లో నమోదైన ప్రభుత్వ రంగ సంస్థల విలువ 4 రెట్లు పెరిగిపోయిందని పేర్కొన్నారు. మోదీ పాలనలో భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని గుర్తుచేశారు.



ముర్ముకు 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల వివరాలను అందజేస్తున్న సీఈసీ రాజీవ్ కుమార్. పక్కన ఈసీలు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్

రాష్ట్రపతి ముర్ముతో ఈసీ భేటీ

నూతన లోక్‌సభ సభ్యుల వివరాలు అందజేత

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కలిసి గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో సీఈసీ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్‌లు రాష్ట్రపతి ముర్మును కలిశారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 73ను అనుసరించి సార్వత్రిక ఎన్నికల్లో 18వ లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికైన, నామినేట్ అయిన సభ్యుల వివరాలతో కూడిన ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రతిని ఆమెకు అందజేశారని వివరించింది.

పోలింగ్ 65.79 శాతం



న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో 65.79 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. పోస్టల్ బ్యాలెట్లను ఇంకా ఇందులో కలపని కారణంగా తుది పోలింగ్ శాతంలో మార్పులు ఉంటాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించడం తెల్సిందే. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 67.40 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలనాటికి దేశవ్యాప్తంగా 91.20 కోట్ల మంది ఓటర్లు ఉంటే ఆనాడు వారిలో 61.50 కోట్ల మంది మాత్రమే ఓటేశారు. ఇటీవల ముగిసిన 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య 96.88 కోట్లకు పెరగడం విశేషం. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి విడివిడిగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, మొత్తంగా ఓటింగ్ శాతాల సమగ్ర వివరాలు తమకు అందాక అందరికీ అందుబాటులోకి తెస్తామని ఈసీ గురువారం విడుదలచేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నికల కోడ్ ముగిసింది: ఈసీ



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో ఎన్నికల ప్రవర్తనావళి గడువు ముగిసింది. కేంద్ర కేబినెట్ సెక్రటరీ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల కమిషన్ గురువారం పంపిన ఒక సర్క్యులర్‌లో ఈ విషయం తెలిపింది. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడిన మార్చి 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం తెల్సిందే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఎత్తివేత నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని ఈసీ ప్రకటించింది. లోక్‌సభతోపాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఉప ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారం, పోలింగ్ నిర్వహణ, లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరపడంతోపాటు అధికార పార్టీలు, ప్రభుత్వాలు అధికార దుర్వినియోగాన్ని నివారించే లక్ష్యంతో దేశంలో 1960 నుంచి ఎన్నికల వేళ ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు.

విగ్రహాలకు స్థానచలనం

పాత భవనం లాన్ దగ్గరకు తరలింపు ● మండిపడ్డ కాంగ్రెస్

న్యూఢిల్లీ: నూతన పార్లమెంట్ ప్రాంగణంలో చూడగానే ఎదురుగా కనిపించే మహాత్మా గాంధీజీ, బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ మహరాజ్, జ్యోతిబా పూలే సహా పలువురు దేశ ప్రముఖుల విగ్రహాలను ప్రభుత్వం వేరే చోటుకు తరలించింది. ఉన్న చోటు నుంచి పాత పార్లమెంట్(సంవిధాన్ సదన్)లోని ఐదో నంబర్ గేట్ దగ్గరి లాన్ వద్దకు మార్చింది. ఈ లాన్‌లో ఇప్పటికే గిరిజన యోధుడు బిర్సా ముండా, మహారాణాప్రతాప్‌ల విగ్రహాలు ఉన్నాయి. విగ్రహాల తరలింపుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'మహాత్ముడు, అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఉద్దేశపూర్వకంగా అప్రాధాన్య చోట్లో ప్రతిష్టించడం అరాచకం'అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. '' సార్వత్రిక ఎన్నికల్లో మహారాష్ట్ర ఓటర్లు బీజేపీని తిరస్కరించారు. అందుకే మహారాష్ట్రతో అనుబంధమున్న ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్‌ల విగ్రహాలను వేరే చోటుకు మార్చేశారు. గుజరాత్‌లో బీజేపీ ఈసారి క్లీన్‌స్వీప్ చేయలేకపోయింది. అందుకే గుజరాతీలపై ఆగ్రహంతో గాంధీజీ విగ్రహాన్నీ తరలించారు' అని మరో నేత పవన్ ఖేడా వ్యాఖ్యానించారు. 'మహానుభావుల విగ్రహాలు తొలగించి గాడ్సే, మోదీ విగ్రహాలు పెడతారా?' అని టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ ప్రశ్నించారు. విమర్శలపై లోక్‌సభ సచివాలయం స్పందించింది. పార్లమెంట్‌కు విచ్చేసే సందర్శకులు చూసేందుకు అనువుగా 'ప్రేరణ స్థల్'కు విగ్రహాలను తరలించామని పేర్కొంది. ఏ విగ్రహాన్ని పక్కనపడేయలేదని స్పష్టంచేసింది.

పెద్ద శాఖలు ఇవ్వలేం!

- రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాలు బీజేపీకే
- లోక్‌సభ స్పీకర్ పోస్టుపైనా ఇదే వైఖరి

న్యూఢిల్లీ: ఎన్డీఏ నేతగా నరేంద్ర మోదీని ఎన్నుకున్న తర్వాత మంత్రివర్గ కూర్పుపై బీజేపీ దృష్టిసారించింది. మిత్రపక్షాల నుంచి కీలకశాఖలు కావాలనే డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో గురువారం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, ఇతర సీనియర్ నేతలు సమావేశమయ్యారు. ప్రాథమికంగా జరిగిన చర్చల్లో కీలకమైన రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాల శాఖలను తమ వద్దే అట్టిపెట్టుకోవాలని బీజేపీ నేతల నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. బీజేపీకి సొంతంగా 240 సీట్లు (ఎన్డీఏకు 293) మాత్రమే వచ్చినందువల్ల ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ (16 సీట్లు), జేడీయూ (12 సీట్లు)లపై పూర్తిగా ఆధారాపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పార్టీలు నలుగురు ఎంపీలకు ఒక కేబినెట్ మంత్రి పదవిని అడుగుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన టీడీపీకి నాలుగు, జేడీయూకు మూడు కేబినెట్ బెర్తులు ఇవ్వాల్సి ఉంటుంది. టీడీపీ స్పీకర్ పదవిని కూడా అడుగుతోంది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా కోరుతోంది. ఏడుగురు ఎంపీలున్న శివసేన (షిండే), ఐదుగురు ఎంపీలున్న ఎల్జేపీ (ఆర్‌వీ) కూడా రెండేసి మంత్రిపదవులు అడుగుతున్నాయి. గత రెండు ప్రభుత్వాల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ మార్కును దాటినందువల్ల మిత్రపక్షాలకు ముఖ్యమైన శాఖలు దక్కలేదు. ఎంపీల సంఖ్య ఆధారంగా మంత్రిపదవులు కేటాయించాల్సిన పరిస్థితిని ప్రస్తుతం బీజేపీ ఎదుర్కొంటోంది. కాబట్టి ఈసారి మిత్రపక్షాలకు మరింత ఎక్కువగా మంత్రిపదవులు దక్కనున్నాయి. మిత్రపక్షాల నుంచి ఎంత ఒత్తిళ్లు వచ్చినా అత్యంత కీలకమైన శాఖలపై బీజేపీ రాజీపడకపోవచ్చని సమాచారం. రక్షణ, ఆర్థిక, హోంశాఖ, విదేశీ వ్యవహారాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధితో ముడిపడిన శాఖలను కూడా తమ వద్దే ఉంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. అలాగే సంక్షేమం, యువజన వ్యవహారాలు, వ్యవసాయం తదితర శాఖలను అంత సులువుగా వదులుకునేలా లేదు. పేదలు, మహిళలు, యువకులు, రైతుల ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకొని ఈ శాఖలను తామే ఉంచుకోవాలని బీజేపీ ఆశిస్తోంది. రైల్వేలు, రహదారుల విషయంలోనూ గడిచిన పదేళ్లలో తాము భారీ సంస్కరణలు తెచ్చామని.. ఈ వేగం మందగించకూడదంటే ఈ శాఖలు తమ వద్దే ఉండాలని పేర్కొంటోంది. సంకీర్ణ ప్రభుత్వాల్లో రైల్వే శాఖ సాధారణంగా మిత్రపక్షాల చేతుల్లో ఉంటూ వచ్చింది. కానీ బీజేపీ గట్టి ప్రయత్నంలో రైల్వే శాఖను తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. జేడీయూకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఇచ్చేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. పౌర విమానయాన శాఖ, ఉక్కు శాఖ టీడీపీకి ఇవ్వజూపుతున్నట్లు సమాచారం. భారీ పరిశ్రమల శాఖను ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు ఆఫర్ చేస్తోంది. అయితే ఆర్థిక, రక్షణ తదితర కీలకశాఖల్లో మిత్రపక్షాలకు సహాయమంత్రి పదవులు ఇవ్వడానికి బీజేపీ సిద్ధంగా ఉందని చర్చలకు సంబంధించిన విషయాలపై సమాచారం ఉన్న విశ్వసనీయవర్గాలు తెలిపాయి. పర్యాటక, ఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్, సామాజిక న్యాయ శాఖలను మిత్రపక్షాలకు ఇచ్చే అవకాశముందని సమాచారం. చంద్రబాబు నాయుడు లోక్‌సభ స్పీకర్ పదవిపై పట్టుబడితే డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వజూపి ఆయన్ను ఒప్పించే ప్రయత్నం చేయవచ్చునంటున్నారు. బీజేపీ సంఖ్యాబలం లేనందున టీడీపీ, జేడీయూలు తమ డిమాండ్లపై పట్టుబడితే.. బీజేపీ ఎంతవరకు తలొగ్గుతుంది, ఎలా బుజ్జగిస్తుందనేది చూడాలి.

ప్రతిపక్ష నేతగా రాహుల్!

కాంగ్రెస్‌లో పెరుగుతున్న డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఎన్నికల్లో ఇటు కాంగ్రెస్ పుంజుకోవడంలో.. అటు కూటమి పక్షాల విజయంలో తనవంతు పాత్ర పోషించిన ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల్లో ఆయన పనితీరుపై అన్ని పక్షాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టి, పార్లమెంటులో ముందుండి పార్టీని నడిపించాలనే డిమాండ్‌లు క్రమంగా ఊపందుకుంటున్నాయి. ఇండియా కూటమిలోని చిన్నాచితకా పార్టీల నేతలు ఆయన ఎంపికను సమర్థిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి 2014లో కాంగ్రెస్ 48, 2019 ఎన్నికల్లో 52 స్థానాలు గెలుచుకున్న సమయంలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష హోదాను కోల్పోయింది. ఈ సమయంలో కాంగ్రెస్ పక్ష నేతగా రాహుల్ గాంధీని కొనసాగించాలనే డిమాండ్‌లు వచ్చినా ఆయన నిరాకరించారు. అయితే ప్రస్తుతం పార్టీకి సొంతంగా 99 సీట్లు వచ్చాయి. లోక్‌సభలో 10 శాతం సీట్లు అంటే కనీసంగా 55 సీట్లు వస్తే ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుంది. ప్రస్తుతం ఆ స్థానాలు గెలిచినందున ఆ హోదాలో రాహుల్‌గాంధీ ఉండాలని పార్టీ నేతలు కోరుతున్నారు. ఆయన ప్రస్తుత ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి భారీ మెజార్టీలతో గెలవడంతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడులో కూటమి పక్షాలకు మెజార్టీ స్థానాలు దక్కడంలో కీలకపాత్ర పోషించారు. ఈ దృష్ట్యానే పార్టీ నేతలు ఆయన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎన్నుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మాణిక్యం ఠాగూర్ 'ఎక్స్'లో స్పందిస్తూ 'నేను మా నాయకుడు రాహుల్ గాంధీ పేరు మీద ఓట్లు అడిగాను. ఆయన లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడిగా ఉండాలని భావిస్తున్నాను. ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలు కూడా అలాగే ఆలోచిస్తారని నేను ఆశిస్తున్నాను' అని పోస్ట్ చేశారు. మరో సీనియర్ నేత డీకే శివకుమార్ సైతం రాహుల్ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటారని జోస్యం చెప్పారు. ఒకవేళ రాహుల్ కాదన్న పక్షంలో సీనియర్ నేతలైన శశిథరూర్, గౌరవ్ గొగోయ్, మనీశ్ తివారీ, కేసీ వేణుగోపాల్‌లలో ఒకరిని ప్రతిపక్ష నేతగా ఎంపిక చేస్తారని చెబుతున్నారు. దీనిపై 8న జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తర్వాత నిర్ణయం చేస్తారని అంటున్నారు. మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన 8వ తేదీన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ జరగనుంది. ఇక రాహుల్ గెలిచిన రెండు స్థానాల్లో దేనిలో కొనసాగుతారు, దేనిని వదులుకుంటారన్న దానిపై ఇదే భేటీలో కొంత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

ఆ 105 మంది ఎంపీల విద్యార్హత 5-12 తరగతే



న్యూఢిల్లీ: కేవలం ఐదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్హత ఉన్న 105 మంది లోక్‌సభ అభ్యర్థులు తాజా ఎన్నికల్లో గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) నివేదికలో తేలింది. మేథో సంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్, ఏడీఆర్‌లు గెలిచిన అభ్యర్థుల విద్యార్హతల వివరాలను తాజాగా బహిర్గతం చేశాయి.

5-12 తరగతి: 105 మంది
(ఐదో తరగతి- ఇద్దరు
8వ తరగతి- నలుగురు
10వ తరగతి- 34 మంది
12వ తరగతి- 65 మంది)
డిగ్రీ, ఆపైన : 420 మంది
(ఇందులో డాక్టర్లు 4 శాతం, న్యాయవిద్య పట్టభద్రులు 7 శాతం, పీహెచ్‌డీ చేసిన వారు 5 శాతం ఉన్నారు)
డిప్లొమా : 17 మంది
అక్షరజ్ఞానం: ఒక్కరు
(విద్యార్హతలు లేవు)

ఎంపీల్లో 46 శాతం నేర చరితులు

ఏడీఆర్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: లోక్‌సభకు తాజాగా ఎన్నికైన 543 మందిలో 46 శాతం అంటే 251 మంది నేరచరితులు ఉన్నారని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) నివేదించింది. ఈ 251 మందిలో 27 మంది దోషులుగా తేలారు. నేర చరితులు ఇంత భారీ సంఖ్యలో దిగువసభకు ఎన్నికవడం ఇదే మొదటిసారి అని ఏడీఆర్ పేర్కొంది. 2014 ఎన్నికల్లో 34 శాతం అంటే 185 మంది, 2009లో 30 శాతం అంటే 162 మంది, 2004లో 23 శాతం అంటే 125 మంది క్రిమినల్ కేసులున్న వారు లోక్‌సభకు ఎన్నికైనట్లు ఏడీఆర్ వెల్లడించింది.

దోషులుగా నిర్ధారణ అయిన వారు: 27
విద్వేష ప్రసంగాల కేసులున్న వారు: 43
అత్యాచారం, హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు: 170 మంది
(మహిళలపై నేరాలు: 15, రేప్: 2, కిడ్నాప్: 4)
మామూలు క్రిమినల్ కేసులు ఉన్నవారు: 226
తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నవారు: 134

సంవత్సరం	నేర చరితులు
2024	251
2019	233
2014	185
2009	162
2004	125

శరణార్థులున్న స్కూలుపై దాడి..

33 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్(గాజా): ఇజ్రాయెల్ బలగాలు సెంట్రల్ గాజాలో వరుస దాడులు కొనసాగిస్తున్నాయి. నుసెయిరత్‌లోని అల్–సర్డి స్కూల్‌పై గురువారం వేకువజామున జరిపిన దాడుల్లో 14 మంది చిన్నారులు, 9 మంది మహిళలు సహా మొత్తం 33 మంది చనిపోయారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అల్–సర్డి స్కూల్‌లో శరణార్థి శిబిరం నడుస్తోంది. ఉత్తర గాజాలోకి ఇజ్రాయెల్ ఆర్మీ ప్రవేశించిన తర్వాత అక్కడి నుంచి ప్రాణాలరచేతిలో పట్టుకుని వచ్చిన వారంతా ఈ శిబిరంలో తలదాచుకుంటున్నారు. అయితే, హమాస్ మిలిటెంట్లు ఈ స్కూల్ నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఇజ్రాయెల్ మిలటరీ ఆరోపిస్తోంది. కాగా, గురువారం ఇజ్రాయెల్ ఆర్మీ నుసెయి రత్‌లోనే మరో నివాస భవనంపై జరిపిన దాడిలో మరో ఆరుగురు మృత్యువాత పడ్డారు. అల్–అక్సా మార్టిర్స్ ఆస్పత్రి క్షతగాత్రులతో కిటకిటలాడుతోందని స్థానికులు తెలిపారు. విద్యుత్ సరఫరా కూడా ఆస్పత్రిలోని కొన్ని ముఖ్యమైన వార్డుల్లోనే ఉందని చెప్పారు. మృతదేహాలతో కూడిన ప్లాస్టిక్ బ్యాగులు ఆవరణలో వరుసగా పడేసి ఉన్నాయని, బాధితుల బంధువుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోందన్నారు.

కంగనకు కానిస్టేబుల్ చెంపదెబ్బ

- చండీగఢ్ విమానాశ్రయంలో అనూహ్య ఘటన
- వెనువెంటనే ఆ మహిళా కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ: ఢిల్లీకి వెళ్లేందుకు గురువారం చండీగఢ్ విమానాశ్రయానికి వచ్చిన బాలీవుడ్ నటి, మండీ నియోజకవర్గ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు చేదు అనుభవం ఎదురైంది. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) మహిళా కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ ఆమెను చెంపదెబ్బ కొట్టారు. ఈ అనూహ్య ఘటనపై కంగనా సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. ''ఎయిర్‌పోర్ట్‌లో సెక్యూరిటీ చెక్‌ను పూర్తిచేసుకుని లోపలికి వెళ్తుంటే మహిళా కానిస్టేబుల్ హఠాత్తుగా ఎదురొచ్చి చెంప చెళ్లుమనిపించింది. తర్వాత దూషించింది. ఎందుకని అడిగితే రైతులకు మద్దతుగా ఆ పని చేశా అని చెప్పింది. పంజాబ్‌లో ఉగ్ర, హింసాత్మక ఘటనలు పెచ్చరిల్లుతున్నాయి'' అని కంగనా అన్నారు. ఢిల్లీకి చేరుకున్నాక సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌ను కలిసి జరిగింది వివరించారు.



కంగనా రనౌత్



కుల్వీందర్ కౌర్

కానిస్టేబుల్ వాదనేంటి?

చెంపదెబ్బ కొట్టాక అక్కడే కొద్దిసేపు ఉన్న కానిస్టేబుల్ అక్కడ వారితో.. '' నాలుగేళ్ల క్రితం వివాదాస్పద మూడు సాగు చట్టాలను రద్దుచేయాలంటూ ఆందోళన బాటపట్టిన వేలాది మంది రైతులను కించపరుస్తూ వ్యాఖ్యలు, పోస్ట్‌లు చేసినందుకే కంగనను కొట్టా. ఆనాడు ఢిల్లీలో బైఠాయించిన మహిళా రైతులను చూపిస్తూ వీళ్లంతా కేవలం రూ.100 కోసం ధర్నాలో పాల్గొన్నారు అని కంగనా కించపరిచారు. ఆనాడు ధర్నా చేస్తున్న వాళ్లలో మా అమ్మ కూడా ఉంది. మాది రైతు కుటుంబం. మా అన్న కూడా రైతు. కంగనా అలాగే రోడ్డుపై కూర్చొని ధర్నా చేయగలదా?'' అని ఆవేశంగా మాట్లాడారు.

కానిస్టేబుల్‌పై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ

ఘటనను సిట్టింగ్ మహిళా ఎంపీపై దాడిగా జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) అభివర్ణించింది. ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖా శర్మ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ఘటనను హరియాణా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసి ఎఫ్ఐఆర్‌ను నమోదుచేసి కేసు దర్యాప్తు ప్రారంభించామని ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ చెప్పారు. నిందితురాలు సీఐఎస్ఎఫ్ ఉద్యోగి కావడంతోపాటు ఎయిర్‌పోర్ట్‌లో ఘటన జరగడంతో కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి సీఐఎస్ఎఫ్ ఆదేశించింది. ఆమెను అదుపులోకి తీసుకుని సీఐఎస్ఎఫ్ కమాండ్ ఆఫీస్‌కు తీసుకెళ్లి ప్రశ్నిస్తున్నారు.

భద్రతా మండలికి పాక్

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితిలోని ప్రధానమైన భద్రతా మండలికి శాశ్వతేతర సభ్య దేశాల కోటాలో 5 దేశాలు ఎన్నికయ్యాయి. అవి..పాకిస్తాన్, పనామా, సొమాలియా, డెన్మార్క్, గ్రీస్. ఐరాస జనరల్ అసెంబ్లీలో రహస్య బ్యాలెట్ విధానంలో గురువారం జరిగిన ఎన్నికలో ఆఫ్రికా, ఆసియా–పసిఫిక్ ప్రాంతాలకుగాను సొమాలియా, పాకిస్తాన్‌లు, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంత దేశాలకుగాను పనామా, పశ్చిమ యూరప్, ఇతర దేశాలకుగాను డెన్మార్క్, గ్రీస్‌లు అత్యధిక ఓట్లు సంపాదించాయి. 2025 జనవరి నుంచి రెండేళ్ల పాటు 2026 డిసెంబర్ 31వ తేదీ వరకు ఇవి శాశ్వతేతర సభ్య హోదాలో కొనసాగుతాయి.

కర్ణాటక మంత్రి రాజీనామా

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఎస్టీ కార్పొరేషన్‌లో నిధులను అక్రమంగా బదిలీ చేశారంటూ ఆరోపణలను ఎదుర్కొంటున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి బి.నాగేంద్ర రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సీఎంకు అందజేసినట్లు గురువారం రాత్రి చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ నిష్పాక్షికంగా జరగాలనే పదవి నుంచి తప్పుకుంటున్నానని అన్నారు.

మోదీకి ప్రత్యామ్నాయం అన్వేషిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్: రౌత్



ముంబై: నరేంద్ర మోదీ బలవంతంగా మూడోసారి ప్రధానమంత్రి కావడానికి ప్రయత్నిస్తే ఆయన ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉండబోదని శివసేన(ఉద్ధవ్) సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ చెప్పారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడిని తెరపైకి తీసుకురావడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) కార్యాచరణ ప్రారంభించిందని అన్నారు. 2014, 2019లో బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌ఎస్‌ఎస్‌ను బానిసగా మార్చుకోవడానికి నరేంద్ర మోదీ, అమిత్ షా ప్రయత్నించారని ఆరోపించారు. ఇప్పుడు వారిద్దరి బలం తగ్గిపోయిందని పేర్కొన్నారు. మోదీని ఇంటికి సాగనంపే స్థితిలో ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ ఉందన్నారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం • 7 • జూన్ • 2024

అవయవదానంతో ఐదుగురికి పునర్జన్మ

అన్నానగర్: బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలను దానం చేశారు. ఐదుగురికి పునర్జన్మ లభించింది. విరుదునగర్ జిల్లా కారియాపట్టి తాలూకా మంతోపు గ్రామానికి చెందిన సురేష్ కుమార్ (31). భార్య, బిడ్డతో కలిసి తిరుపూర్‌లో ఉంటూ అక్కడే ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత 2న బైకులో వెళ్తూ సురేష్ అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడ్డ అతన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సురేష్‌కుమార్ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. సురేష్‌కుమార్ అవయవాలు దానం చేసేందుకు బంధువులు అంగీకరించారు. లివర్‌ను సేలంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, ఒక కిడ్నీ, కళ్లు కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి, మరొక కిడ్నీ సేలంలోని మోహన్ కుమారలింగం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అవయవదానంతో ఐదుగురికి పునర్జన్మ లభించింది. అవయవాలను దానం చేసిన సురేష్‌కుమార్‌ను ఆస్పత్రి డీన్ నిర్మల, అధికారులు నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

తిరుత్తణి సబ్‌జైలులో వసతుల తనిఖీ



సబ్ జైలులో తనిఖీ చేస్తున్న న్యాయమూర్తులు, కలెక్టర్, ఎస్పీ

తిరుత్తణి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తిరుత్తణి సబ్‌జైలులో గురువారం న్యాయమూర్తులు, కలెక్టర్, ఎస్పీ బృందం తనిఖీ చేశారు. జైల్లో ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, పరిశుభ్రత, రక్షణకు సంబంధించి తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తిరువళ్లూరు జిల్లా ప్రిన్సిపల్ న్యాయమూర్తి జూలియట్ పుష్ప, జ్యుడిషియల్ న్యాయమూర్తి మోహన్, కలెక్టర్ ప్రభుశంకర్, ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ బృందం తనిఖీ చేశారు. ఈసందర్భంగా తిరుత్తణి సబ్‌జైలులో ప్రస్తుతం 9 మంది ఖైదీలు జైలు జీవితం గడుపుతున్న క్రమంలో వారికి అందుతున్న భోజన సౌకర్యాలు, సబ్ జైలు నిర్మించి చాలాకాలం కావడంతో భవనం శిథిలావస్థలో దుస్థితికి చేరుకున్న సంఘటలకు సంబంధించి వివరాలు సేకరించారు. అలాగే ఖైదీలను జైలు అధికారులు నడుపుతున్న విధానం పట్ల ఖైదీల నంఉచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలుకు సంబంధించిన పూర్తి వివరాలను సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

సంగీత కళలకు అంతర్జాతీయ కేంద్రం చెన్నై



ప్రారంభోత్సవంలో అనంత్ వైద్యనాథన్, ఉన్నికృష్ణన్

కొరుక్కుపేట: సంగీతం, సంగీత కళలకు చెన్నై నగరం అంతర్జాతీయ కేంద్రంగా నిలిచిందని భారతీయ సింగింగ్ ట్రైనర్ అనంత్ వైద్యనాథన్ అన్నారు. ఈమేరకు చెన్నై ఆళ్వార్‌పేటలో ఆర్టియమ్ అకాడమీ మొట్టమొదటి ఆఫ్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు . కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనంత్ వైద్యనాథన్‌తోపాటు నేషనల్ అవార్డు విన్నింగ్ సింగర్ ఉన్నికృష్ణన్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఆర్టియమ్ అకాడమీని లాంచనంగా ప్రారంభించారు. ముందుగా ఆర్టియమ్ అకాడమీ ప్రెసిడెంట్, సహ వ్యవస్థాపకులు వివేక్ రైచా మాట్లాడుతూ రాబోయే 12 నుంచి 18 నెలల్లో భారతదేశం అంతటా 50 ఆర్టియమ్ అకాడమీ ఆఫ్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

అన్నామలై ఓటమితో గుండు

కొరుక్కుపేట: అన్నామలై ఓడితే గుండు గీయించుకుని బజారులో తిరుగుతానని ఇతర పార్టీ మిత్రులకు సవాల్ విసిరిన విధంగానే ఓ బీజేపీ నేత చెప్పినట్టుగానే గుండు గీయించుకుని బజారులో తిరిగివచ్చాడు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఉకుడి యూనియన్ బీజేపీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమ విభాగం కార్యదర్శి జయశంకర్. ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో కోయంబత్తూరులో బీజేపీ తరఫున పోటీ చేసిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తప్పకుండా గెలుస్తారని ఆ ప్రాంతానికి చెందిన వీసీకే, అన్నాడీఎంకే మిత్రులతో అన్నారు. విజయం సాధించకుంటే ఏం చేస్తారని జయశంకర్‌ను ప్రశ్నించారు. గెలవకుంటే గుండు గీయించుకుని బజార్‌లో తిరుగుతానని జయశంకర్ సవాల్ విసిరారు. అన్నామలై ఓడిపోవడంతో జయశంకర్ గుండు కొట్టించుకుని బుధవారం పరమకురిచ్చి బజార్‌కు వెళ్లారు.

లోక్‌సభకు నారీ శక్తి

కనిమొళి, తమిళచ్చి తంగపాండియన్, రాణి శ్రీకుమార్, జ్యోతిమణి, సుధా



- రాష్ట్రం నుంచి ఐదుగురు 'ఎంపీ'లు
- రెండో సారి ముగ్గురు
- తొలిసారిగా ఇద్దరు

సాక్షి, చెన్నై: తమిళనాడు నుంచి ఐదుగురు నారీ మణులు లోక్‌సభలో అడుగు పెట్టనున్నారు. ఇందులో ముగ్గురు రెండవ సారి వెళ్తుండగా, మరో ఇద్దరు కొత్త ముఖాలు తొలిసారిగా అడుగు పెట్టబోతున్నారు.

రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక సంస్థలలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. అదే సమయంలో జాతీయ స్థాయిలో లోక్‌సభ, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు దిశగా కసరత్తులే జరుగుతున్నాయి. ఇటీవలే పార్లమెంట్ ఆమోదాన్ని ఈ బిల్లు పొందింది. అయితే, అమలు అన్నది ఎప్పుడో అన్న చర్చ జరుగుతూ వస్తున్నది. ఈ పరిస్థితులలో 2024 లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలోని 39 స్థానాలలో 77 మంది మహిళలు పోటీ చేశారు. ఇందులో 20 మంది నామ్ తమిళర్ కట్చికి చెందిన వారు ఉండడం విశేషం. ఈ పార్టీకి చెందిన మహిళలు కొంత మేరకు ఓటు బ్యాంక్‌ను కైవసం చేసుకుని బలాన్ని చాటుకున్నారు. అన్నాడీఎంకే తరఫున ఒకరు పోటీ చేయగా డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఇక, డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన మహిళలు అందరూ విజయఢంకా మోగించారు. రాష్ట్రంలో 39 స్థానాలను డీఎంకే కూటమి కైవసం చేసుకోగా, ఇందులో 34 మంది పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు.

లోక్‌సభకు ఐదుగురు

77 మందిలో ఐదుగురు విజేతలుగా నిలిచారు. వీరిలో తూత్తుకుడి నుంచి కనిమొళి డీఎంకే తరఫున గెలిచారు. గతంలో రాజ్యసభ ఎంపీగా వ్యవహరించిన కనిమొళి 2019లో తొలిసారిగా తూత్తుకుడి నుంచి పార్లమెంట్‌కు గెలిచారు. ప్రస్తుత గెలుపుతో రెండోసారిగా అడుగు పెట్టనున్నారు. దక్షిణ చెన్నై నుంచి గత ఎన్నికలలో తొలిసారిగా పార్లమెంట్‌లో తమిళచ్చి తంగపాండియన్ (డీఎంకే)అడుగు పెట్టారు. ఈసారి బలమైన అభ్యర్థి బీజేపీకి చెందిన మాజీ గవర్నర్ తమిళిసైను ఢీకొట్టి రెండో సారిగా పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్నారు. సాధారణ కార్యకర్తగా ఉన్న జ్యోతిమణికి గత ఎన్నికలలో కరూర్ నుంచి పోటీ చేసే అవకాశాన్ని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ కల్పించారు. గత ఎన్నికలలో గెలిచి ప్రజలలో ఒకరిగా మమేకమై ఉన్న జ్యోతిమణికి రెండోసారి అవకాశం రావడంతో విజయాన్ని సొంతం చేసుకుని పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు రెడీ అయ్యారు. ఇక మైలాడుతురైకు అభ్యర్థి ఎవరో అన్న చర్చ కాంగ్రెస్‌లో చివరి వరకు సస్పెన్స్‌గానే సాగింది. హైకోర్టు న్యాయవాది సుధాకు చివరి క్షణంలో ఈ సీటు కేటాయించడంతో గెలుపు దక్కేనా అన్న చర్చ జోరుగానే జరిగింది. అయితే, కూటమి బలంతో కొత్త ముఖంగా తొలి సారి పార్లమెంట్‌లో అడుగు పెట్టేందుకు సుధా సిద్ధమయ్యారు. అలాగే, వైద్యురాలైన డాక్టర్ రాణి శ్రీకుమార్ డీఎంకే తరఫున తెన్‌కాశి(రి) స్థానం నుంచి తొలిసారిగా గెలిచారు. అన్నాడీఎంకే, బీజేపీ కూటమిలోని వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన రెండు పార్టీల అధినేతలను ఢీకొట్టి విజయకేతనంతో తొలిసారిగా లోక్‌సభ మెట్లు ఎక్కేందుకు ఈ డాక్టరు రెడీ అయ్యారు. ధర్మపురిలో పీఎంకే తరఫున పోటీ చేసిన ఆ పార్టీ వ్యవస్థాపకుడు రాందాసు కోడలు, పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాసు సతీమణి సౌమ్య అన్బుమణి డీఎంకే అభ్యర్థి మణికి గట్టి పోటీనే ఇచ్చారు. ఆది నుంచి నువ్వా, నేనా అని ముందంజలో దూసుకెళ్లిన సౌమ్య అన్బుమణికి స్వల్ప ఓట్ల తేడాతో విజయం దూరం కావడంతో పార్లమెంట్‌లో అడుగు పెట్టలేని పరిస్థితి ఎదురైంది.

విజయోత్సవం!



స్టాలిన్‌కు స్వాగతం పలుకుతున్న డీఎంకే శ్రేణులు

- స్టాలిన్‌కు బ్రహ్మరథం
- అన్నా అరివాలయంలో మిన్నంటిన సంబరాలు
- విజేతలందరికీ ఆశీస్సులు

సాక్షి, చెన్నై: డీఎంకే కూటమి అభ్యర్థుల విజయోత్సవం గురువారం సాయంత్రం అన్నా అరివాలయంలో జరిగింది. కార్యక్రమానికి హాజరైన సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌కు బ్రహ్మరథం పట్టారు. విజేతలందరికీ స్టాలిన్ ఆశీస్సులు అందజేశారు.

లోక్‌సభ ఎన్నికలలో పుదుచ్చేరిలోని ఒక నియోజకవర్గం, తమిళనాడులోని 39 స్థానాలను డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి క్వీన్‌స్వీప్‌తో రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. క్వీన్ స్వీప్ అన్నది ఇదే ప్రప్రథమం. 2014 ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేసి రాష్ట్రంలోని 39 స్థానాలలో 37 నియోజకవర్గాలను కైవసం చేసుకుని దివంగత సీఎం జయలలిత అప్పట్లో రికార్డు సృష్టించారు. 2019 ఎన్నికలలో డీఎంకే కూటమి ఈ రికార్డును అధిగమించే విధంగా 38 స్థానాలను దక్కించుకుంది. తాజా ఎన్నికలలో రాష్ట్రంలోని 39 స్థానాలను, పొరుగున ఉన్న పుదుచ్చేరి సీటును డీఎంకే క్వీన్ స్వీప్ చేయడం ఆ కూటమిలో ఆనందాన్ని రెట్టింపు చేసింది. ఈ సంబరాలను డీఎంకే కూటమి వర్గాలు ఆనందంతో జరుపుకుంటున్నారు. అయితే, ఈ ఆనందంలో సీఎం స్టాలిన్ పాలు పంచుకోలేని పరిస్థితి. ఆయన జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టడంతో ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది. ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశాన్ని ముగించుకుని గురువారం సాయంత్రం చెన్నై తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంకు స్టాలిన్ వెళ్లారు. ఆ సమయంలో ఆయనకు బ్రహ్మరథం పట్టే విధంగా ఆహ్వానం లభించింది. మేళతాళాలు, డప్పు వాయిద్యాల హోరు, ఆట పాటలు, పుష్పపు జల్లులతో ఆహ్వానం పలికారు. పార్టీ కార్యాలయంలో సమావేశ మందిరంలో పార్టీ, మిత్ర పక్షాల తరఫున పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు స్టాలిన్‌ను కలిసి ఆశీస్సులు అందుకున్నారు.

ఈ సందర్భంగా అందరికీ ఆశీస్సులను అందజేసి, శుభాకాంక్షలను స్టాలిన్ తెలియజేశారు. తమిళగళాన్ని పార్లమెంట్‌లో జ్వలింపచేయాలని, కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంతో ఢీకొట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విజయోత్సవాన్ని జరుపుకునే విధంగా కార్యక్రమం జరిగింది. గెలిచిన అభ్యర్థులందరూ స్టాలిన్‌కు పుస్తకాలను అందజేసి ఆశీస్సులను అందుకున్నారు.

పుదుచ్చేరి మంత్రుల్లో టెన్షన్

- పదవీ గండం తప్పదన్న చర్చ
- ఢిల్లీకి బీజేపీ అభ్యర్థి, హోంమంత్రి నమశ్శివాయం
- రసవత్తరంగా రాజకీయం



ప్రచారంలో నమశ్శివాయంతో రంగస్వామి

సాక్షి, చెన్నై: పుదుచ్చేరిలో రాజకీయం రసవత్తరంగా మారింది. బీజేపీ అభ్యర్థి, హోంశాఖ మంత్రి నమశ్శివాయం ఓటమిని ఆ పార్టీ అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. పలువురు మంత్రుల నియోజకవర్గాలలో ఓటు తగ్గడంతోనే ఓటమి తప్పదన్న విషయం తేటతెల్లం కావడం చర్చకు దారి తీసింది. హుటాహుటిన నమశ్శివాయం ఢిల్లీకి వెళ్లడంతో మంత్రి పదవులకు గండం తప్పదన్న చర్చ జోరందుకుంది.

పుదుచ్చేరిలో బీజేపీ–ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. సీఎంగా ఎన్ఆర్ కాంగ్రెస్ నేత రంగస్వామి, హోంమంత్రిగా బీజేపీ నేత నమశ్శివాయం వ్యవహరిస్తున్నారు. ఇదే విధంగా రెండు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు పలువురు మంత్రులుగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ద్వారా తొలిసారిగా పుదుచ్చేరి నుంచి పార్లమెంట్‌లో తమ ప్రతినిధి అడుగుపెట్టాలన్న కాంక్షతో బీజేపీ అధిష్టానం వ్యూహాలకు పదును పెట్టింది. ఎన్ఆర్ కాంగ్రెస్ వద్ద పట్టుబట్టి మరీ ఈ సీటును దక్కించుకుంది. అభ్యర్థిగా హోంమంత్రి నమశ్శివాయం పోటీ చేశారు. అయితే, ఫలితాలలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ వైద్యలింగం చేతిలో ఓటమి పాలయ్యారు. 1.30 లక్షల ఓట్లతో వైద్యలింగం రెండో సారి గెలిచారు.

ఢిల్లీకి నమశ్శివాయం..

ఫలితాలలో సీఎం రంగస్వామి నియోజకవర్గం తట్టాన్ చావడి, ఎన్ఆర్ కాంగ్రెస్ మంత్రులు తేని జయకుమార్, లక్ష్మీనారాయణన్, తిరుమురుగన్, స్పీకర్ ఎన్బలం ప్రాతి నిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో కాంగ్రెస్‌కు మరీ అధిక ఓట్లు రావడం చర్చకు దారి తీశాయి. అలాగే, బీజేపీ మంత్రులు రామచంద్రన్, శరవణకుమార్ పోటీ చేస్తున్న నియోజకవర్గాలలోనూ ఓట్లు తగ్గడం విస్మయానికి గురి చేశాయి. పని గట్టుకుని మంత్రులు తనను ఓడించారన్న ఆగ్రహంతో నమశ్శివాయం ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. మి త్ర పక్షంతోపాటు సొంత పార్టీకి చెందిన మంత్రులు తనకు సహకరించక పోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. అదేసమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన పిలుపుతో హుటాహుటిన గురువారం బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ పెద్దలతో మాట్లాడినానంతరం బీజేపీ తరఫున మంత్రులుగా ఉన్న వారిపై వేటు వేసే దిశగా కసరత్తులకు అవకాశాలు ఉన్నట్టు చర్చ జోరందుకుంది. అదే సమయంలో ప్రభుత్వానికి ఎక్కడ ఇరకాటం వస్తుందో అన్న ఆందోళన ఎన్ఆర్ కాంగ్రెస్ రంగస్వామిలోనూ బయలుదేరి ఉంది. ఇదే అదనుగా బీజేపీ ఆగ్రహానికి గురి కాకుండా ముందు జాగ్రత్తగా తన మంత్రులను సైతం మార్చేయడానికి తగ్గ కసరత్తులలో రంగస్వామి ఉన్నట్టు సమాచారం వెలువడడంతో పుదుచ్చేరి రాజకీయం రసవత్తరంగా మారింది.

రీ కౌంటింగ్‌కు పట్టు

- విరుదునగర్‌లో కుట్ర
- ఎన్నికల కమిషన్‌కు ప్రేమలత ఫిర్యాదు
- కోర్టును ఆశ్రయించాలని సాహూ హితవు



మాణిక్యం ఠాకూర్, విజయప్రభాకరన్, రాధికా శరత్‌కుమార్



మీడియాతో ప్రేమలత విజయకాంత్

సాక్షి, చెన్నై: విరుదునగర్‌లో విజయప్రభాకరన్ ఓటమి పాలు కాలేదని, కుట్రతో ఓడించారని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ ఆరోపించారు. రీకౌంటింగ్ జరపాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు ఈ మెయిల్ ద్వారా గురువారం ఫిర్యాదు చేశారు. విరుదునగర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ మాణిక్యం ఠాకూర్, బీజేపీ అభ్యర్థి రాధికాశరత్‌కుమార్, అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే అభ్యర్థిగా దివంగత విజయకాంత్ వారసుడు విజయ ప్రభాకరన్ పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆది నుంచి ఇక్కడ సమరం ఆసక్తికరంగా సాగుతూ వచ్చింది. తాను సిట్టింగ్ ఎంపీ కావడంతో ప్రజలకు పట్టం కడతారన్న ధీమాతో మాణిక్యం ఠాకూర్, తాను సినీ సెలబ్రటీ కావడమే కాకుండా నాడర్, నాయుడు సామాజికవర్గం ఓట్లు కలిసి వస్తాయన్న ఆశతో రాధికా శరత్ కుమార్, తన తండ్రి గతంలో ఇక్కడ చేసిన సేవ, తన తండ్రి బంధుగణం మద్దతు, ఆయన మరణంతో సానుభూతి, అన్నాడీఎంకే మద్దతు కలిసి వస్తుందన్న ఎదురుచూపుల్లో తీవ్రంగానే ఓట్ల వేటలో విజయప్రభాకరన్ నిమగ్నమయ్యారు. ఫలితాల లెక్కింపులో ఇందుకు అనుగుణంగానే హోరాహోరీ సమరం నెలకొంది. మధ్యాహ్నం వరకు నువ్వా,నేనా అన్నట్టుగా ఓట్ల వేటలో అభ్యర్థులు ముందుకెళ్లారు. మధ్యాహ్నం తర్వాత రాధికా శరత్ కుమార్ వెనుకంజలోకి వెళ్లడంతో ప్రధాన సమరం మాణిక్యం ఠాకూర్, విజయ ప్రభాకరన్ మధ్య చోటు చేసుకుంది. అనేక రౌండ్లలో విజయప్రభాకరన్ ఐదు వేల ఓట్లకు పైగా మెజారిటీతో దూసుకెళ్లడంతో గెలుపు అవకాశాలు అధికమే అన్న చర్చ జరిగింది. అయితే, పొద్దు పోయే వరకు జరిగిన కౌంటింగ్‌లో చివరి క్షణంలో మాణిక్యం ఠాకూర్ 4,379 ఓట్లతో గెలిచినట్టుగా ఎన్నికల యంత్రాంగం ప్రకటించింది. ఈ సమయంలో కాంగ్రెస్ వర్గాలతో డీఎండీకే, అన్నాడీఎంకే వర్గాలు ఢీకొట్టినా ఫలితం శూన్యం. ఈ పరిణామాలన్నీ పరిగణించి డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా విజయకాంత్ గురువారం మీడియా ముందుకు వచ్చారు. రీకౌంటింగ్‌కు పట్టుబడుతూ ఎన్నికల కమిషన్‌కు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు.

కుట్రతో ఓడించారు...

విజయకాంత్ వారసుడు ఓటమి పాలుకాలేదని, ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఓట్లు వేసినా, కుట్రలు పన్ని అధికార పక్షం ఓడించిందని ఆమె ఆరోపించారు. పుదుచ్చేరితోపాటు తమిళనాడులో 40 స్థానాల క్లీన్ స్వీప్ కోసం విజయప్రభాకరన్‌ను బలి పశువు చేశారని పేర్కొన్నారు. 39 స్థానాలలో గెలిచిన మీకు, విజయకాంత్ వారసుడు, తొలిసారి ఎన్నికలలో నిలబడ్డ యువకుడైన విజయ ప్రభాకరన్ గెలుపు అడ్డుగా మారిందా అని ప్రశ్నించారు. యువకుడిని ప్రోత్సహించకుండా రాజకీయ కుట్ర చేయడం భావ్యమా అని ప్రశ్నించారు. చెన్నై నుంచి విరుదునగర్ జిల్లా కలెక్టర్‌కు వచ్చిన ఒత్తిళ్లు, తన సెల్‌ఫోన్‌ను ఆయన స్విచ్ ఆఫ్‌చేయడం వంటి పరిణామాలను ఎన్నికల కమిషన్ గుర్తించాలన్నారు. ఈ ఒత్తిళ్ల కారణంగానే రెండు గంటల పాటు కౌంటింగ్ నిలుపుదల చేశారని పేర్కొన్నారు. 13రౌండ్ల వరకు గెలుపు తమదే అన్నట్టుగా పరిస్థితులు ఉన్నా, చివరకు తీవ్ర కుట్రపన్ని విజయకాంత్ వారసుడ్ని ఓడించారని ధ్వజమెత్తారు. వాస్తవం ఏమిటో ప్రజలకు తెలియాల్సి ఉండడంతోనే రీ కౌంటింగ్‌కు డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే సమాధానం ఆధారంగా తర్వాత అడుగులు వేస్తామన్నారు. ఇదిలా ఉండగా, విజయకేతనం ఎగురవేసిన మాణిక్యం ఠాకూర్ డీఎండీకే ఆరోపణలను తోసి పుచ్చారు. రాత్రి ఏడు గంటల వరకు అభ్యర్థి విజయప్రభాకరన్, ఆయన ప్రధాన ఏజెంట్, మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ కౌంటింగ్‌సెంటర్‌లోనే ఉన్నారని, తపాలా ఓట్ల సమగ్ర వివరాల సమయానికి వారు అక్కడి నుంచి జారుకున్నారని, ఇప్పుడేమో కుట్ర జరిగినట్టు ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రేమలత విజయకాంత్ ఆరోపణలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ స్పందించారు. ఇక, రీ కౌంటింగ్ కావాలంటే కోర్టును ఆశ్రయించాల్సిందేనని హితవు పలికారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రేమలత విజయకాంత్ తర్వాత ప్రయత్నాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

ఐక్యతా నినాదం

- ఓటమితో అన్నాడీఎంకేలో కొత్త నినాదం
- అందరూ ఏకం కావాలని శశికళ పిలుపు
- అదేబాటలో పన్నీరు సెల్వం
- మౌనంగా పళనిస్వామి



శశికళ, పళనిస్వామి, పన్నీరుసెల్వం

సాక్షి, చెన్నై: ఓటమి ప్రభావం అన్నాడీఎంకేలో ఐక్యతా నినాదం తెరపైకి తెచ్చింది. ఇకనైనా అందరం ఏకం కావాలని విడివిడిగా ఉన్న నేతలకు శశికళ పిలుపునిచ్చారు. కేడర్ అలర్ట్ కావాలని కోరారు. ఇదేబాటలో మాజీ సీఎం పన్నీరుసెల్వం నినాదం అందుకున్నారు. అంతేకాకుండా దివంగత నేత ఎంజీఆర్ నాలై నమదే చిత్రంలోని పాటను జోడించి ప్రకటనను గురువారం విడుదల చేశారు. అయితే, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి మౌనం వహించినా, ఆయన తరఫున సీనియర్ నేత కేపీ మునుస్వామి స్పందిస్తూ ఆ ఇద్దరికి చోటులేదని స్పష్టం చేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్నాడీఎంకే 32 స్థానాలలో పోటీ చేసి ఘోర పరాజయాన్ని చవిచూసిన విషయం తెలిసిందే. ఇందులో 23 చోట్ల రెండవ స్థానం దక్కించుకుంది. ఇవి కూడా తమకు కంచుకోటగా ఉన్న కొంగు మండలంలోని సేలం, కరూర్, నామక్కల్, తిరుప్పూర్, ఈరోడ్, పొల్లాచ్చి, కోయంబత్తూరు, నీలగిరి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక్కడ నాలుగు లక్షల మేరకు ఓట్లు దక్కడంతో ఆ పార్టీ ఓటుబ్యాంక్ సైతం చేజారకుండా జాగ్రత్తలు పడ్డారు. మిగిలిన చోట్ల డిపాజిట్లు గల్లంతు కావడమే కాదు. కొన్నిచోట్ల నాలుగో స్థానానికి పరిమితం కావడం ఆ పార్టీ వర్గాలను షాక్‌కు గురి చేసింది. తమ కంచుకోటలో ఓటమి ఎదురైనా ఓటు బ్యాంక్ రూపంలో బలాన్ని చాటుకున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి మున్ముందు పార్టీలో కొత్త చిక్కులు తప్పవన్న చర్చలు జరుగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా పార్టీలోని అసంతృప్తి వాదులను, కేడర్‌ను ఏకం చేసే దిశగా శశికళ ఐక్యతా నినాదం అందుకున్నారు. ఇందుకు తన మద్దతు అంటూ మాజీ సీఎం పన్నీరుసెల్వం సైతం అదే నినాదం అందుకున్నారు. ఐక్యతా నినాదంతో శశికళ కేడర్‌కు లేఖ రాశారు.

ఏకం అవశ్యం..

కేడర్‌కు శశికళ రాసిన లేఖలో అన్నాడీఎంకే పతనం ఇక తాను చూడలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఆర్ స్థాపించిన ఈ పార్టీని జయలలిత ఉన్నత స్థానానికి చేర్చారని గుర్తు చేశారు. దేశంలోనే మూడవ అతి పెద్ద పార్టీగా అవతరించిన అన్నాడీఎంకేను ప్రస్తుతం పాతాళంలోకి నెట్టే పరిస్థితులు ఎదురై ఉండడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. ఇక, అందరూ ఏకం కావాల్సిన అవశ్యం ఉందని, ఈ బాధ్యతలను కేడర్ తమ భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే కేడర్ శక్తితో నిండిన పార్టీ అని, కేడర్ నిర్ణయమే శిరోధార్యం అని, ఇక కేడర్ అందరూ ఏకమై పార్టీని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఇక, మరింత ఓటమి అంచుకు పార్టీ చేరేందుకు వీలు లేదని, అందర్నీ సమన్వయ పరిచే ప్రయత్నాలు చేయాల్సిన బాధ్యత కేడర్ మీదే ఉందని సూచించారు. అదే సమయంలో మాజీ సీఎం పన్నీరుసెల్వం సైతం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఎంజీఆర్ నటించిన నాలై నమదే చిత్రంలోని «తాయ్ వలి వంద సొందంగల్ ఒరు వలియిల్»(పేగు బంధం ద్వారా వచ్చిన వారంతా ఒకే మార్గం)లో అన్న గీతాన్ని తన ప్రకటనలో ప్రథమంగా పేర్కొంటూ ఐక్యతా నినాదాన్ని అందుకున్నారు. ఇకనైనా ఏకం కాకుంటే నష్టం మరింత తీవ్రం అనే హెచ్చరికలు చేశారు. ఈ ఇద్దరి ప్రకటనల నేపథ్యంలో ఎంఆర్‌సీ నగర్‌లో సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం, మాజీ మంత్రులు కడంబూరు రాజు, మాధవరం మూర్తి, ఎమ్మెల్యేలు చిదంబర పాండియన్, అరుల్‌మొళి ఏకమై ప్రత్యేక సమావేశం నిర్వహించడం చర్చకు దారి తీసింది. అదే సమయంలో పళని స్వామితో సీనియర్ నేత ఎస్పీ వేలుమణికి మధ్య మళ్లీ అగాధం అన్నట్టుగా చర్చ తెరపైకి రావడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో పన్నీరు వెన్నంటి ఉన్న సీనియర్ నేత కృష్ణన్ బయటకు వచ్చి కీలక ప్రకటన చేశారు. అన్నాడీఎంకేను రక్షించుకోవాలంటే దివంగత నేత ఎంజీఆర్ గతంలో అనుసరించిన వ్యూహాలే అమలు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

గతంలో పార్టీ పరంగా అంతర్గత సమస్యలు బయలుదేరిన వేళ ఎంజీఆర్ ఓ కమిటీని ఏర్పాటు చేసి, అన్ని వర్గాలతో చర్చించి ఒకే వేదికపైకి తెచ్చారని, ప్రస్తుతం ఈ తరహాలో ఓ కమిటీ అన్నాడీఎంకేకు అవశ్యం అని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే అంతర్గత వివాదాలు ఓ వైపు ఉన్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పుండు మీద కారం చల్లే విధంగా మరింత చిచ్చుకు పరిస్థితులు కల్పించే కొత్త నినాదం తెరపైకి తెచ్చారు. ఎన్నికలలో ఘోర పరాజయానికి కారుకులు ఎవరో అని ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. ఈ వివాదాల నేపథ్యంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి మౌనం వహించడం చర్చకు దారి తీసింది. పార్టీ వర్గాలతో భేటీకి పిలుపునిచ్చే కసరత్తులపై దృష్టి పెట్టడం ఆలోచించ దగ్గ విషయం. ఈ సమయంలో అన్నాడీఎంకే సీనియర్‌నేత కేపీ మునుస్వామి మీడియాతో మాట్లాడుతూ అన్నాడీఎంకేలో పన్నీరు, శశికళ, దినకరన్‌లకు చోటులేదని స్పష్టం చేశారు. అన్నాడీఎంకే బలం పెరిగిందని, ఇందుకు కారణం ఓటు బ్యాంక్ అని వ్యాఖ్యలు చేయడం కొసమెరుపు.

తిరుప్పావై సేవ



చెన్నై, టీనగర్ వెంకటనారాయణ రోడ్డులోని టీటీడీ ఆలయంలో గురువారం ఉదయం తిరుప్పావై సేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో స్థానిక సలహా మండలి సభ్యులు మోహన్‌రావు, మేడగం శ్రీనివాసరెడ్డి, రాధాకృష్ణ, కార్తిక్, ఊరా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

\- కొరుక్కుపేట

క్లుప్తంగా

తిరుత్తణిలో వర్షం



జలమయంగా ఆర్కే పేట రోడ్డు

పళ్లిపట్టు: తిరుత్తణి, ఆర్కేపేట పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం జోరువాన కుమ్మరించింది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధానరోడ్లు జలమయంగా దర్శనమిచ్చాయి. తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్కేపేట పరిసర ప్రాంతాల్లో వేసవి ఎండలు మూడు నెలలుగా తీవ్ర ప్రతాపం చూపడంతో పగటి సమయాల్లో వేడిగాలులతో పాటు రాత్రి వేళల్లో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈక్రమంలో వారం రోజులుగా ఎండల తీవ్రత కాస్త తగ్గిన క్రమంలో గురువారం ఉదయం నుంచి ఎండల తీవ్రత కనిపించినా సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆర్కేపేట, కేజీ.కండ్రిగ ప్రాంతాల్లో జోరువాన గంటపాటు కుమ్మరించింది. అదే సమయంలో సాయంత్రం చల్లటి గాలులు వీచి మోస్తరుగా వాన కురిసింది. దీంతో చల్లని వాతావరణంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

లారీ బోల్తా

-డ్రైవర్ దుర్మరణం -క్లీనర్‌కు తీవ్రగాయాలు



వేలూరు: లారీ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం చెందాడు. క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్రిష్ణగిరి జిల్లా సూలగిరి గ్రామానికి చెందిన సాధిక్(35) లారీడ్రైవర్. ఇతను బుధవారం సాయంత్రం లారీలో కాయ గూరలు, కొత్తమల్లి లోడ్‌తో వేలూరులోని నేతాజీ మార్కెట్‌లో దించి క్లీనర్ రాజాతో కలిసి గురువారం ఉదయం క్రిష్ణగిరికి బయలుదేరారు. లారీ తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని విన్నమంగళం గ్రామం వద్ద వెళుతుండగా లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ సాధిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వాహనచోదకులు వెంటనే ఆంబూరు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, క్లీనర్‌ని ఆంబూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ బోల్తా పడడంతో ట్రాఫిక్ స్తంభించింది.

కట్ట పంచాయితీలు చేస్తే చర్యలు



సెల్‌ఫోన్‌లను యజమానులకు అప్పగిస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: పోలీసులు కట్ట పంచాయితీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణివన్నన్ తెలిపారు. వేలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన సెల్‌ఫోన్‌లు ట్రాక్ చేసి వాటిని యజమానులకు గురువారం ఉదయం అప్పగించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను కనుకొనేందుకు సెల్‌ఫోన్ ట్రాక్ అనే ట్రాకర్ వాట్సాప్‌ను పరిచయం చేశామన్నారు. ఈ ట్రాకర్ ద్వారా వాట్సాప్‌లో ఫిర్యాదు చేసిన వారికి ఆ సెల్‌ఫోన్ ఎవరి వద్ద ఉంది, ఏ ప్రాంతంలో ఉంది అనే విషయాలను తెలుసుకుని ఆ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫిర్యాదు చేసిన యజమానులకు అప్పగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు నాలుగు విడతలుగా రూ.కోటి 24 లక్షల 47 వేలు విలువ చేసే 672 సెల్‌ఫోన్‌లు కనుగొని యజమానులకు అప్పగించారన్నారు. ప్రస్తుతం ఐదవ విడతగా రూ.26 లక్షల 20 వేలు విలువ చేసే 130 సెల్‌ఫోన్‌లను, నూతనంగా కనుగొన్న సీఈఐఆర్ అనే యాప్ ద్వారా కనుగొన్న 120 సెల్‌ఫోన్‌లను యజమానులకు అప్పగించామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం రూ.కోటి 74 లక్షల 67 వేలు విలువ చేసే 922 సెల్‌ఫోన్‌లను కనుగొని యజమానుల వద్ద అప్పగించడం జరిగిందన్నారు. ఈ సెల్‌ఫోన్‌లను కనుగొనేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్న వేలూరు క్రైమ్, సైబర్ క్రైమ్ పోలీసులు పలు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం వేలూరు జిల్లాలో చోరీలు, హత్యా నేరాలు కొంత వరకు తగ్గిందన్నారు. అయితే ప్రమాదాలు 4 శాతం పెరిగాయన్నారు. ప్రమాదాల నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేలూరు జిల్లాలోని 106 ప్రాంతాలను ప్రమాద స్థలాలుగా గుర్తించి సూచిక బోర్డులతోపాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌లో సెటిల్ మెంట్‌లు, కట్ట పంచాయితీలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించామన్నారు. చిన్నారుల సంరక్షణ కోసం పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదనపు పోలీస్ సూపరింటెండెంట్ భాస్కరన్, కోటీశ్వరన్, గౌతమన్ పాల్గొన్నారు.

ఇంటి లబ్ధిదారుల ఎంపికపై సర్వే



సత్రం జయపురంలో పూరిళ్లు పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుత్తణి: కలైంజర్ కళల ఇంటి పథకం ద్వారా లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి కలెక్టర్ ప్రభుశంకర్ గురువారం సర్వే చేశారు. పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా తమిళనాడును రూపుదిద్దేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ కలైంజర్ కళల ఇంటి పథకం అమలు చేశారు. ఇందుకోసం 2024–25 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇళ్ల ఎంపిక కోసం ఇంటికి రూ.3.10 లక్షలు చొప్పున కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించి పేదలకు అందజేయనున్నారు. పథకంలో భాగంగా తిరువళ్లూరు జిల్లాలో పూరిళ్ల సర్వే చేపట్టి అర్హులను ఎంపిక చేసి త్వరలో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈక్రమంలో తిరుత్తణి యూనియన్ చత్రంజయపురంలో పూరిళ్లకు సంబంధించి నిర్వహిస్తున్న సర్వే పనులను కలెక్టర్ ప్రభుశంకర్ పరిశీలించి తనిఖీ చేశారు. పూరిళ్లలో నివాసముంటున్న వారితో మాట్లాడి ఎన్ని సంవత్సరాలుగా పూరింట్లో నివాసముంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పూరింట్లో నివాసముంటున్న ప్రతిఒక్కరికీ న్యాయం జరగాలని, సమస్యలు చూసి, అర్హులను దూరం చేయరాదని, పూరింట్లో ఉండే వారిని గుర్తించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రాజెక్టర్ డైరెక్టర్ సుహపుత్ర, డివిజన్ సహాయ ఇంజినీర్ (పంచాయతీ రాజ్ శాఖ) కోమతి, బీడీఓలు సంతానం, సెల్వకుమార్ పాల్గొన్నారు.



సత్కారం

నీట్ యూజీ-2024 పరీక్షల్లో రాణించిన విద్యార్థులను ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీస్ లిమిటెడ్ ఘనంగా సత్కరించింది. చెన్నై లోని ఆ విద్యా సంస్థలో శిక్షణ పొందిన ఆదిత్యకుమార్ పండా, రాష్ట్రంలో తొలి టాపర్‌గా నిలిచాడు. అలాగే అతడితోపాటు 16 మంది అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. వీరందరిని గురువారం ఆకాష్ ఎడ్యుకేషన్ హెడ్ ధీరజ్ మిశ్రా చెన్నైలో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అందరికీ అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.

-సాక్షి, చెన్నై

పీఓఎస్ యంత్రాల పంపిణీ



మిషిన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం(పళ్లిపట్టు): కాంచీపురం జిల్లాలోని చౌక దుకాణాలకు పీఓఎస్ మిషిన్లను కలెక్టర్ గురువారం పంపిణీ చేశారు. కాంచీపురం జిల్లా వ్యాప్తంగా 634 చౌకదుకాణాలు ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్ 2016 నుంచి అందుబాటులోకి వచ్చింది. అదే సమయంలో 2019 నుంచి ఫింగర్ ప్రింటింగ్ బయోమెట్రిక్ పద్ధతి అమలుచేస్తున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చౌక దుకాణాలకు కొత్త పీఓఎస్ యంత్రాలను ఆయా దుకాణాల సేల్స్‌మన్ వద్ద కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులు పక్కదారి పట్టకుండా అర్హులకు అందేందుకు వీలుగా అనేక చర్యలు తీసుకున్నట్లు, వస్తువుల నాణ్యతతో పాటు బరువు కచ్చితంగా ఉండేలా మార్పులు చేసినట్లు తెలిపారు. నకిలీ జాబితాల ద్వారా బయట వ్యక్తులకు వస్తువులు సరఫరా కాకుండా నిరోధించి ప్రభుత్వానికి నష్టాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

పురుషులు మాత్రమే పాల్గొనే పండుగ

- 200 మేకలను బలి
- 15వేల మందికి మాంసాహార విందు

తిరువొత్తియూరు: శ్రీనత్తం సమీపంలో పురుషులు మాత్రమే పాల్గొనే పండుగ ఘనంగా నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ఆలయ ఉత్సవాల్లో 200 మేకలను బలి ఇవ్వగా, 15 వేల మందికి మేక మాంసంతో వంటలు చేసి, విందు ఇచ్చారు. దిండుకల్ జిల్లా నత్తం సమీపంలోని కరులక్కంపట్టి, సేతూర్ పంచాయతీలోని కరుప్పసామి వడగాట్టన్ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం కరుప్పసామి వడగాట్టన్ స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అలంకారం, దీపారాధనలు జరిగాయి. అనంతరం భక్తులు తమ సంతాన ప్రసాదం కోసం, వారి శుద్ధ మొక్కులు కోసం ఇచ్చిన బియ్యం బస్తాలతో సహా 200కి పైగా మేకలు బలి ఇచ్చి, ఆ మాంసంతో విందు భోజనం తయారు చేసి, భక్తులకు వడ్డించారు. ఈ ఆలయం ఉన్న ప్రాంతానికి, ఆలయానికి మహిళలు రాకూడదు. మగవాళ్లు మాత్రమే పాల్గొనే విచిత్రమైన పండుగ ఇది. ఈ సందర్భంగా వండిన మాంసాహారాన్ని ప్రసాదంగా అందరికీ వడ్డించారు. సేత్తూరు, అరవంగురిచ్చి, ఎస్.పుత్తుకోట్టై, పట్టికుళం, నల్లూరు, కురుంబపట్టి సహా పరిసర ప్రాంతాల నుంచి 15 వేల మందికిపైగా పురుషులు ఈ విందులో పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో ప్రసాదంగా అందించే కూర గాయలను రెండేళ్లలోపు ఆడపిల్లలు మాత్రమే తినాలని, మహిళలు వీటిని ఉపయోగించకూడదని భక్తులు వెల్లడించారు.

నవవధువు హత్య

అన్నానగర్: శృంగారానికి నిరాకరించిన నవ వధువును ఆమె భర్త ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేసిన ఘటన సెంజీ సమీపంలో బుధవారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..వేలూరు జిల్లా అత్తియూర్ గ్రామం కలందమేడు బ్లాక్‌కు చెందిన కామరాజ్ విల్లుపురం జిల్లా సెంజీ సమీపంలోని వీరనమూరులో నివాసమున్నాడు. ఆయన కుమారుడు సుకుమార్ (28), సుబ్రమణి కుమారుడు దివ్య (20) గత ఏడాదికి ముందు ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ తరచూ సెల్‌ఫోన్లలో మాట్లాడుకుంటూ ప్రేమించుకుంటున్నారు. ఒకానొక సమయంలో ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే గత ఏప్రిల్ 15వ తేదీన వివాహం జరిగింది. పెళ్లికి ముందు సుకుమార్‌కు మద్యం తాగే అలవాటు ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త జీవితంలో ఎన్నో కలలు కన్న దివ్యకు ఇది షాక్‌గా మారింది. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ స్థితిలో గురువారం ఉదయం సుకుమార్ ఎప్పటిలాగే మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఉల్లాసంగా గడపడానికి శృంగారం కోసం భార్యను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. కానీ సుకుమార్ మత్తులో ఉండడంతో దివ్య అందుకు ఆమె నిరాకరించి అతడిని దూరంగా నెట్టేసింది. దీంతో కోపోద్రిక్తుడైన సుకుమార్ పక్కనే ఉన్న ఇనుప రాడుతో దివ్య తలపై కొట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే సుకుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సెంజీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దివ్య మృతదేహాన్ని పరిశీలించి ఇరుగుపొరుగు వారిని విచారించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సెంజీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సుకుమార్‌ను అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారు.

శివకార్తికేయన్ చిత్రంలో సల్మాన్‌ఖాన్?



సల్మాన్‌ఖాన్‌తో శివకార్తికేయన్

తమిళసినిమా: ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నటీనటులు దక్షిణాదిపై దృష్టి సారిస్తున్న విషయం తెలిసిందే. జాకీష్రాఫ్, సంజయ్‌దత్, బాబీడియోల్ వంటి స్టార్ నటులు దక్షిణాదిలో, ప్రతినాయకుడి పాత్రల్లో, గుణచిత్ర పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ కూడా దక్షిణాది తెరపై మెరవబోతున్నట్లు తాజాగా ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అదీ ఆయన తమిళ చిత్రంలో క్యామియో పాత్రలో కనిపించనున్నట్లు టాక్. సమీపకాలంలో నటుడు శివకార్తికేయన్ మావీరన్, అయలాన్ చిత్రాల విజయాలతో మంచి జోరుమీదున్నారు. ప్రస్తుతం వరుస పెట్టి చిత్రాలు చేస్తున్నారు కూడా. నటుడు కమలహాసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించిన అమరన్ చిత్రంలో నటించి పూర్తి చేశారు. దేశింగు పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శివకార్తికేయన్ సైనికుడిగా నటించారు. ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దర్శకుడు ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ తన 23వ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో కన్నడ భామ రుక్మిణి వసంత్ నాయకిగా నటిస్తున్నారు. ప్రముఖ మలయాళ నటుడు బిజూమీనన్, తుపాకీ చిత్రం ఫేమ్ విద్యుత్ జమ్వాల్ ముఖ్యపాత్రలను పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది. శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. రూ.150 కోట్ల భారీ బడ్జెట్‌లో రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రాన్ని ఇదే ఏడాది చివరిలో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ క్యామియో పాత్రలో మెరిసే అవకాశం ఉన్నట్లు తాజాగా జరుగుతున్న ప్రచారం. దర్శకుడు ఏఆర్.మురుగదాస్ హిందీలో సల్మాన్‌ఖాన్ హీరోగా సికిందర్ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఆ పరిచయంతో సల్మాన్‌ఖాన్ తమిళంలో శివకార్తికేయన్‌తో చేస్తున్న చిత్రంలో అతిథి పాత్రలో నటింపజేస్తున్నట్లు టాక్. అయితే ఇందులో నిజం ఎంత అన్నది తెలియాల్సి ఉంది.

కోలీవుడ్ టాక్స్

సిద్ధార్థ్ కథానాయకుడిగా మిస్‌యూ



సిద్ధార్థ్ | ఆషికా రంగనాథ్

తమిళసినిమా: ఇటీవల చిత్తా వంటి విజయవంతమైన చిత్రంలో నటించిన నటుడు సిద్ధార్థ్. తాజాగా మరోసారి ప్రేమ కథా చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. దీనికి మిస్‌యూ అనే టైటిల్‌ను నిర్ణయించారు. తమిళనాడులో బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్ రంగాల్లో పేరు గాంచిన 7 మైల్స్ ఫర్ సెకండ్ సంస్థ అధినేత సామ్యువేల్ మ్యాథ్యూ ఈ చిత్రం ద్వారా చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగు పెడుతున్నారు. కాగా ఇందులో తెలుగు, కన్నడం భాషల్లో మంచి పేరు తెచ్చుకున్న నటి ఆషికా రంగనాథ్ కథానాయకిగా కోలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తున్నారు. నటుడు జేపీ, పొన్‌వన్నన్, కరుణాకరన్, నరేన్, అనుపమ, రమ, బాలా శరవణన్, లొల్లు సభ మారన్, సస్టిక తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా మాప్పిళ్లై సింగం, కళత్తిల్ సంధిప్పోమ్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు ఎన్.రాజశేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జిబ్రాన్ సంగీతం, కేజీ.వెంకటేశ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. చిత్రం వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది హీరో హీరోయిన్లకు మాత్రమే ప్రాముఖ్యత ఉండేలా కాకుండా, అందరికీ ప్రాధాన్యత ఉండేలా కథ, కథనాలు ఉంటాయన్నారు. వినోదంతో కూడిన ప్రేమ కథా చిత్రంగా మిస్‌యూ ఉంటుందన్నారు. చాలా కాలం తరువాత నటుడు సిద్ధార్థ్ పూర్తిగా ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రొమాంటిక్ లవర్ బాయ్‌గా నటిస్తున్నట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం కమలహాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఇండియన్ 2 చిత్రంలో సిద్ధార్థ్ ముఖ్యపాత్రను పోషించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం త్వరలో తెరపైకి రానుంది.

ఎమోషనల్, ఎంటర్‌టెయినర్‌గా వెపన్



వెపన్ చిత్రంలో వసంత్‌రవి, తాన్యాహోప్

తమిళసినిమా: వెపన్ చిత్రంపై సినీ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. నటుడు సత్యరాజ్, వసంత్ రవి ప్రధాన పాత్రలు పోషించిన ఇందులో నటి తాన్యాహోప్, రాజీవ్‌మీనన్, వేలు ప్రభాకరన్, రాజీవ్ పిళ్లై, యాషికా ఆనంద్, మైమ్‌గోపి, కనిహా, గజరాజ్, సైయద్ సుబన్, భరద్వాజ్ రంగన్, మాయా కృష్ణన్, షియాస్ క్రేమ్,పెనిట్టో ఫ్రాంక్లిన్, రఘు ఎసక్కి, వినోదిని వైద్యనాథన్, మేఘ్నా సురేశ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. గుహన్ సెన్నియప్పన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం, ప్రభు రాఘవ్ ఛాయాగ్రహణం అందించారు. మిలియన్ స్టూడియో సంస్థ నిర్మించిన ఈ భారీ బడ్జెట్ కథా చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని శుక్రవారం తెరపైకి రానుంది. ఈ సందర్భంగా చిత్రంలో ప్రధాన పాత్రను పోషించిన నటుడు వసంత్‌రవి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ దీని విజువల్ ప్రామోలకు ప్రేక్షకుల మధ్య లభించిన ఆదరణ తమకు సంతోషాన్ని కలిగించిందన్నారు. దీంతో చిత్రానికి ప్రశంసలు లభిస్తాయనే నమ్మకం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇది ఎమోషనల్‌తో కూడిన యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. చిత్రం ఆది నుంచి చివరి వరకూ ఉత్కంఠభరితంగా సాగుతుందని చెప్పారు. తాను ఎప్పుడూ విభిన్న కథా పాత్రలను ఎంపిక చేసుకుని తన నటనను మెరుగుపరచుకోవాలని భావిస్తానన్నారు. ఆ విధంగా వెపన్ చిత్రంలో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన మిలియన్ స్టూడియో అధినేతలకు, దర్శకుడు గుహన్ సెన్నియప్పన్‌కు రుణపడి ఉంటానన్నారు. వెపన్ చిత్రం గురించి చాలా విషయాలు చెప్పాలని ఉన్నా, అవి చిత్రాన్ని స్పాయిల్ చేస్తాయని చెప్పడం లేదన్నారు. అయితే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభవాన్ని కలిగిస్తుందని మాత్రం చెప్పగలన్నారు. సత్యరాజ్ వంటి గొప్ప నటుడితో కలిసి నటించడం ఘనతగా భావిస్తున్నాని వసంత్ రవి పేర్కొన్నారు. నటి తాన్యా హోప్ తన అనుభవాన్ని పంచుకుంటూ దర్శకుడు కథ చెప్పగానే తన మనసులో మెదిలింది సత్యరాజ్, రాజీవ్ మీనన్, వసంత్ రవి వంటి ప్రముఖ నటులతో కలిసి నటించబోతున్నాను అన్నదేనన్నారు. ఇప్పటి వరకూ తను నటించనటువంటి పాత్రను ఇందులో పోషించినట్లు చెప్పారు. ఇందులో తన పాత్రనే కాకుండా అన్ని పాత్రలు చాలా బలంగా ఉంటాయని తాన్యాహోప్ చెప్పారు.

ఆ పాటలో నటించ వద్దన్నారు



సమంత

తమిళసినిమా: వృత్తిపరంగానే కాదు, వ్యక్తిగతంగానూ నటి సమంత ఒక సంచలనమే. మొదట్లో తమిళంలో కొన్ని చిత్రాల్లో నటించినా, తెలుగులో నటించిన తొలి చిత్రం ఏమాయ చేసావే సక్సెస్ ఆమె నట జీవితాన్నే మార్చేసింది. ఆ తరువాత తెలుగులో స్టార్ హీరోలతో జత కట్టే అవకాశాలు వరుస కట్టడంతో స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. ఆ తరువాత తమిళంలో విజయ్, సూర్య, విశాల్ వంటి స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు వరించాయి. అలా తమిళం, తెలుగు భాషల్లో క్రేజీ కథానాయకిగా రాణిస్తున్న సమయంలోనే టాలీవుడ్ యువ నటుడు నాగచైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే ఆ వివాహ జీవితం ఎక్కువ కాలం సాగలేదు. అభిప్రాయభేదాల కారణంగా విడిపోయారు. ఈ విషయాన్ని పక్కన పెడితే సమంత ఐటమ్ సాంగ్ చేసిన చిత్రం పుష్ప. అల్లుఅర్జున్, రష్మిక మందన్నా జంటగా నటించిన ఈ చిత్రం 2022లో విడుదలై ఎంత సంచలన విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ విజయంలో సమంత నటించిన ఊ అంటావా మామ పాటకు అధిక భాగమే ఉంది. ఆ పాటలో సమంత శృంగార భరిత నటన యువతను గిలిగింతలు పెట్టించింది. ఆ పాటకు డాన్స్ చేయడానికి సమంతకు రూ. 5 కోట్లు పారితోషికం ఇచ్చినట్లు ప్రచారం జోరుగా సాగింది. అయితే ఈ పాటలో నటించవద్దని తన కుటుంబసభ్యులు,స్నేహితులు చెప్పారని సమంత ఇటీవల ఒక భేటీలో పేర్కొన్నారు. అందులో ఆ సమయంలో తాను విడాకులు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నానని, అలాంటి సమయంలో పుష్ప చిత్రంలో ఐటమ్ సాంగ్‌లో నటించవద్దని కుటుంబసభ్యులు, సన్నిహితులు చెప్పారన్నారు. అయితే తాను వారి వ్యతిరేకతను మీరి ఆ పాటలో నటించానని పేర్కొన్నారు. ఆ పాట పెద్ద టర్నింగ్ గా మారిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. నిజం చెప్పాలంటే ఆ అవకాశాన్ని కాదనడానికి తన వద్ద సరైన కారణం లేదన్నారు. అలాంటప్పుడు ఎందుకు దాన్ని నిరాకరించాలి, తానే తప్పు చేయలేదు అని అన్నారు. వివాహ జీవితంలోనూ తాను వంద శాతం నిజాయితీగా ఉన్నానని చెప్పారు. అయితే అది తనకు వర్కౌట్ కాలేదని అన్నారు. సమంత చెప్పిన ఈ విషయం పాతదే అయినా ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా మైయోసైటీస్ అనే అరుదైన వ్యాధి బారిన పడిన సమంత ఖుషీ చిత్రం తరువాత మరో చిత్రం నటించలేదు. కాగా సమంత ఇప్పుడు తన సొంత నిర్మాణంలో చిత్రం చేసి తన మార్కెట్‌ను తిరిగి నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఈమె ట్రెండింగ్‌లోనే ఉన్నారు.

విదార్థ్, జననీ జంటగా నూతన చిత్రానికి శ్రీకారం



నూతన చిత్ర ప్రారంభోత్సవ వేడుకలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: ఇప్పటివరకూ తమిళ సినిమాలకు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చిన కువియం సంస్థ తాజాగా చిత్ర నిర్మాణ రంగంలోకి ప్రవేశించింది. ఈ సంస్థ అధినేత లాల్‌కుడి ఎం.హరిహరన్ కువియం ఫిలింస్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రంలో నటుడు విదార్థ్, జనని హీరోహీరోయిన్లుగా నటిస్తుండగా, ఎంఎస్.భాస్కర్, శరవణన్, బబ్లు పృథ్వీరాజ్, నమితా కృష్ణమూర్తి, షారిక్ హాసన్, వికాస్, మహ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, కథనం, దర్శకత్వం బాధ్యతలను కృష్ణకుమార్ నిర్వహిస్తున్నారు. లాల్‌గుడి ఎం.హరిహరన్ సంగీతం, ప్రభు రాఘవ్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలను బుధవారం చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణకుమార్ చిత్ర వివరాలను తెలుపుతూ మనం చేసిన తప్పు ఏ కాలంలోనూ మనల్ని విడవదని, ఏదో విధంగా మనల్ని చేరుతుందనే ఇతి వృత్తంతో రూపొందిస్తున్న కథా చిత్రం ఇదని చెప్పారు. హైపర్ లింక్ నాన్ లీనియర్ బాణీలో కథనాన్ని రచించినట్లు చెప్పారు. ఇంతకు ముందెప్పుడూ ఎవరూ చెప్పని విధంగా ఒక ప్రయోగం ఈ చిత్రంలో చేస్తున్నట్లు చెప్పారు. సస్పెన్స్, థ్రిల్లర్, డ్రామా, ప్రేమ వంటి అంశాలతో మూడు కథలు చివరిలో ఒకే చోట ముగిసేలా ఈ చిత్రం ఉంటుందన్నారు. చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను జూలై నెలలో ప్రారంభించిన 35 రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా చిత్రం టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు దర్శకుడు చెప్పారు. కాగా బుధవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని, యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు.

క్లుప్తంగా

28 ఏళ్ల తర్వాత రూ.500 చెల్లించిన ఏసీబీ

అన్నానగర్: అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఇచ్చిన రూ.500ను 28 ఏళ్ల తరువాత తిరిగి చెల్లించారు. వివరాల్లోకి వెళితే.. కోయంబత్తూరులోని నవ ఇండియా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో కదిర్మదియన్ నివాసముంటున్నారు. ఈయన 1996లో తన ఇంటి విద్యుత్ కనెక్షన్ పేరు మార్పు విషయమై విద్యుత్ బోర్డు అధికారికి దరఖాస్తు చేసుకున్నాడు. అప్పుడు విద్యుత్ బోర్డు అధికారి రూ.500 చెల్లిస్తేనే పేరు మారుస్తామని తెలిపారు. దీనిపై కదిర్మదియన్ అవినీతి నిరోధ కశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ స్థితిలో విద్యుత్ బోర్డు అధికారి కదిర్మదియన్ నుంచి రూ.500 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో అవినీతి నిరోధకశాఖ అధికారులు కేసు సాక్ష్యం కోసం కదిర్మదియన్ నుంచి రూ.500 తీసుకున్నారు. 28 ఏళ్ల తర్వాత అవినీతి నిరోధక శాఖ పోలీసులు బుధవారం అప్పట్లో తీసుకున్న రూ.500 తిరిగి ఇచ్చారు.

మద్యం మత్తులో భార్యను పొడిచాడు

– భర్త అరెస్ట్

తిరువొత్తియూరు: మద్యం మత్తులో భార్యను కత్తితో పొడిచి గాయపరిచిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై, వ్యాసార్పాడి శాస్త్రినగర్ 11వ వీధికి చెందిన మణిమారన్ (45), కౌసల్య (40) దంపతులు ఉన్నారు. కౌసల్య నుంగంబాక్కంలో ఇంటిపని చేస్తోంది. మణిమారన్ పనికి వెళ్లకుండా రోజూ మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్యతో గొడవ పడ్డాడు. తరువాత ఆగ్రహం చెంది కత్తి తీసి కౌసల్యపై దాడి చేశాడు. దీంతో ఆమె వీపు భాగంలో కత్తి వేటుపడింది. ఆమె కేకలు వేయడంతో మణిమారన్ పారిపోయాడు. దీంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కౌసల్యను చికిత్స నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంకేబీ నగర్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి కేసు నమోదు చేసి మణిమారన్‌ను అరెస్టు చేశారు. విచారణ అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

రెండు లోహ విగ్రహాలు స్వాధీనం

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు చెత్తలో పడి ఉన్న రెండు లోహ విగ్రహాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. దిండుక్కల్ సమీపం పాత కరూర్ రోడ్డులోని ఎస్ఎస్ నగర్ బస్సు బస్టాండ్ సమీపంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు చెత్తను వేరుచేస్తున్నారు. అప్పుడు అక్కడ పడి ఉన్న బ్యాగులో రెండు లోహ స్వామి విగ్రహాలు ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న దేవదాయ శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విగ్రహాలను స్వాధీనం చేసుకుని పారిశుద్ధ్య సిబ్బందిని విచారించారు. చెత్తలో లభించిన విగ్రహాలను మీనాక్షమ్మన్ మదురై వీరన్‌గా గుర్తించారు. విగ్రహాలు ఒక అడుగు ఎత్తు, ఒక్కొక్కటి 2 కిలోల బరువు ఉన్నాయి. విగ్రహాలను దిండుక్కల్ పశ్చిమ తాలూకా కార్యాలయానికి తీసుకెళ్లి ఉంచారు. దీనిపై పురావస్తు శాఖకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించిన తర్వాత విగ్రహాల కాలం గురించి తెలుస్తుందని పోలీసులు తెలిపారు. అలాగే విగ్రహాలు చోరీకి గురై చెత్తకుప్పలో వేశారా అనే కోణంలో పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

భర్తకు కత్తిపోట్లు

– భార్య కోసం పోలీసుల గాలింపు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లా కొమరపురం సమీపంలో చానల్ కరై ప్రాంతానికి చెందిన రాజేంద్రన్ (34) డ్రైవర్. ఇతని భార్య మెర్లిన్ సీత (30). వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ క్రమంలో మెర్లిన్ సీతకు కొమరపురానికి చెందిన కట్టడ తాపీమేస్త్రి రీగన్ జోయిస్ (30) పరిచయమయ్యాడు. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. సంవత్సరం క్రితం సీత భర్త నుంచి విడిపోయి బిడ్డ సహా రీగన్ జోయిస్‌తో ఉంటోంది. ఈక్రమంలో బుధవారం రాజేంద్రన్ ఒక పని విషయంగా కొమరపురం వద్ద వున్న సంతకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడికి మెర్లిన్ సీత, రీగన్‌జోయిస్ వెళ్లారు. భార్య, ప్రియుడితో రావడం చూసిన రాజేంద్రన్ భార్యను ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో రాజేంద్రన్‌పై రీగన్ జోయిస్, మెర్లిన్ సీత కత్తితో దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడ్డ రాజేంద్రన్‌ను ఆచారిపల్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు రీగన్ జోయిస్, మెర్లిన్ సీత కోసం గాలిస్తున్నారు.

డీఎంకే కౌన్సిలర్ మృతి

తిరువొత్తియూరు: పుదుకోట్టై సమీపం డీఎంకే కౌన్సిలర్ హఠాత్తుగా మృతిచెందారు. పుదుకోట్టై జిల్లా, గంధర్వకోట్టై సుందరం పట్టి ఆది ద్రావిడర్ వీధికి చెందిన స్టాలిన్ (44). పుదుకోట్టై జిల్లాలో డీఎంకే జిల్లా కౌన్సిలర్. 3వ తేదీన ఈరోడ్‌లోని తన స్నేహితులు శక్తివేల్, వివేక్, వినోద్, రమేష్‌కుమార్, సందూరు, పాన్‌ల్‌రాజ్‌లను చూసేందుకు వెళ్లాడు. స్టాలిన్, అతని స్నేహితులు ఈరోడ్‌లోని 2 లారాషంబట్టిలోని శక్తివేల్ బంధువు ఇంట్లో బస చేశారు. ఈ స్థితిలో బుధవారం ఉదయం ఊరికి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో స్టాలిన్ ఒక్కరే మంచం నుంచి లేవలేదు. ఆ తర్వాత అతన్ని ఈరోడ్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి మార్గమధ్యంలో స్టాలిన్ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వతంత్ర అభ్యర్థికి 15 వేల ఓట్లు

– అడగకుండానే వేశారని ఆనందం

సాక్షి, చెన్నై: అగ్గిపెట్టెకు, బిస్కెట్‌కు తేడా తెలియని ఓటర్లు ఉండడం తిరుచ్చి లోక్‌సభ ఫలితాల సమయంలో వెలుగు చూసింది. నామినేషన్‌తో సరి ప్రచారం లేకుండా పోయిన తనకు ఏకంగా 15 వేల ఓట్లు రావడం ఓ స్వతంత్ర అభ్యర్థిని విస్మయంలో పడేసింది. తిరుచ్చి లోక్‌సభ నుంచి డీఎంకే కూటమిలో ఎండీఎంకే అభ్యర్థిగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో వారసుడు దురై వైగో గెలిచిన విషయం తెలిసిందే. అయితే, ఈ నియోజకవర్గంలో పార్టీల వారీగా, స్వతంత్ర అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందు పరిచింది. ఇందులో స్వతంత్ర అభ్యర్థికి ఏకంగా 15 వేల ఓట్లు రావడం అందర్నీ విస్మయానికి గురిచేసింది.

స్వతంత్ర అభ్యర్థికే షాక్

తిరుచ్చిలో ఎండీఎంకే, అన్నాడీఎంకే, అమ్మమక్కల్ మున్నేట్ర కళగం, నామ్ తమిళర్ కట్చితో పాటుగా 35 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగా పద్మశ్రీ అవార్డు పొందిన దామోదరన్‌తో పాటు మరికొందరు కూడా పోటీ చేశారు. ఫలితాలలో ఎండీఎంకే గెలిచింది. రెండో స్థానాన్ని అన్నాడీఎంకే, మూడో స్థానాన్ని నామ్ తమిళర్ కట్చి, నాలుగో స్థానాన్ని అమ్మమక్కల్ మున్నేట్ర కళగం దక్కించుకున్నాయి. వీరందరూ ఓట్ల కోసం తీవ్ర ప్రచారం నిర్వహించిన వారే. అయితే, ఈ నియోజకవర్గంలో పోటీలో సెల్వరాజ్ అనే స్వతంత్ర అభ్యర్థి కూడా నిలబడ్డారు. నామినేషన్ వేయడంతో సరి, ఆతర్వాత నియోజకవర్గం వైపుగా ఆయన తొంగి చూడలేదు. ఎక్కడ ఓట్ల కోసం ప్రచారం కూడా చేయలేదు. కనీసం కరప్రతాలను కూడా పంచ లేదు. ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌ల వైపుగా కూడా రాలేదు. చివరకు కౌంటింగ్ రోజున కేంద్రం వైపుగా కూడా తొంగి చూడలేదు. అయితే, ఫలితాల లెక్కింపులో ఆయనకు ప్రతిరౌండ్‌లో 700 ఓట్లు రావడం, గంధర్వ కోట అసెంబ్లీ నియోజకవర్గంలో ఏకంగా 3,279 ఓట్లు దక్కడం ప్రధాన పార్టీల అభ్యర్థులను విస్మయంలో పడేశాయి. మొత్తంగా ఆయనకు 14,796 ఓట్లు వచ్చాయి. ఈ సమాచారంతో సెల్వరాజ్ సైతం విస్మయానికి గురయ్యాడు. తనకు ఇంత మద్దతా అని షాక్‌కు గురయ్యారు. అయితే, ఓటర్లు గందరగోళానికి గురై సెల్వరాజ్‌కు ఓట్లు వేశారన్నది వెలుగుచూసింది. ఎండీఎంకే ఓట్లన్నీ సెల్వరాజ్ ఖాతాలో చేరడం గమనార్హం. ఎండీఎంకేను ఉదయ సూర్యుడి చిహ్నంలో పోటీ చేయాలని తొలుత డీఎంకే నిర్బంధించింది. అయితే, తమ చిహ్నం బొంగరం కోసం ఎన్నికల కమిషన్ వద్ద ఎండీఎంకే అభ్యర్థి వైగో ఎదురు చూసి చివరకు అగ్గిపెట్టెతో సర్దుకున్నారు. ఈవీఎంలో అగ్గి పెట్టె చిహ్నం, సెల్వరాజ్‌కు కేటాయించిన బిస్కెట్ చిహ్నం దాదాపుగా ఒకే పోలికతో ఉండడంతో ఓటర్లు రెండింటికీ తేడా తెలియక గందరగోళానికి గురైనట్టు స్పష్టమవుతుండడం గమనార్హం.



అగ్గిపెట్టె, బిస్కెట్ సింబల్

పెయింట్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

– రూ.లక్షల విలువైన వస్తువులు దగ్ధం

అన్నానగర్: సుంగువారిచత్రంలోని ఓ పెయింట్ దుకాణంలో గురువారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో లక్షల విలువైన వస్తువులు కాలి దగ్ధమయ్యాయి. కాంచీపురం జిల్లా సుంగువారి చత్రం బజార్‌కు చెందిన వెంకటేశ. ఇతనికి ఇంటి ముందు పెయింట్, ఫ్యాన్సీ దుకాణం ఉన్నాయి. వెంకటేశకు చెందిన పెయింట్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున నల్లటి పొగ అలుముకుంది. ఆ తర్వాత మంటల్లో దుకాణం మొత్తం దగ్ధమైంది. దుకాణంలో పెయింట్, మిక్సింగ్ రెసిన్లు నిల్వ ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కొన్ని వస్తువులు పేలిపోయాయి. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న శ్రీపెరంబుదూర్ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగింది. వారు అక్కడికి వెళ్లి గంటపాటు పోరాడి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో లక్షల విలువైన వస్తువులు కాలి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన మంటలను అదుపుచేయడంతో మంటలు పక్కనే ఉన్న దుకాణాలకు వ్యాపించకుండా పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న సుంగువారి చత్రం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న వ్యాన్

- ప్రైవేట్ హాస్పిటల్ గ్రూప్ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి కారు ప్రమాదం
- లోడ్ వ్యాన్ డ్రైవర్ కోసం గాలింపు

కొరుక్కుపేట: ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి నడుపుతున్న లగ్జరీ కారును అన్నా ఫ్లైఓవర్ సమీపంలో లోడ్ వ్యాన్ ఢీకొంది. సీసీటీవీ ఫుటేజీ ద్వారా డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నైలోని థౌజండ్ లైట్స్ ప్రాంతంలో ఓ ప్రయివేటు ఆస్పత్రి ఉంది. ఈ ఆస్పత్రికి ప్రతాప్ రెడ్డి గ్రూప్ చైర్మన్. అతను బుధవారం రాత్రి ఆస్పత్రి నుంచి కారులో పోర్టుక్లబ్ లోని తన ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అన్నా ఫ్లైఓవర్ సమీపంలో వెళుతుండగా వేగంగా వచ్చిన లోడ్ వ్యాన్ ప్రతాప్ రెడ్డి కారును ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ప్రతాప్‌రెడ్డికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. లగ్జరీ కారు దెబ్బతింది. ఈ విషయాన్ని ప్రతాప్‌రెడ్డి, సెక్యూరిటీ డివిజన్ మేనేజర్ సంతోష్‌కు తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ లభించడంతో పారిపోయిన ట్రక్కు డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

లోయలో కారు బోల్తా పడి ఇంజినీర్ మృతి

అన్నానగర్: తేని పర్వత రహదారిలో గురువారం 200 అడుగుల లోయలో కారు బోల్తా పడి ఓ ఇంజినీర్ మృతి చెందాడు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు జిల్లా గుల్బర్గాకు చెందిన సంజీవి రెడ్డి (50), కంప్యూటర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి కేరళలోని తేక్కడి, మున్నార్‌కు విహారయాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో సంజీవిరెడ్డి తన భార్య అంబిక (42), కుమార్తె కీర్తిక (18), కుమారుడు కరణ్ (11), కోడలు వైశాలి (18), విజయ్ (35), అతని భార్య హర్ష (24)తో కలిసి కారులో మున్నార్‌కు బయలుదేరారు. బుధవారం మున్నార్‌కు వెళ్లిన వీరు మరుగుజ్జు ప్రాంతాలను పరిశీలించి, స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. కారును సంజీవిరెడ్డి నడిపారు. గురువారం తెల్లవారుజామున తేని జిల్లాలోని పొడిమెట్టు పర్వత మార్గంలో కారు వెళుతుండగా సంజీవి రెడ్డి ఎదురుగా ఉన్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో కారు అదుపు తప్పి వేగంగా దూసుకెళ్లి ఒక్కసారిగా కారు 200 అడుగుల లోయలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడిపిన సంజీవిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే కారులో ప్రయాణిస్తున్న అంబిక సహా ఆరుగురు తీవ్రం గాయపడ్డారు. ఇరుగుపొరుగు వారు గాయపడిన వారిని తాడుతో రక్షించి చికిత్స నిమిత్తం తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఇంతలో ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం సంజీవిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నటనే నిజమైంది!

- కొడుకును బెదిరించడానికి తల్లి ఉరి నాటకం
- చీర గొంతుకు బిగుసుకుని మృతి

అన్నానగర్: సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదని వేధిస్తున్న కుమారుడిని బెదిరించడానికి ఉరి వేసుకుంటున్నానని ఆడిన నాటకంలో తల్లి తనువు చాలించింది. వివరాల్లోకి వెళితే.. తిరుచ్చిలోని మమల కల్కందర్ కోటకు చెందిన మురుగేషన్ (49). అతని భార్య పళనియమ్మాళ్ (39) పాల వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు లెనిన్ బీసీఏ చదువుతున్నాడు. లెనిన్ తన తల్లిని సెల్‌ఫోన్ కొని ఇవ్వమని వేధిస్తూ వచ్చాడు. సెల్‌ఫోన్ కొనకపోతే ఇంటి నుంచి వెళ్లిపోతానని బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో కొడుకును బెదిరించే క్రమంలో పళనియమ్మాళ్ బుధవారం సాయంత్రం చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నటించింది. అప్పుడు అనుకోకుండా చీర మెడకు బిగుసుకుంది. ఇందులో పళనియమ్మాళ్ మృతి చెందింది. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

17 నుంచి 21 దాకా తెప్పోత్సవాలు

– చివరి మూడు రోజులు తెప్పపై వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్న శ్రీవారి పట్టపురాణి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీఅలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు.

ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు బాధలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మం నుంచి ఆవిర్భవించిన అలమేలు మంగమ్మ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.

తెప్పోత్సవ కార్యక్రమాలు

జూన్ 17వ తేదీ మొదటి రోజు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీసుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరించనున్నారు. చివరి మూడు రోజులపాటు పద్మ సరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి జూన్ 20వ తేదీ రాత్రి 8.30 గంటలకు గజవాహనం, జూన్ 21వ తేదీ రాత్రి 8.30 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.

ఆర్జితసేవలు రద్దు

తెప్పోత్సవాల కారణంగా పద్మావతీ అమ్మవారి ఆలయంలో ఐదు రోజులపాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, జూన్ 21న లక్ష్మీపూజ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వ హించనున్నారు.

334 మంది డ్రైవర్లకు వైద్య పరీక్షలు

కొరుక్కుపేట: విధుల్లో ప్రమాదాలకు కారణమైన 334 మంది డ్రైవర్లకు ఫుల్ బాడీ చెకప్ నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ తెలియజేసింది. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్ని జోన్ మేనేజర్లకు ఓ సర్క్యులర్ పంపారు. అందులో నగర రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ 10 కంటే ఎక్కువ ప్రమాదాలకు కారణమైన 334 మంది డ్రైవర్లను పూర్తి శారీరక పరీక్షలు నిర్వహించాలని కోరినట్లు తెలిసింది. ఆ మేరకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అనుమతి ఇచ్చిందన్నారు. రోజుకు 33 మంది వంతున పది రోజులు మొత్తం 334 మంది డ్రైవర్లకు పూర్తి శారీరక వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.

లైంగిక దాడిలో కేసులో యువకుడి అరెస్ట్

తిరువొత్తియూరు: లైంగిక దాడి కేసులో ఓ యువకుడు అరెస్టయ్యాడు. చెన్నై వడపలనిలో 15 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడి గర్భిణిని చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వడపలనికి చెందిన బాలిక పదవ తరగతి చదివింది. బాలికకు పక్కింటిలో ఉంటున్న ఎలక్ట్రీషియన్ అశోక్‌కుమార్ (29)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అశోక్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,320 మంది స్వామివారిని దర్శించుకోగా, 28,495 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటిపల్లికి అత్యంత సమర్థవంతమైన నవరత్న పీఎస్‌యూ ఆఫ్ ది ఇయర్-2023 అవార్డు వరించింది. మాన్యుఫ్యాక్చరింగ్ విభాగంలో ప్రతిష్టాత్మక పెట్టుబడి మ్యాగ్‌జైన్‌లలో ఒకటైన దలాల్ స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్ జర్నల్ సంస్థ ఈ అవార్డును ప్రదానం చేసింది. అవార్డును ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ బృందానికి అంకితం చేస్తున్నట్లు ప్రసన్నకుమార్ మోటిపల్లి ప్రకటించారు. - కొరుక్కుపేట

రామేశ్వరం అగ్నితీర్థంలో పుణ్యస్నానాలు

తిరువొత్తియూరు: వైఖాసి అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రామేశ్వరం అగ్నితీర్థం సముద్రంలో భక్తులు పుణ్య స్నానాలు చేసి, పూర్వీకులకు తిలోదకాలు ఇచ్చారు. రామనాథపురం జిల్లా రామేశ్వరంలో ప్రసిద్ధ రామనాథస్వామి దేవాలయం ఉంది. తమిళనాడు మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తులు ముఖ్యంగా అమావాస్య రోజుల్లో అగ్నితీర్థంలో స్నానం చేసి పూర్వీకులకు తర్పణం వదులుతారు. ఈ క్రమంలో గురువారం వైకాసి అమావాస్యను పురస్కరించుకుని తమిళనాడులోని పలు జిల్లాల నుంచి వందల సంఖ్యలో భక్తులు అగ్నితీర్థం సముద్ర తీరం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూర్వీకులకు తర్పణాలు వదలారు. ఆ తర్వాత వారు సముద్రంలో పుణ్యస్నానం చేసి, రామనాథ స్వామి ఆలయంలోని మొత్తం 22 తీర్థాల దర్శనం చేసుకున్నారు. ముందుగా వైఖాసి అమావాస్యను పురస్కరించుకుని తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయాన్ని తెరిచి 5 గంటలకు స్ఫటికలింగ పూజ చేశారు. ఉదయం 6 గంటలకు మూల విరాట్ దర్శనం ప్రారంభమైంది. దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు.

చదురగిరిపై..

విరుదునగర్ జిల్లా పశ్చిమ కనుమలోని చదురగిరి కొండపై ఉన్న సుందర మహాలింగం ఆలయంలో పౌర్ణమి, అమావాస్యలకు 3 రోజులు, ప్రదోషానికి 2 రోజులు సహా 8 రోజులు దర్శనానికి అనుమతి ఉంది. ఈ క్రమంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకుని చెన్నై, తిరుచ్చి, మదురై, కోయంబత్తూరు సహా పలు జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే తానిపార ఫారెస్ట్ గేట్ వద్దకు తరలివచ్చారు. ఉదయం 6.15 గంటలకు అటవీ శాఖ గేటు తెరిచిన తరువాత, భక్తులకు సంబంధించిన వస్తువులను పరిశీలించిన అనంతరం అటవీశాఖ అధికారులు ఆలయానికి వెళ్లేందుకు అనుమతించారు. అమావాస్య సందర్భంగా సుందర మహాలింగం స్వామివారికి పాలు, చందనం, అభిషేకాలు నిర్వహించారు.

నగలు, నగదు మోసంపై ఫిర్యాదు

అన్నానగర్: రూ.7 లక్షల, 10 సవర్ల నగలు తీసుకుని, వాటిని తిరిగి ఇవ్వకుండా బెదిరించిన వివాహేతర సంబంధం నడిపిన వ్యక్తిపై ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. విరుదునగర్ జిల్లా అరుప్పుక్కోట్టై సమీపంలోని పాలయంపట్టి ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం కళ్లకురిచ్చికి చెందిన శబరినాథన్ అనే వ్యక్తి వీరి ఇంటి మిద్దెపై అద్దెకు ఉండేవాడు. ఈ క్రమంలో ఆ మహిళకు, శబరినాథన్‌కి ఏర్పడిన పరిచయం, వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో వారిద్దరూ తరచూ ఏకాంతంగా కలుసుకునేవారు. ఈ విషయం తెలుసుకున్న భర్త, భార్యను మందలించాడు. అయినా అలవాటు మానుకోలేని ఆ మహిళ ప్రియుడితో కలిసి జీవించడం కోసం తన భర్తకు విడాకులు ఇచ్చి, అతడితో వివాహేతర సంబంధం నడిపింది. ఈ క్రమంలో శబరినాథన్ ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.7 లక్షల నగదు, 10 సవర్ల నగలు తీసుకున్నాడు. ఆమెతో శృంగారం చేసే కార్యక్రమాన్ని వీడియో తీశాడు. అనంతరం ఆమెతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో ఆమె తన నగలు, నగదు తిరిగి ఇచ్చేయాలని అడిగింది. అందుకు శబరినాథన్ నిరాకరించడంతోపాటు ఆ అసభ్యకర వీడియోను ఇంటర్నెట్‌లో ప్రచురించబోతున్నానని చెప్పాడు. ఇంకా ఆ వీడియోను ఆమె కుటుంబ సభ్యులకు పంపారు. ఇదేమిటని ప్రశ్నించగా శబరినాథన్ ఆమెను చంపేస్తానని బెదిరించాడని ఆ మహిళ విరుదునగర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. అతడిపై చర్యలు తీసుకుని నగదు, నగలు రికవరీ చేసి, తనకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆదేశంతో అరుప్పుక్కోట్టై టౌన్ పోలీసులు విచారణ జరిపి, శబరినాథన్‌పై కేసు నమోదు చేశారు.

పెంపుడు కుక్కను అప్పగిస్తే రూ.20 వేల రివార్డు



అన్నానగర్: తంజావూరులో తప్పిపోయిన పెంపుడు కుక్కను కనిపెట్టి తిరిగి తమకు అప్పగిస్తే రూ.20 వేలు నగదు బహుమతిని అందజేయనున్నట్టు వేసిన పోస్టర్ కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. తంజావూరులోని అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి ఓ కుక్కను పెంచుకుంటోంది. ఆ కుక్కకు సింబా అని పేరు పెట్టి ఎంతో ఆప్యాయంగా పోషిస్తోంది. గత నెల 23న కుక్క ఆకస్మాత్తుగా ఇంటి నుంచి వెళ్లిపోయింది. చాలా చోట్ల వెతికినా కుక్క కనిపించలేదు. దీంతో విజయలక్ష్మి తన పెంపుడు కుక్క తప్పిపోయిందని తంజావూరు తమిళ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఇప్పటి వరకు కుక్కను పట్టుకోలేదు.

కాగా తంజావూరులోని పలు ప్రాంతాల్లో కుక్క ఫొటోతో కూడిన పోస్టర్‌ను వేశారు. అందులో గ్రామంలో పెంపుడు కుక్క గత నెల 23 నుంచి కనిపించకుండా పోయింది. ఈ కుక్కకు సింబా అనే గోల్డెన్ రిట్రీవర్ జాతి పేరు పెట్టారు. 2 సంవత్సరాల తెల్ల కుక్క. దీనిని కనిపెట్టిన వారికి రూ.20 వేలు బహుమతిగా ఇవ్వనున్నట్లు తమిళం, ఇంగ్లిష భాషల్లో ముద్రించారు. ఈ విషయమై కుక్క యజమాని విజయలక్ష్మి చెప్పగా.. కుక్క పిల్లగా ఉన్నప్పుడే కొన్నాం, గత రెండేళ్లుగా పెంచుతున్నాం. అది మా కుటుంబంలో ఒకటి. అదృశ్యమైనప్పటి నుంచి చాలా చోట్ల వెతుకుతున్నాం. కానీ నేటికీ దొరకలేదు. అందుకే మా సింబాను కనిపెట్టిన వారికి రూ.20 వేలు రివార్డు అందిస్తామని ప్రకటించామని ఆమె తెలిపారు.

మైలాపూర్ హిందూ సాస్వత్ ఫైనాన్స్ కంపెనీ సీజ్

కొరుక్కుపేట: పెట్టుబడి పెట్టిన సొమ్ముపై 10 నుంచి 11 శాతం వడ్డీ అదనంగా ఇస్తానని రూ.వందల కోట్ల మోసం చేసిన మైలాపూర్ హిందూ సాస్వత్ ఫైనాన్స్ కంపెనీని అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై మైలాపూర్ హిందూ సాస్వత్ లిమిటెడ్‌లో 1872 నుంచి ఆర్థిక సంస్థ పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ ఆర్థిక సంస్థలో 5 వేల మందికి పైగా రూ.లక్ష నుంచి రూ.5 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి ఉన్నారు. దేవనాథన్ యాదవ్ అనే వ్యక్తి మైలాపూర్ హిందూ సాస్వత్ లిమిటెడ్‌కి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో శివగంగ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసిన దేవనాథన్ యాదవ్ ఓడిపోయారు. ఈ ఆర్థిక సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారికి గత 6 నెలలుగా ఎలాంటి నిధులు ఇవ్వలేదని, డబ్బులు లేవని వాపోతున్నారు. తమ పెట్టుబడి సొమ్మును పూర్తిగా వెనక్కి తీసుకోవాలని కోరుతూ బాధిత పెట్టుబడిదారులు గురువారం ఉదయం మైలాపూర్‌లోని ప్రధాన కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తమ పెట్టుబడి డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆర్థిక సంస్థ ఎదుట రోడ్డుపై బైఠాయించిఈ సందర్భంగా నిరసన తెలిపారు. దీంతో ఆ ఆర్థిక సంస్థకు అధికారులు సీల్ వేశారు.

గోడ కూలి విద్యార్థిని మృతి

అన్నానగర్: వర్షానికి నానిన ఇంటి గోడ కూలి పదో తరగతి విద్యార్థిని మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. తిరువణ్ణామలై జిల్లాలోని మేల్‌చోళంగుప్పం మధుర వడకరై నమ్మియాందల్ ప్రాంతానికి చెందిన మునుసామి రైతు. ఈయన తన కుటుంబంతో పాత ఇంట్లో నివసిస్తున్నాడు. పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆయన ఇంట్లో పగుళ్లు ఏర్పడి వర్షపు నీరు కారుతోంది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఇంటి గోడ ఓ పక్క కూలిపోయింది. మునుసామి కుమార్తె సుచిత (16) అందులో చిక్కుకుని మృతి చెందింది. సుచిత పదో తరగతి పూర్తి చేసి 11వ తరగతిలో అడుగుపెట్టబోతుండటం గమనార్హం.

అధిక ఫీజు వసూలుపై ఖండన

కొరుక్కుపేట: పల్లవరం కంటోన్మెంట్ బోర్డు ఆధీనంలో నడుస్తున్న మూడు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ట్యూషన్ ఫీజు వసూలు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ ఖండించింది. గాంధీ కంటోన్మెంట్ మాంటిస్సోరి స్కూల్, డాక్టర్ ఎంజీఆర్ కంటోన్మెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్, మానసిక వికలాంగ పిల్లలు పాఠశాలలు, పల్లవరంలో అబ్దుల్ కలాం కంటోన్మెంట్ ప్రైమరీ స్కూల్, డాక్టర్ అంబేడ్కర్ కంటోన్మెంట్ మాంటిస్సోరి స్కూల్, అరినార్ అన్నా కంటోన్మెంట్ హైలెవెల్ స్కూల్- సెయింట్ థామస్ మౌంట్ సహా మొత్తం కంటోన్మెంట్ బోర్డు నిర్వహణలో 7 పాఠశాలలు నడుస్తున్నాయి .ఈ పాఠశాలల్లో సెయింట్ థామస్ మౌంట్, పల్లావరం పరిసర ప్రాంతాలకు చెందిన 3 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు, బ్యాగులు, షూల ఖర్చులకు అధిక డబ్బులు వసూలు చేయాలని బోర్డు పాలకవర్గం సూచించింది. దీన్ని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది.

బస్సులో వృద్ధుడి మృతి

అన్నానగర్: బస్సులో వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నై పక్కనే ఉన్న రెడ్‌హిల్స్‌కి చెందిన గజపతి (72) బుధవారం రాత్రి రెడ్‌హిల్స్ నుంచి తాంబరం వరకు సిటీ బస్సులో ప్రయాణించాడు. హఠాత్తుగా బస్సులో గుండెపోటు రావడంతో వృద్ధుడు స్పృహ తప్పి పడిపోయాడు. బస్సు డ్రైవర్ మనోహరన్ వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. అక్కడికి వచ్చిన మెడికల్ అసిస్టెంట్ పరీక్ష చేయగా అప్పటికే గజపతి మృతి చెందినట్లు గుర్తించారు. అంబత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై రాళ్ల దాడి



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ (తిరుపతి జిల్లా) : తిరుపతి నగరంలోని 26వ డివిజన్‌లో ఉన్న వైఎస్సార్సీపీ కార్యాలయంపై కూటమి కార్యకర్తలు విధ్వంసానికి దిగారు. 26వ డివిజన్ పరిధిలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని ఉదయ వంశీ నిర్వహిస్తున్నారు. గురువారం షట్టర్ ఓపెన్ చేసి, గ్లాస్ డోర్‌కు తాళం వేసుకుని వెళ్లిన సమయంలో కూటమికి చెందిన వ్యక్తులు రాళ్లు, సోడా బాటిళ్లతో దాడి చేశారు. అయితే ఆ సమయంలో కార్యకర్తలు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, రెండు రోజులుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని కూటమి నేతలు దాడులకు తెగబడుతున్నారు.

వంశీ అనుచరుడి ఇంటిపై దాడికి తెగబడిన టీడీపీ


బాలాజీ ఇంటిపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు

గన్నవరం: వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా గ్రామాల్లో టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం మర్లపాలెంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అనుచరుడు అడుసుమిల్లి బాలాజీ ఇంటిపై టీడీపీ నేతలు దాడి చేశారు. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కంభంపాటి సాయి, మరో ముగ్గురు యువకులు ఈ దాడికి పాల్పడ్డారు. బాలాజీ ఇంటి గేట్లను ధ్వంసం చేయడంతో పాటు ఇంటిపై కర్రలు, రాళ్లు విసురుతూ వీరంగం సృష్టించారు. సుమారు ఐదు నిమిషాల పాటు విధ్వంసం సృష్టించిన టీడీపీ నేతలు.. బ్లాక్ కలర్ సఫారి కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. టీడీపీ నేతల దాడులతో బాలాజీ కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

వైఎస్సార్‌సీపీ నేత 'కొల్లి' ఇంటిపై రాళ్లు, సీసాలు..

గుర్తుతెలియని వ్యక్తుల బీభత్సం


ధ్వంసమైన బ్రహ్మారావు కారు

హనుమాన్ జంక్షన్ రూరల్: కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కొయ్యూరులో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లి బ్రహ్మారావు (చిట్టిబాబు) నివాసంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఇంటిపైకి రాళ్లు, మద్యం బాటిళ్లు విసరటంతో పాటు కారు అద్దాలు ధ్వంసం చేశారు. తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ భయాందోళనలు రేకెత్తించారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో పూటుగా మద్యం తాగి కారులో వచ్చిన కొందరు వ్యక్తులు గ్రామంలో కొల్లి చిట్టిబాబు చిరునామా గురించి ఆరా తీశారు. ఆయన ఇంటి దగ్గరకు వచ్చి పెద్ద ఎత్తున కేకలు వేశారు. దీంతో బయటకు వచ్చిన కొల్లి చిట్టిబాబు తనయుడిని మరో మారు ప్రశ్నించి అడ్రసు ఖరారు చేసుకున్నారు. ఆ తర్వాత విచక్షణారహితంగా ఇంటిపై రాళ్లు, మద్యం సీసాలు రువ్వుతూ విధ్వంసం సృష్టించారు. దీంతో ఇరుగు పొరుగు వారు నిద్ర మేల్కొని బయటకు రావటంతో ఆగంతకులు పలాయనం చిత్తగించారు. ఈ ఘటనపై హనుమాన్ జంక్షన్ పోలీసులకు గురువారం కొల్లి చిట్టిబాబు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చిత్తూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను చావబాదారు


తీవ్రంగా గాయపడిన ఖాదర్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కూటమి నేతలు దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బోడిగుట్టకు చెందిన ఖాదర్ (24) అనే వ్యక్తి ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశాడు. దీన్ని మనసులో పెట్టుకున్న కూటమి నేతలు గురువారం ఖాదర్ ఇంట్లోకి చొరబడ్డారు. అతను లేకపోవడంతో ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. ముత్యాలమ్మ గుడి వైపు ఖాదర్ వస్తుండగా అతడిని కిడ్నాప్ చేసి, గంగనపల్లెలోని ఓ కోళ్ల ఫారం షెడ్డులోకి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి బయట పడేశారు. బాధితుడిని బంధువులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.


తెనాలిలోని కేఎస్ఎం స్కూల్‌లో ధ్వంసమైన శిలాఫలకం


తుళ్లూరులోని తులసీ థియేటర్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం తల పగలగొట్టి కాలువలో పడేసిన దుండగులు


సంకురాత్రిపాడులో సచివాలయంపై బోర్డులు ధ్వంసం చేసి జెండాలు కట్టిన టీడీపీ శ్రేణులు


కంభంపల్లెలో వెల్‌నెస్ సెంటర్‌కు ఏర్పాటు చేసిన బోర్డును ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు

ఊరూరా విధ్వంసం.. అదే టీడీపీ లక్ష్యం

- పలుచోట్ల శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలపై దాడి
- ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు కూల్చివేత
- సచివాలయాలపై అక్కసుతో పేట్రేగిన వైనం
- తెనాలిలో అభివృద్ధి పనులకు మోకాలడ్డు
- విజయనగరంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రచ్చ
- సంకురాత్రిపాడులో బోర్డులు, శిలాఫలకాలు, దిమ్మెలు ధ్వంసం
- సచివాలయంపై టీడీపీ, జనసేన, బీజేపీ జెండాల ఏర్పాటు

ఆస్పత్రి బోర్డు తొలగింపు

విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేమ్ బోర్డును గురువారం సాయంత్రం టీడీపీ కార్యకర్తలు తొలగించారు. ఈ ఘటనను చూసిన ఆస్పత్రికి వచ్చిన రోగులు, వైద్య సిబ్బంది అవాక్కయ్యారు. అధికారం వచ్చి రెండు రోజులు కాకముందే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంతలా దౌర్జన్యానికి దిగడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బోర్డును తొలగిస్తున్న టీడీపీ కార్యకర్తలు

తెనాలి అర్బన్/బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)/ మదనపల్లె /విజయనగరం ఫోర్ట్/నాదెండ్ల/ తాడికొండ: అధికారం వచ్చిందన్న సంతోషం ముసుగులో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై ఓ వైపు దాడులు కొనసాగిస్తూ ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేస్తున్నారు. శిలాఫలకాలు, సచివాలయాల బోర్డులను పగులగొడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఈ దాడులను ఆపాల్సిన ఆ పార్టీ పెద్దలు చోద్యం చూస్తుండటం పట్ల ప్రజలు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకేనా అధికారం కట్టబెట్టిందంటూ మండిపడుతున్నారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో కొందరు అధికార పార్టీ నాయకులు విధ్వంసానికి దిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడమే కాకుండా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై బుధవారం రాళ్లతో దాడి చేశారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నాడు–నేడు పథకం కింద అదనపు తరగతి గదులు నిర్మించారు. దానిని అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కూటమి గెలుపొందడంతో కొందరు అధికార పార్టీ నాయకులు బుధవారం రాత్రి పాఠశాలలోనికి వెళ్లి శిలాఫలకాన్ని పగలకొట్టారు. రణరంగచౌక్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహంపై రాళ్లతో దాడి చేశారు. కొద్ది రోజుల క్రితం విగ్రహం సమీపంలో టైల్స్, రిటైనింగ్ వాల్స్ నిర్మించారు. దాదాపు 80 శాతం పని పూర్తయింది. మిగిలిన పని పూర్తి చేసేందుకు సదరు కాంట్రాక్టర్ సిద్ధమయ్యారు. ఇంతలో ఎన్నికల ఫలితాలు రావడం.. తెనాలి ఎమ్మెల్యేగా నాదెండ్ల మనోహర్ గెలవడం జరిగింది. దీంతో కొందరు టీడీపీ నాయకులు నిర్మాణ పనులు జరపడానికి వీలులేదని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై హుకుం జారీ చేశారు. దీంతో అధికారులు సదరు కాంట్రాక్టర్‌ను ఆ పనులు పూర్తి చేయొద్దని అడ్డుకుంటున్నారు.


తుళ్లూరులో వైఎస్ విగ్రహానికి టీడీపీ కండువా కప్పి చేతిలో జనసేన జెండా పెడుతున్న టీడీపీ నేత

వెల్‌నెస్ సెంటర్ బోర్డు ధ్వంసం

పలమనేరు నియోజకవర్గం బైరెడ్డి మండలంలోని కంభంపల్లె సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాల శిలాఫలకాలను, వెల్‌నెస్ సెంటర్ బోర్డును టీడీపీ కార్యకర్తలు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలపై జగన్ బొమ్మ కనిపిస్తే ధ్వంసం చేస్తాం అంటూ దుర్భాషలాడుతూ హంగామా సృష్టించారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించామనే గర్వంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. దాడులు ఆపకపోతే మొదట్లోనే చెడ్డపేరు రావడం ఖాయం అని హెచ్చరిస్తున్నారు.


సంకురాత్రిపాడులో ట్రాక్టర్‌తో సచివాలయం వద్ద దిమ్మె ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు

సిమెంట్ బల్లలు ధ్వంసం

పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం సంకురాత్రిపాడు గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీ వర్గీయులు గ్రామ సచివాలయం వద్ద బీభత్సం సృష్టించారు. సచివాలయం భవనంపైకి ఎక్కి.. బోర్డులు, శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ట్రాక్టర్‌తో దిమ్మెలు కూలగొట్టారు. బొడ్డురాయి సెంటర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జెండాను చింపేశారు. సచివాలయం సమీపంలో దాతలు ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను ధ్వంసం చేశారు. సచివాలయంపై టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు కట్టారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం దిమ్మెను సైతం ధ్వంసం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరుపై పేడ అలికారు. నాదెండ్ల మండలంలోని ఇర్లపాడు గ్రామం ఎస్సీ కాలనీలో టీడీపీ వర్గీయులు గొడ్డళ్లు, కర్రలతో వైఎస్సార్ విగ్రహం తల, చేతులను విరగ్గొట్టారు. బైక్‌లకు టీడీపీ జెండాలు కట్టుకుని బాణసంచా కాలుస్తూ కాలనీలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

పోలీసుల సాక్షిగా విగ్రహాల ధ్వంసం

గుంటూరు జిల్లా తుళ్లూరులో తెలుగుదేశం పార్టీ నాయకుల వికృత చేష్టలు, విగ్రహాల విధ్వంసాల పరంపర కొనసాగుతూనే ఉంది. పోలీసు కాపలా ఉన్నప్పటికీ వారి ఎదుటే తుళ్లూరులో రెండు విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. తుళ్లూరు గ్రామానికి చెందిన ఆలూరి శివ, మూల్పూరి నరేష్ అనే టీడీపీ నాయకులు అర్ధరాత్రి తుళ్లూరు తులసీ థియేటర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం తల పగలగొట్టి కాలువలో పడవేశారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు వచ్చి సుత్తితో ధ్వంసం చేస్తుండగా ఎస్సీ కాలనీకి చెందిన వారు అడ్డుకొనేందుకు యత్నించగా వారిపై దాడి చేశారు. ఈ తంతు అంతా పోలీసులు కాపలాగా ఉన్నప్పుడే జరగడం గమనార్హం. ప్రశ్నించిన వారిపై విచక్షణా రహితంగా దాడులకు దిగడంతో ఇరు వర్గాల మధ్య వివాదం ముదిరి తోపులాట జరిగింది. అప్పుడు తీరిగ్గా పోలీసులు ఇరు వర్గాలను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు.

పార్కు బోర్డ్ పగులగొట్టిన దుండగులు

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని వైఎస్సార్ సొసైటీ కాలనీలోని మున్సిపల్ పార్క్ నేమ్ బోర్డ్‌ను గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం నేమ్ బోర్డ్ ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు, మీడియాకు సమాచారం అందించారు. నేమ్‌బోర్డ్‌లో వైఎస్సార్ పేరును మాత్రమే చెరిపివేసి, మిగిలిన అక్షరాలను అలాగే ఉంచడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.



మదనపల్లెలో ధ్వంసం చేసిన సొసైటీ కాలనీ మున్సిపల్ పార్క్ నేమ్ బోర్డ్

వైఎస్సార్‌సీపీ నేత కారు ధ్వంసం

- అర్ధరాత్రి కారు అద్దాలు పగులగొట్టిన టీడీపీ కార్యకర్తలు
- బేస్‌బాల్ బ్యాట్‌లు, మద్యం సీసాలు, రాళ్లతో హల్‌చల్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు కొమ్మా కోటేశ్వరరావు
- ఎంపీ విజయసాయి రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పరామర్శ


ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, తలశిల రఘురామ్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడుకు చెందిన గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు కొమ్మా కోటేశ్వరరావుకు చెందిన కారును బుధవారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. బేస్‌బాల్ బ్యాట్‌లు, ఖాళీ మద్యం సీసాలు, రాళ్లు విసిరేస్తూ వీరంగం సృష్టించారు. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత నెంబరు లేని కార్లలో వచ్చి ఈ దాడికి పాల్పడ్డారు. ముందుగా కొమ్మా కోట్లు ఉంటున్న అపార్టుమెంట్‌లో ఏ ఫ్లాటులో నివాసం ఉంటున్నాడో తెలియక ఆయన ఎదురు ఫ్లాటుపై రాళ్లు, మద్యం సీసాలు విసిరేశారు. అనంతరం సెల్లార్‌లో పార్కింగ్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. వీరి అరుపులు, కేకలు విన్న పక్క ఫ్లాటు నివాసితులు మేల్కొని బయటకు వచ్చేసరికి పరారయ్యారు. దాడి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రసాదంపాడుకు చేరుకున్నారు. గన్నవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన యార్లగడ్డ వెంకట్రావు ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. పటమట పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దాడికి ఉపయోగించిన బేస్‌బాల్ బ్యాట్, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌లు బాధితుడి ఇంటికి వచ్చి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

శ్రీకాళహస్తిలో వలంటీర్ల ఇళ్లపై దాడులు


వాగివేడులో గ్రామ వలంటీర్ మహేశ్వరి ఇంటి తలుపులను ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు


వాగివేడులో వలంటీర్ పృథ్వి ఇంటి చుట్టూ వేసిన ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు

- ఊరొదిలి వెళ్లాలని బెదిరింపులు
- లేదంటే బతకనివ్వమని హెచ్చరించిన టీడీపీ కార్యకర్తలు

శ్రీకాళహస్తి రూరల్ (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి మండలం వాగివేడులో టీడీపీ నాయకులు బుధవారం అర్ధరాత్రి ఇద్దరు వలంటీర్ల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్ర, మరికొందరు మద్యం తాగి కత్తులు చేతబట్టి మూకుమ్మడిగా బుధవారం అర్ధరాత్రి గ్రామ వలంటీరు మహేశ్వరి ఇంటిపై దాడికి తెగబడ్డారు. ఆ సమయంలో బాధితురాలు ప్రాణభయంతో పక్కింటికి వెళ్లి తల దాచుకుంది. ఇంటిలోని వస్తు సామగ్రి, తలుపులను ధ్వంసం చేశారు. అదే గ్రామంలో ఉన్న మరో వలంటీర్ పృథ్వీ ఇంటికి వెళ్లి అతనిపై, వారి తల్లిదండ్రులపై దాడి చేశారు. వారు ఇంటి నుంచి బయటకు రాకుండా ఇంటి చుట్టూ ట్రాక్టర్, టైర్లు, వ్యవసాయ పనిముట్లు, ముళ్ల కంచె వేసి భయభ్రాంతులకు గురిచేశారు. తమ ప్రభుత్వం వచ్చిందని, మీరంతా ఊరొదిలి వెళ్లిపోవాలని, లేకుంటే గ్రామంలో బతకనివ్వమని తీవ్రంగా బెదిరించారు. బాధితులు 100కు ఫోన్ చేయడంతో పోలీసు సిబ్బంది వచ్చి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై హత్యాయత్నం


ఆస్పత్రిలో ఉమ్మడి అప్పారావు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆరిలోవ (విశాఖ తూర్పు): జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మడి అప్పారావుపై టీడీపీ కార్యకర్త హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం మధ్యాహ్నం అప్పారావు ఇంట్లో భోజనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వాసుపల్లి నర్సింగ్ వచ్చాడు. తాను వెలగపూడి మనిషినని, వైఎస్సార్‌సీపీ పని అయిపోయిందంటూ కేకలు వేశాడు. అప్పారావుపై రాడ్డుతో ఎడమ చేతిపై కొట్టాడు. ఆపై పుట్టి పెట్టే పరికరంతో కుడి చేతి భుజంపై పొడవడంతో గాయమైంది. ఇదిలా ఉండగా, జోడుగుళ్లపాలెంలో తన ఇంటిపై బుధవారం రాత్రి టీడీపీ నాయకులు రాళ్లు విసిరి భయపెట్టారని వార్డు కార్పొరేటర్ ఉమ్మడి స్వాతి తెలిపారు. రెండు రోజుల క్రితం వైఎస్సార్ వ్యూ పాయింట్ వద్ద బోర్డు ధ్వంసం చేశారని చెప్పారు.

టీడీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

నూజివీడులో ఘటన..
వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గిరీష్‌కు తీవ్ర గాయాలు


గిరీష్‌పై దాడి చేస్తున్న టీడీపీ శ్రేణులు


గాయపడిన గిరీష్‌కు కుట్లు వేస్తున్న వైద్యులు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని పెద్ద గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన 30వ వార్డు కౌన్సిలర్ నడకుదురు గిరీష్‌పై టీడీపీ కార్యకర్త నూకల సాయి అరుణ్ కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. దీంతో గిరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నూకల సాయికిరణ్ (చింటూ), నూకల సాయి అరుణ్‌లకు.. కౌన్సిలర్ గిరీష్‌కు మధ్య గతం నుంచి గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ విజయం సాధించినప్పటి నుంచి చింటూ, అరుణ్‌లు గిరీష్‌ను కవ్విస్తూ వస్తున్నారు. పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న గిరీష్ చికెన్ సెంటర్ వద్దకు సైతం వచ్చి కవ్వింపు చర్యలకు దిగారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు మిత్రుడు మూడు సుధీర్‌కుమార్ బండిపై చింటూ వెళ్తుండగా.. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో గిరీష్ వారిని ఆపాడు. ఎందుకు కవ్విస్తున్నారంటూ చింటూను నిలదీశాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట వరకు వెళ్లింది. ఈ క్రమంలో గిరీష్ చింటూపై కత్తితో దాడి చేశాడు. దీంతో అదే సెంటర్‌లో ట్రాఫిక్ డ్యూటీ నిర్వహిస్తున్న హోంగార్డు చంద్రశేఖర్, సుధీర్, మరికొందరు నిలువరించి గిరీష్ వద్ద ఉన్న కత్తిని లాక్కున్నారు. తన అన్న చింటూపై దాడి చేస్తున్నారన్న విషయం తెలుసుకొని అక్కడకు చేరుకున్న చింటూ తమ్ముడు నూకల సాయి అరుణ్ కత్తి తీసుకుని గిరీష్‌పై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో గిరీష్ చావుబతుకుల మధ్య అక్కడి నుంచి పారిపోతున్నా వెంబడించారు. అక్కడి నుంచి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తికి తెలుపగా వెంటనే చికిత్స నిమిత్తం అతన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చింటూను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో నిందితులు నూకల సాయి అరుణ్, మూడు సుధీర్‌కుమార్‌లను అరెస్టు చేశామని, వారిపై 307 కేసు నమోదు చేశామని ఏలూరు జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి తెలిపారు. ఘటన ప్రాంతాన్ని గురువారం సాయంత్రం ఆమె పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. తమ హోంగార్డు చంద్రశేఖర్ ఎంతో ధైర్యంగా గిరీష్ చేతిలోని కత్తిని లాక్కొన్నాడని, దీంతో మరిన్ని గాయాలు కాకుండా ఆపగలిగామన్నారు. ఈ సందర్భంగా హోంగార్డుకు ఎస్పీ రివార్డు అందజేశారు. ఎవరైనా సరే చట్టాన్ని చేతిలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. వారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు నూజివీడు డీఎస్పీ జీ లక్ష్మయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

విజయోత్సాహం ముసుగులో విధ్వంసం

- ఎస్సీ కాలనీలపై టీడీపీ కార్యకర్తల దాడులు
- హుస్సేన్ నగరం సచివాలయంలో ఫర్నీచర్, వన్నాయపాలెం సచివాలయంలో కంప్యూటర్లు ధ్వంసం
- అమరావతి, ధరణికోట, ఎండ్రాయిలో కుర్చీలు, టేబుళ్లు విరగ్గొట్టిన వైనం
- అచ్చంపేట మండలం కొండూరు, కోనూరులో 12 మందికి గాయాలు


వన్నాయపాలెం సచివాలయంలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన కంప్యూటర్లు

పెదకూరపాడు : సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత గత రెండు రోజులుగా పెదకూరపాడు నియోజకవర్గంలో కూటమి కార్యకర్తలు విధ్వంసానికి దిగారు. విజయోత్సాహంతో పెదకూరపాడు మండలంలో గారపాడు, కంభంపాడు గ్రామాల్లోని ఎస్సీ కాలనీలలో ఇళ్లపై దాడులు చేశారు. ఈ ఘటనలలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. హుస్సేన్ నగరం సచివాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అమరావతి మండలం మల్లాది, ఎనికెపాడు గ్రామాలల్లోని ఎస్సీ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. అమరావతి, ధరణికోట, ఎండ్రాయి సచివాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై దాడులు చేసి శిలాఫలకాలు పగులగొట్టారు. కుర్చీలు, టేబుళ్లు విరగ్గొట్టి బోర్డులను తగులబెట్టారు. గురువారం బెల్లంకొండ మండలం వన్నాయపాలెంలో సచివాలయంపై దాడి చేసి కంప్యూటర్లు పగలకొట్టారు. ఇదే మండలంలోని మన్నెసుల్తాన్ పాలెంలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిందనే కారణంతో ఎస్సీ కాలనీలో ఎస్టీ మహిళ పరుచూరి దుర్గపై దాడి చేశారు. ఆమె ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అచ్చంపేట మండలం కొండూరు, కోనూరు గ్రామాల్లోని ఎస్సీ కాలనీలపై దాడి చేసి 12 మందిని గాయపరిచారు. బాధితులు సత్తెనపల్లి ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఫ్యాషన్

అడవిని డిజైన్ చేసింది





చీరకట్టును అందమైన పదాలతో
కవితలను అల్లుతుంటారు కవులు.
కానీ, సయంతీ ఘోష్ చీరల డిజైన్స్ చూస్తే మాత్రం
పచ్చని అడవి తల్లి చెప్పే
జ్ఞాపకాల కథల గొలుసును అల్లుకోవచ్చు.
రంగు రంగుల పక్షులు, జంతువులు,
పెద్ద పెద్ద వృక్షాలు, దట్టమైన పొదలు, అందమైన లతలు...
ఇవన్నీ డిజైన్లుగా చేరి సయంతీ కలెక్షన్‌ను ఆకర్షణీయంగా మార్చేశాయి.
ఆ కథల డిజైన్ల సృజన వెనకాల కృషి మనమూ తెలుసుకుందాం.



సయంతీ ఘోష్

ఫ్యాషన్ డిజైనర్ సయంతీ ఘోష్ కలకత్తావాసి. తనపేరు మీదుగానే డిజైనర్ స్టూడియోను నడుపుతున్నారు ఆమె. అడవి, అందులోని జంతుజాలం నుంచి స్ఫూర్తి పొంది వైల్డ్ లైఫ్‌ను చీరలు, బ్లౌజుల మీదకు తీసుకువస్తున్నారు. ప్రకృతి అందాన్ని ఎంబ్రాయిడరీ ద్వారా చూపుతూ ఫారెస్ట్ డిజైన్స్‌ని ఆకట్టుకునేలా చూపుతోంది.

"సంప్రదాయ చేనేతలు, భారతీయ వస్త్రాలపైన థ్రెడ్‌వర్క్‌తో కూడిన హ్యాండ్ క్రాఫ్ట్ డిజైన్స్ రూపొందించడమే మా ప్రత్యేకత. డిజైన్ల ద్వారా కథలు చెప్పడం మా బ్రాండ్ గొప్పతనం. చిన్నతనంలో అందరం జంతువుల బొమ్మల పట్ల ఆకర్షితులం అయ్యేవాళ్లం. ఆ చిన్ని మనసు ఎప్పుడూ నాటి ఆనందాల చుట్టూ తానే ఆలోచిస్తూ ఉంటుంది. ఆ చిన్ననాటి జ్ఞాపకాలను సజీవంగా తీసుకు రావాలని చేసిన ప్రయత్నమే ఈ డిజైనర్ చీరలు, బ్లౌజులు.





సృజనకు మొదటి కిటికీ

ముడి సిల్క్, మస్లిన్, ఆర్గన్జా, టస్సర్, ముగా సిల్క్.. వంటి ఫ్యాబ్రిక్స్ వాడుతున్నాం. అడవిని భూమికి ఊపిరితిత్తులుగా పిలుస్తారు. చిన్నప్పుడు మోగ్లీ (ది జంగిల్ బుక్) జీవితం, ప్రయాణాన్ని గురించి తెలుసుకోవడానికి చాలా ఆసక్తి చూపేదానిని. ఆ యానిమేషన్ అందమైన, సృజనాత్మక ప్రపంచం నా ముందు తెరుచుకున్న మొదటి కిటికీ. జంగిల్ బుక్ మా ఇంటికి చాలా దగ్గరే అనిపించేది. అడవి, అందులోని జంతువులపై నా అభిమానాన్ని పెంచుకున్నాను. ఆ అడవి అందాన్ని చెక్కు చెదరకుండా ఉంచుతూ, చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రకృతి పట్ల ప్రేమతో ప్రతిధ్వనించేలా నా కొత్త సేకరణ ఉండేలా చూసుకున్నాను. అంతేకాదు, చిన్నతనంలో మన హృదయాలలో గూడుకట్టుకున్న అడవిలోని స్నేహితులను ఇప్పటికీ ప్రేమించడం చాలా ముఖ్యం. ఆ అడవిలోని స్నేహితులు అంతరించి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన అడవులు ఇంకా పచ్చదనంతో నిండాలి. ఈ ఆలోచనే నా డిజైన్స్ సృష్టికి మూలం.



తొమ్మిదేళ్ల క్రితం ..

మొదట్లో మా హోమ్ గ్యారేజ్ స్పేస్‌లోనే బ్లౌజుల రూపకల్పనతో ఈ బ్రాండ్‌ను మొదలుపెట్టాను. అక్కణ్ణుంచి ఈ రోజు వరకు భారతదేశం అంతా ప్రత్యేక యూనిట్లను నడుపుతున్నాను. మెషిన్ ఎంబ్రాయిడరీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జమ్దానీ, కలంకారీ, ఎకో–ప్రింటింగ్, మధుబని, హ్యాండ్ పెయింటింగ్, బాతిక్, పిచ్వాయి.. వంటి పన్నెండు టెక్నిక్‌లతో డిజైన్ చేస్తాను. నా రోజువారి జీవితమంతా ప్రకృతి, వాస్తు శిల్పం నుంచి స్ఫూర్తి పొందుతూ ఈ డిజైన్స్ సృష్టిస్తుంటాను" అని వివరిస్తుంది సయంతీ.







కాలేజీ సమయం

మార్కులు రాలేదని తల్లి
పెద్ద ర్యాంకు రాలేదని తండ్రి
ఫలానా కోర్సు చదవాలని తల్లి
ఆ కాలేజీలోనే చేర్పిస్తానని తండ్రి
టీనేజ్ పిల్లలకు ఇది కీలక సమయం.
వారు ఇంటర్‌లో, డిగ్రీలో చేరాలి.
కాని పిల్లల మాట వింటున్నారా?
మీరే గెలవాలని పట్టుబడుతున్నారా?
అప్పుడు పిల్లలు లోలోపల
నలిగి పోవడం కన్నా ఏం చేయలేరు.
పత్రికల్లో వస్తున్న ఘటనలు హెచ్చరిస్తున్నాయి.
ఆచితూచి అడుగు వేయండి.

చదువు ఎంపికలో పిల్లల మాట కూడా వినండి

'నువ్వు ఆ కోర్సు చేయాలనేది మా కల' అనే మాట తల్లిదండ్రుల నుంచి వెలువడితే అది పిల్లల నెత్తిమీద ఎంత బరువుగా మారుతుందో పిల్లలకే తెలుసు. టీనేజ్ మొదలయ్యి టెన్త్ క్లాస్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి ఈ 'కలలు వ్యక్తపరచడం' తల్లిదండ్రులు మొదలెడతారు. టెన్త్‌లో ఎన్ని మార్కులు తెచ్చుకోవాలో, ఇంటర్‌లో ఏ స్ట్రీమ్‌లోకి వెళ్లాలో, అందుకు ఏ కాలేజీలో చేరాలో, ఆ కాలేజీ ఏ ఊళ్లో ఉంటే బాగుంటుందో ఇన్ని డిసైడ్ చేసి పిల్లలకు చెబుతుంటారు. పిల్లలు వినాలి. వారికి ఏ అభిప్రాయం లేకుండా ఆ కోర్సు పట్ల ఆసక్తి ఉంటే మంచిదే. వారికి మరేదో ఇంటరెస్ట్ ఉండి, ఇంకేదో చదవాలని ఉంటే... ఆ సంగతి చెప్పలేకపోతే ఇబ్బంది. అది భవిష్యత్తును కూడా దెబ్బ కొట్టగలదు.

ఏంటి... ఆ కోర్సా?

ఆ ఇంట్లో తండ్రి అడ్వకేట్, తల్లి గవర్నమెంట్ ఉద్యోగి. కుమార్తెకు మేథ్స్‌గాని, బయాలజీగాని చదవాలని లేదు. హాయిగా టీచర్‌గా సెటిల్ అవ్వాలని ఉంది. తన స్కూల్‌లో చక్కగా తయారై వచ్చే టీచర్ పిల్లల పేపర్లు దిద్దే సన్నివేశం ఆ అమ్మాయికి ఇష్టం. తాను కూడా టీచరయ్యి పేపర్లు దిద్దాలని అనుకుంటుంది. టెన్త్ అవుతున్న సమయంలో 'టీచర్ అవుతాను' అని కూతురు అంటే తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. 'మన హోదాకు టీచర్ కావడం ఏం బాగుంటుంది... మన ఇళ్లల్లో టీచర్లు ఎవరూ లేరే' లాంటి మాటలు చెప్పి ఎంపీసీలో చేర్పించారు. ఆ అమ్మాయి ఆ లెక్కలు చేయలేక తల్లిదండ్రులకు చెప్పలేక కుమిలిపోయింది. డిప్రెషన్ తెచ్చుకుంది. అదే 'టీచర్ కావాలనుకుంటున్నావా? వెరీగుడ్. అక్కడితో ఆగకు. నువ్వు హార్వర్డ్‌లో ప్రొఫెసర్ అవ్వాలి. అంత ఎదగాలి' అని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే హార్వర్డ్‌కు వెళ్లకపోయినా ఒక మంచి యూనివర్సిటీలో లెక్చరర్ అయినా అయ్యేది కదా.

అన్నీ మాకు తెలుసు

తల్లిదండ్రులకు అన్నీ మాకు తెలుసు అనే ధోరణి ఉంటుంది. నిజమే. కాని వాళ్ల ఇప్పుడున్న స్థితి రకరకాల ప్రయోగాలు చేసి రకరకాల దారుల్లో ప్రయత్నించి ఒక మార్గంలో సెటిల్ అయి ఉంటారు. తమ లాగే తమ పిల్లలు కూడా కొన్ని దారుల్లో నడవాలని అనుకోవచ్చు అని భావించరు. అన్నీ తమ ఇష్టప్రకారం జరగాలనుకుంటారు, ఓవర్ కన్సర్న్ చూపించి ఉక్కిరిబిక్కిరి చేస్తారు. ఉదాహరణకు ఒకబ్బాయికి 'నీట్'లో మెడిసిన్ సీటు వచ్చే ర్యాంకు రాలేదు. కాని డెంటిస్ట్రీ సీటు వచ్చే ర్యాంకైతే వచ్చింది. అబ్బాయికి ఆ కోర్సు ఇష్టమే. కాని తల్లిదండ్రులకు తమ కొడుకు ఎలాగైనా ఎంబిబిఎస్ మాత్రమే చదవాలనేది 'కల'. 'లాంగ్ టర్మ్ తీసుకో' అని సూచించారు. లాంగ్ టర్మ్ అంటే ఒక సంవత్సరం వృథా అవుతుంది... పైగా ఈసారి ఎంట్రన్స్‌లో కూడా మంచి ర్యాంక్ వస్తుందో రాదో అనే భయం ఆ అబ్బాయికి ఉన్నా బలవంతం చేస్తే ఎంత చెప్పినా వినకపోతే ఆ అబ్బాయి ఉక్కిరిబిక్కిరి అవ్వడా?



ఒత్తిడి వద్దు

టీనేజ్ సమయంలో పిల్లల భావోద్వేగాలు పరిపక్వంగా ఉండవు. కొంత తెలిసీ కొంత తెలియనితనం ఉంటుంది. ఆసక్తులు కూడా పూర్తిగా షేప్ కావు. ఇంటర్, గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించి, కాలేజీలకు సంబంధించి వారికి ఎన్నో సందేహాలుంటాయి. ఎంపికలు ఉంటాయి. ఇవాళ రేపు తల్లిదండ్రులు 'తాము చదివించాలనుకున్న కోర్సు' కోసం ఏకంగా పంజాబ్, హర్యాణ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు పంపుతున్నారు. ఇంట్లో ఉండి చదివే వీలున్నా రెసిడెన్షియల్ కాలేజీల్లో పడేస్తున్నారు. అంతంత మాత్రం చదువు చెప్పినా పర్లేదని మెడిసన్ పట్టా ఉంటే చాలని ఆసియా దేశాలకు సాగనంపుతున్నారు. పిల్లలతో ఎంతో మాట్లాడి, కౌన్సెలింగ్ చేసి, మంచి చెడ్డలన్నీ చర్చించి, వారికి సంపూర్ణ అవగాహన కలిగించి రెండు ఆప్షన్లు ఇచ్చి వారి ఆప్షన్లు కూడా పరిగణించి సానుకూలంగా ఒక ఎంపిక చేయడం ఎప్పుడూ మంచిది. లేదంటే 'కోటా' లాంటి కోచింగ్ ఊర్లలో జరుగుతున్న విషాదాలు, హైదరాబాద్‌లాంటి చోట్ల ఇల్లు విడిచి పోతున్న సంఘటనలు ఎదుర్కోనాల్సి వస్తుంది.

ప్రతిదీ నిర్ణయించడమే

తల్లిదండ్రుల స్తోమత పిల్లలకు తెలుసు. వారు చదివించ దగ్గ చదువులోనే తమకు ఇష్టం, ఆసక్తి, ప్రవేశం ఉన్న సబ్జక్టును చదవాలని కోరుకుంటారు. పైగా తమ స్నేహితుల ద్వారా వారూ కొంత సమాచారం సేకరించి ఫలానా కాలేజీలో ఫలానా కోర్సు చదవాలని నిశ్చయించుకోవచ్చు. అయితే తల్లిదండ్రులు పిల్లల ఆసక్తికి ఏ మాత్రం విలువ లేకుండా ఎలాగైనా చేసి రికమండేషన్లు పట్టి తాము ఎంపిక చేసిన కాలేజీలోనే చదవాలని శాసిస్తారు. ఇది అన్నివేళలా సమంజసం కాదు.

వంటిల్లు

సీజనల్ ఫ్రూట్స్ ఉంటాయి... సీజనల్ వెజిటబుల్స్ ఉంటాయి.
అలాగే సీజనల్ ఆకులూ ఉంటాయి...చింతచిగురు నోరూరిస్తోంది.
ఎప్పుడూ చింతచిగురు పప్పేనా! ఈ సారి ఇలా ట్రై చేద్దాం.
ఓ పచ్చడి... ఓ పొడి... ఓ అన్నం... ఓ కూర.
వెరైటీగా ఏం వండాలా అనే చింత వద్దు. చింత ఉంది చిరుపుల్లగా...
జిహ్వకు హితవుగా.

చింత లేని వంట



చింత చిగురు పొడి



కావలసినవి: చింత చిగురు – కప్పు; ఎండుమిర్చి – 7 లేదా 8; ఎండు కొబ్బరి – అర చిప్ప; వెల్లుల్లి రేకలు – 4; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినంత;

తయారీ: ● చింత చిగురును మంచినీటితో శుభ్రం చేసి నీడలో ఆరబెట్టాలి. ● స్టవ్ మీద మందపాటి బాణలి వేడి చేసి సన్నమంట మీద చింత చిగురులో తేమ పోయే వరకు వేయించాలి. వేగిన ఆకును ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో ఎండుమిర్చి, కొబ్బరి వేసి వేయించాలి. ● అన్నీ చల్లారిన తర్వాత మిక్సీలో వేసి కొంచెం పలుకుగా గ్రైండ్ చేయాలి. ఉప్పు, వెల్లుల్లి వేసి మరో రౌండ్ గ్రైండ్ చేస్తే చింత చిగురు పొడి రెడీ. వేడి అన్నంలో చింతచిగురు పొడి, నెయ్యి కలుపుకుంటే రుచి అమోఘం. ఇడ్లీ, దోశల్లోకి కూడా బాగుంటుంది. ● ఈ పొడిని గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఇంకా ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు.

చింత చిగురు పులిహోర



కావలసినవి: చింతచిగురు – 2 కప్పులు; బియ్యం – 2 కప్పులు; పచ్చిమిర్చి – 3 (నిలువుగా చీరాలి); నూనె – టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **పోపు కోసం...** నూనె – 2 టీ స్పూన్‌లు; ఆవాలు – అర టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; వేరు శనగపప్పు – టేబుల్ స్పూన్; జీడిపప్పు – పది; ఎండుమిర్చి – 4; ఇంగువ – చిటికెడు; పసుపు – పావ టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు.

తయారీ: ● బియ్యం కడిగి అన్నం పలుకుగా వండుకోవాలి. వండిన తర్వాత వెడల్పుగా ఉన్న పళ్లెంలో వేసి చల్లారనివ్వాలి. ● చింతచిగురును శుభ్రంగా కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పూర్తిగా కారిపోయే వరకు ఉంచాలి. ● బాణలిలో నూనె వేడిచేసి పచ్చిమిర్చి, చింత చిగురు వేసి సన్నమంట మీద దాదాపు ఐదు నిమిషాల సేపు వేయిస్తూ ఆకు మెత్తగా మగ్గిన తరవాత ఉప్పు కలిపి దించేసి చల్లారనివ్వాలి. ● కొబ్బరిని మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● పోపు కోసం మరొక బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి వేసి అవి వేగిన తర్వాత జీడిపప్పు, వేరుశనగపప్పు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేయించాలి. అవి వేగిన తర్వాత కరివేపాకు, ఇంగువ, పసుపు వేసి కలపాలి. ఇప్పుడు ముందుగా మరొక బాణలిలో మగ్గించి పెట్టుకున్న పచ్చిమిర్చి, చింతచిగురు మిశ్రమాన్ని వేసి కలపాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని చల్లారిన అన్నంలో వేసి కలిపితే చింతచిగురు పులిహోర రెడీ. చివరగా రుచి చూసి అవసరమైతే ఉప్పు కలుపుకోవాలి.

చింతచిగురు కొబ్బరి పచ్చడి



కావలసినవి: చింత చిగురు – 2 కప్పులు (శుభ్రంగా కడగాలి); పచ్చి కొబ్బరి ముక్కలు – కప్పు; పచ్చిమిర్చి – 2; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **పోపు కోసం...** ఆవాలు – అర టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – 2 రెమ్మలు; మినప్పప్పు – అర టీ స్పూన్; ఎండు మిర్చి – 2; నూనె – అర టీ స్పూన్;

తయారీ: ● కొబ్బరిముక్కలు, చింతచిగురు, పచ్చిమిర్చి, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయాలి. ● చిన్న పాత్రలో నూనె వేసి చిన్న మంట మీద వేడి చేసి అందులో ఆవాలు వేసి అవి వేగిన వెంటనే ఎండుమిర్చి (విరిచి ముక్కలు చేసి వేయాలి), మినప్పప్పు వేసి ఎర్రగా వేగిన తర్వాత ఇంగువ వేసి స్టవ్ ఆపేయాలి. పోపును స్పూన్‌తో కలిపి అందులో మిక్సీలో గ్రైండ్ చేసిన కొబ్బరి పచ్చడి వేసి కలపాలి. ఘుమఘుమలాడే కొబ్బరి పచ్చడి రెడీ. ఇది ఇడ్లీ, దోశలతోపాటు అన్నంలోకి కూడా రుచిగా ఉంటుంది.

చింతచిగురు మటన్



కావలసినవి: మటన్ – అర కేజీ; చింతచిగురు – పావు కేజీ; ధనియాల పొడి – టీ స్పూన్; పుదీన ఆకులు – కప్పు; కొత్తిమీర తరుగు – కప్పు; కొబ్బరి పొడి – టేబుల్ స్పూన్; అల్లం వెల్లుల్లి పేస్ట్– టేబుల్ స్పూన్; పసుపు– టీ స్పూన్; మిరప్పొడి – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – కప్పు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; ఉప్పు – అర టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూన్; నూనె – 3 టేబుల్ స్పూన్‌లు;

తయారీ: ● మాంసాన్ని శుభ్రం చేసి పక్కన పెట్టాలి. ● ప్రెషర్ పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, గరం మసాలా పొడి, ఉల్లిపాయ ముక్కలు, పసుపు, అల్లంవెల్లుల్లి పేస్ట్ కలిపి రెండు నిమిషాల సేపు మీడియం మంట మీద మగ్గనివ్వాలి. ఇప్పుడు కొబ్బరి పొడి వేసి మరో నిమిషం పాటు కలుపుతూ దోరగా వేగనివ్వాలి. ఇందులో మాంసం ముక్కలు, రెండు కప్పుల నీరు, ఉప్పు, ధనియాల పొడి, మిరప్పొడి వేసి బాగా కలిపి ప్రెషర్ పాన్ మూత పెట్టి మంట పెంచాలి. రెండు విజిల్స్ వచ్చిన తర్వాత మంట మీడియంలో పెట్టి మరో రెండు విజిల్స్ వచ్చిన తర్వాత ఆపేయాలి. ● ప్రెషర్ తగ్గిన తర్వాత మూత తీసి కొత్తిమీర, పుదీన, చింతచిగురు వేసి కలిపి ఐదు నిమిషాల సేపు (ఆకులు మగ్గి కూరలో నీరు తగ్గి ఇగురుగా వచ్చే వరకు) వేయించి స్టవ్ ఆపేయాలి. చింతచిగురు మాంసం వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.

యువర్స్

● ఇన్నోవేషన్



● ఆదిత్య దాదియ

అక్షరాలా ఆల్‌రైట్

బీమా రంగాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త డిజిటల్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాడు ఆదిత్య దాదియ.

ముంబైకి చెందిన ఆదిత్య స్టార్టప్ 'ఆల్ రైట్' సూపర్ సక్సెస్ అయింది.

ఎన్నో చిక్కుముడులకు పరిష్కార మార్గం చూపించింది.

'ఆల్‌రైట్' సృష్టించిన సాఫ్ట్‌వేర్, ఇన్సూరెన్స్ కంపెనీల పనితీరును సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది.

వాణిజ్య బీమా విభాగం పాత దారిలోనే నడుస్తోంది. ఇంటర్నల్ ఇన్సూరెన్స్ ప్రాసెస్ ఇప్పటికీ మాన్యువల్‌గానే ఉంది. ఈ నేపథ్యంలో బీమా కంపెనీలను కొత్త దారిలో నడిపించడానికి ముందుకు వచ్చింది నెక్స్ట్-జెనరేషన్ టెక్ ప్లాట్‌ఫామ్ ఆల్‌రైట్.

కోవిడ్ మహమ్మారి కాలంలో 'ఆల్‌రైట్'పై దృష్టి పెట్టాడు కార్పొరేట్ లాయర్ అయిన ఆదిత్య దాదియ.

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఫిన్‌టెక్ స్టార్టప్‌లతో కలిసి పనిచేసిన ఆదిత్య ఆ టైమ్‌లో గమనించిన విషయం ఏమిటంటే.... కమర్షియల్ ఇన్సూరెన్స్ స్పేస్‌లో పని పూర్తిగా మాన్యువల్‌గానే జరుగుతుందని. ఈ నేపథ్యంలోనే 'ఆల్‌రైట్'పై దృష్టి పెట్టాడు.

అయితే ఇది అంత తేలికైన విషయం కాదనేది ఆదిత్యకు తెలుసు.

రకరకాల ప్రయత్నాల తరువాత విజయం సాధించాడు.

బీమా కంపెనీల పనిని సులభతరం చేసే సాఫ్ట్‌వేర్‌ను సక్సెస్‌ఫుల్‌గా రూపొందించాడు.

సమయాన్ని ఆదా చేయగలిగే సాఫ్ట్‌వేర్ ఇది. ఉదాహరణకు..రెండు వారాలు పట్టే పనిని నిమిషాల్లో చేయవచ్చు.

ఈ సాఫ్ట్‌వేర్‌కు తక్కువ కాలంలోనే మార్కెట్ నుంచి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చింది.

ఇన్నోవేటివ్ స్టార్టప్‌గా గుర్తింపు పొందిన 'ఆల్‌రైట్' గత సంవత్సరం సీడ్ ఫండింగ్ రౌండ్‌లో విజయవంతంగా పది కోట్లు సమీకరించింది.

జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు ఏజెంట్లు, ఇన్సూరెన్స్ బ్రోకర్స్, కార్పొరేట్ ఏజెంట్స్ తమ 'టార్గెట్ కస్యూమర్స్' అంటున్నాడు ఆదిత్య.

బీమా కంపెనీలు, బ్రోకర్లు, ఏజెంట్లు, కార్పొరేట్ ఇంటర్‌మీడియరీస్, బ్యాంకుల మధ్య అంతరాన్ని తగ్గించే సొల్యూషన్స్ అందించాలని 'ఆల్‌రైట్' లక్ష్యంగా పెట్టుకుంది.

కోట్ ప్రొక్యూర్‌మెంట్, ప్లేస్‌మెంట్, అండర్ రైటింగ్, యూజర్ మేనేజ్‌మెంట్, నాలెడ్జ్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ టూల్....స్థూలంగా చెప్పాలంటే బీమా ప్రక్రియను సులభతరం చేయడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకుంది ఆల్‌రైట్.

'ఫోర్బ్స్ 30 అండర్ 30-ఆసియా' జాబితాలో చోటు సంపాదించిన ఆదిత్య తన కంపెనీ మరింత విస్తరించే ప్రణాళికలతో బిజీగా ఉన్నాడు.

'ఇది ఇలాగే ఉంటుంది. అంతే' అనుకునేవారు కొందరు.

'అలాగే ఎందుకు ఉండాలి? మరోలా కూడా ఉండవచ్చు కదా' అని అడిగే వాళ్లు కొందరు.

ఆదిత్య రెండో కోవకు చెందిన యువకుడు. కొత్తగా ఆలోచిస్తే విజయం ఖాయం అని అక్షరాలా 'ఆల్‌రైట్'తో నిరూపించిన యువకుడు.

● టెక్.. టాక్

హువావే వాచ్ ఫిట్ 3



డిస్‌ప్లే: 1.82 అంగుళాలు
రిజల్యూషన్: 480×408 పిక్సెల్స్
బరువు: 26 గ్రా.
బ్యాటరీ: 400 ఎంఏహెచ్
■ ఆటోమెటిక్ ప్రాంప్ట్స్-ట్రాక్ స్పోర్ట్స్ అండ్ యాక్టివిటీస్, వెదర్ వార్నింగ్స్ డిస్‌ప్లే

ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌కు సంగీతం



ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌కు పర్సనలైజ్‌డ్ టచ్ ఇవ్వడానికి, మ్యూజిక్ ద్వారా మన మూడ్‌ను రెఫ్లెక్ట్ చేయడానికి ఉపకరించే లేటెస్ట్ ఫీచర్ ఇది. దీని కోసం...

■ ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ను అప్‌డేట్ చేయాలి ■ ప్రొఫైల్ స్క్రీన్‌తో యాక్సెస్ కావడానికి బాటమ్ రైట్ కార్నర్‌లోని ప్రొఫైల్ పిక్చర్ ట్యాప్ చేయాలి ■ ఎడిట్ ప్రొఫైల్-ట్యాప్ ■ మ్యూజిక్-ట్యాప్ ■ పాటను ఎంపిక చేసుకోవడానికి ప్రొఫైల్ సాంగ్ సెక్షన్‌లో ప్లస్ ఐకాన్ సెలెక్ట్ చేయాలి.

ఆస్క్ ఫొటోస్



టెక్ దిగ్గజం గూగుల్ రకరకాల కొత్త ఫీచర్‌ల గురించి ప్రకటించింది. అందులో 'ఆస్క్ ఫొటోస్' ఒకటి. అడ్వాన్స్‌డ్ జెమిని ఏఐ మోడల్‌తో వస్తున్న ఈ ఫీచర్‌ను యూజర్‌లు తమ ఫొటో కలెక్షన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యేలా డిజైన్ చేశారు. యూజర్‌లు తమ గ్యాలరీని విస్తరించినప్పుడు వారికి అవసరమైన ఫొటోను కనుక్కోవడం కష్టంగా ఉండవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్పెసిఫిక్ ఫొటోను త్వరగా కనిపెట్టడానికి 'ఆస్క్ ఫొటోస్' ఫీచర్ ఉపయోగపడుతుంది. కీవర్డ్ కాంబినేషన్స్‌తో పనిలేదు. ప్రాంప్ట్ చాలు. ఉదాహరణకు... 'షో మీ ది బెస్ట్ ఫొటో ఫ్రమ్ ఈచ్ నేషనల్ పార్క్ ఐ హ్యావ్ విజిటెడ్' అని ప్రాంప్ట్ ఇస్తే సంబంధిత ఇమేజ్‌లను చూపిస్తుంది. ఈ ఏఐ ఫీచర్ ప్రత్యేకత ఏమిటంటే.... యూజర్‌లు తమ ఫొటోల గురించి వివరంగా అడగవచ్చు.



షావోమీ ప్యాడ్ 6ఎస్ ప్రో 12.4

డిస్‌ప్లే: 12.40 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 10000 ఎంఏహెచ్
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్

మెమోరీ:
256జీబి 8జీబి ర్యామ్/
256జీబి 12జీబి ర్యామ్/
512జీబి 12జీబి ర్యామ్

డ్రీమ్ స్క్రీన్

'డ్రీమ్ స్క్రీన్' అనే కొత్తఫీచర్‌ని పరీక్షిస్తోంది యూట్యూబ్. ఏఐ ద్వారా 'షార్ట్స్'కు బ్యాక్‌డ్రాప్‌ను జెనరేట్ చేసే ఫీచర్ ఇది. యూజర్‌లు డ్రీమ్ స్క్రీన్‌కు యాక్సెస్ పొందిన తరువాత బ్యాక్‌గ్రౌండ్‌లో తమకు ఏమి కావాలో వివరిస్తూ ప్రాంప్ట్ ఇవ్వవచ్చు.



ఉదా: ఒక ద్వీపంలో ఫ్యాన్సీ హోటల్. ఇమేజ్ జనరేట్ అయిన తరువాత వెంటనే బ్యాక్‌గ్రౌండ్‌కు జత చేయవచ్చు. ఈ ప్రయోగాత్మక ఫీచర్ ప్రస్తుతం ఎంపిక చేసిన 'షార్ట్స్' క్రియేటర్స్ మాత్రమే అందుబాటులో ఉంది.

● గేమింగ్



గురి తప్పకుండా....

యాక్షన్ రోల్-ప్లేయింగ్ సర్వైవల్ గేమ్ వి రైజింగ్. ఒపెన్ వరల్డ్‌లో సెట్ చేసిన ఈ గేమ్‌ను అయిదు బయోమ్‌లుగా విభజించారు. కొత్తగా ఉనికిలోకి వచ్చిన రక్తపిశాచిని కంట్రోల్ చేయడం ప్లేయర్ పని. దీని కోసం రకరకాల సాధనాలను, ఆయుధాలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు శత్రువుకు చిక్కని దుర్భేద్యమైన కోటను కూడా నిర్మించుకోవాల్సి ఉంటుంది. సూర్యకాంతి, నీడ, రక్తనమూన... ఇలా ఎన్నో అంశాలు ఈ ఆటలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఏ అడుగులో ప్రమాదం, నష్టం పొంచి ఉందో కనిపెట్టే స్పృహ ఆటగాడిలో ఉండాలి. ఆటలో నాన్-ప్లేబుల్ క్యారెక్టర్లు(ఎన్‌పీసీ) కీలకం.

ప్లాట్‌ఫామ్స్: విండోస్, ప్లేస్టేషన్: 5 జానర్స్: సర్వైవల్
మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్



ఆన్ ది హరైజన్
త్వరలో జరగబోతుంది, త్వరలో రాబోతుంది....ఇలాంటి సందర్భాల్లో వాడే మాట...ఆన్ ది హరైజన్
ఉదా: వి హ్యావ్ సమ్ ఎగ్జాయిటింగ్ న్యూ ప్రాడక్ట్స్ ఆన్ ది హరైజన్

గో డచ్
మూవీకి లేదా రెస్టారెంట్... మొదలైన వాటికి గ్రూప్‌గా వెళ్లినప్పుడు టికెట్ డబ్బులు, బిల్ ఒక్కరే చెల్లించకుండా ఎవరి డబ్బులు వారే చెల్లించడాన్ని గో డచ్ అంటారు. ఆర్థిక భారం ఒక్కరి మీదే పడకుండా చూసుకునే పద్ధతి ఇది.
ఉదా: వి డిసైడెడ్ టు గో డచ్ ఎట్ ది రెస్టారెంట్ లాస్ట్ నైట్. సో ఎవ్రీవన్ పెయిడ్ ఫర్ దెయిర్ వోన్ మీల్.

● మ్యూజిక్ వరల్డ్

స్వగత సంగీతం

డిజిటల్ సింగిల్ 'కీపింగ్ ది ఫైర్'తో ఆరంగేట్రం చేసింది 'ఎక్స్:ఇన్' అనే అయిదుగురు సభ్యుల మల్టీనేషనల్ గర్ల్ గ్రూప్. ఈ గ్రూప్‌లోని సభ్యుల పేర్లు.... ఇషా, నిజ్, హన్నా, నోవ, ఆరియా (ఇండియా)

సెకండ్ మినీ ఆల్బమ్ 'ది రియల్'తో మరోసారి సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది 'ఎక్స్:ఇన్' బృందం.

'మా కలలు, కన్నీళ్లు, కష్టాలు ఈ ఆల్బమ్‌లో ఉంటాయి' అంటుంది మెయిన్ ర్యాపర్, లీడ్ డ్యాన్సర్ నోవ.

ఈ ఆల్బమ్ తమ పర్సనల్ స్టోరీలకు సంబంధించిన 'మ్యూజికల్ ఎక్స్‌ప్రెషన్' అని కూడా అంటుంది నోవ. 'ది రియల్'లో నో డౌట్, మై ఐడల్, విత్‌డ్రా, నెవర్ సారీ అనే పాటలు ఉన్నాయి. సవాళ్లు, ఆటుపోట్లను అధిగమించి ఉన్నతస్థానానికి చేరడమే ఆల్బమ్‌లోని పాటల సారాంశం.

'కష్టాలు ఉన్నట్లే వాటిని అధిగమించే దారులు ఉన్నాయి. అయితే ఆ దారి గురించి ఎంత త్వరగా తెలుసుకుంటామనేది మన వివేకం మీద ఆధారపడి ఉంటుంది' అంటుంది ఆరియా.



● ఆరియా

సినిమా


● మహేశ్‌బాబు

అందుకే 'సత్యభామ'ని నేను డైరెక్ట్ చేయలేదు

- శశికిరణ్ తిక్క



''ఇప్పటివరకూ ఎన్నో పోలీస్ స్టోరీస్ వచ్చినా భావోద్వేగాలతో రూపొందిన 'సత్యభామ' ప్రత్యేకంగా ఉంటుంది. షూటింగ్ టైమ్‌లో కాజల్ అగర్వాల్‌గారి ఎనర్జీ మా యూనిట్‌కి ఉత్సాహాన్నిచ్చేది. ఈ సినిమాలో ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు చాలా స్పెషల్. 'సత్యభామ'లో ప్రేక్షకులు కొత్త కాజల్‌ను చూస్తారు'' అన్నారు శశికిరణ్ తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్ ప్లే అందించిన శశికిరణ్ తిక్క మాట్లాడుతూ- ''యూకేలో ఉండే మా మిత్రులు రమేశ్, ప్రశాంత్ చెప్పిన పాయింట్ నచ్చడంతో నేను, దర్శకుడు సుమన్ 'సత్యభామ' కథ సిద్ధం చేశాం. దర్శకుడిగా నేను బిజీగా ఉండటంతో ఈ మూవీకి దర్శకత్వం వహించలేదు. పైగా మా అవురమ్ ఆర్ట్స్‌పై మరిన్ని సినిమాలు నిర్మించాలనుకుంటున్నాం. నిర్మాత అనుభవాలు ఎలా ఉంటాయో 'సత్యభామ'తో తెలిశాయి. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ మూవీ ఉంటుంది. 'సత్యభామ' సినిమా ప్రీమియర్స్ వేశాం... చూసిన వాళ్ల నుంచి మంచి స్పందన వచ్చింది. 'గూఢచారి' సినిమాకి నేను దర్శకత్వం వహించాను. 'గూఢచారి 2'కి వేరేవాళ్లు దర్శకత్వం చేయాలని నేను, అడివి శేష్ ముందే అనుకున్నాం. మహేశ్‌బాబుగారు 'మేజర్' సినిమాలో భాగస్వామ్యం అయ్యారు. ఆయనకు 'సత్యభామ' చూపించాలనుకుంటున్నాను'' అన్నారు.

సెప్టెంబరులో స్టార్ట్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని ఇటీవల ఓ సందర్భంలో ఈ చిత్ర కథా రచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా కోసం మహేశ్‌బాబు సరికొత్తగా మేకోవర్ అవుతున్నారు. మహేశ్ జుట్టు పెంచుతున్నారు. అలాగే బరువు కూడా పెరుగుతున్నారట. కాగా ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేసి, సెప్టెంబరులో చిత్రీకరణను మొదలుపెట్టేలా ప్లాన్ చేస్తున్నారట రాజమౌళి. అలాగే ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని, ఈ రెండు భాగాలను ఒకేసారి చిత్రీకరించేలా రాజమౌళి ప్లాన్ చేస్తున్నారని భోగట్టా.

ప్రేమ ఉన్నప్పుడు గొడవలూ ఉంటాయి

- శర్వానంద్


● శ్రీరామ్ ఆదిత్య, కృతీ శెట్టి, శర్వానంద్, టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల

''ఫొటోలు పట్టుకుని సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగిన రోజులు ఇంకా గుర్తున్నాయి. ఇరవయ్యేళ్ల ... ముప్పైఐదు సినిమాలు ఎలా అయ్యాయో తెలియదు. స్టార్ స్టేటస్ రావడానికి ఇరవై ఏళ్లు పట్టింది. నాకు 'చార్మింగ్ స్టార్' అనే టైటిల్ ఇచ్చినందుకు విశ్వగారికి థ్యాంక్స్. నేను చేసిన సినిమాల పట్ల నేను గర్వంగా ఫీలవుతున్నాను'' అని శర్వానంద్ అన్నారు. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం 'మనమే'. ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'మనమే' ప్రీ రిలీజ్ వేడుకలో శర్వానంద్ మాట్లాడుతూ- ''మనమే' సినిమాలో నేను కొత్తగా కనిపించినా, కొత్తగా పెర్ఫార్మ్ చేసినా ఆ క్రెడిట్ శ్రీరామ్‌కే వెళ్తుంది. ప్రతి ఒక్కరం చాలా కష్టపడి గొడవలు పడుతూ ఈ సినిమాను పూర్తి చేశాం. ప్రేమ ఉన్నప్పుడు గొడవలూ ఉంటాయి. ఒక మనిషికి మరో మనిషి ఇవ్వగలిగే గొప్ప బహుమతి టైమ్. ఈ పాయింట్‌నే శ్రీరామ్ ఈ సినిమాలో చెప్పారు'' అని అన్నారు. ''శర్వానంద్ తన ఎనర్జీతో ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకు వెళ్లారు'' అన్నారు శ్రీరామ్ ఆదిత్య. ''శర్వానంద్ నటన అద్భుతంగా ఉంటుంది. తన చార్మింగ్ లుక్స్, పెర్ఫార్మెన్స్ చూసి తనకి 'చార్మింగ్ స్టార్' అనే టైటిల్ ఇస్తున్నాను'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఇంకా డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి కూడా మాట్లాడారు.

రెండున్నరేళ్లు ఒకే గెటప్‌లో ఉన్నాను - నవదీప్



''లవ్ మౌళి' సినిమా షూటింగ్ మొత్తం మేఘాలయాలోని చిరపుంజీలో చేశాం. ఎన్నో వ్యయ ప్రయాసలతో అక్కడ షూట్ చేయడం పెద్ద సాహసమే అని చెప్పాలి. ఎప్పుడూ వర్షం పడే ఆ ప్రదేశంలో సినిమా మీద ప్యాషన్‌తో షూటింగ్ చేశాం. ఈ సినిమాలోని నా పాత్ర కోసం రెండున్నరేళ్లు ఒకే గెటప్‌లో ఉన్నాను. 'లవ్ మౌళి' ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది'' అని హీరో నవదీప్ అన్నారు. ప్రముఖ దర్శకుడు రాజమౌళి శిష్యుడు అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ సంస్థ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ- ''నా కెరీర్ ప్రారంభంలో జెట్ స్పీడులో వెళ్లింది. ఇప్పుడు ప్రేక్షకుల ఆలోచనకు తగ్గట్లుగా కెరీర్ మార్చుకోవాలనిపించింది. ఆ సమయంలో విన్న కథే 'లవ్ మౌళి'. ఇది రెగ్యులర్ ప్రేమకథ కాదు. అందరికీ కనెక్ట్ అవుతుంది. ముఖ్యంగా యువతకు కచ్చితంగా కనెక్ట్ అవుతుంది. 'లవ్ మౌళి' విజయంతో నా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ అవుతుందనుకుంటున్నాను. సరదాగా హీరో రానాకు ఈ చిత్రకథ చెప్పాను. కథ బాగుండటంతో అఘోరా పాత్ర చేశాడు. ప్రస్తుతం తమిళంలో నిత్యా మీనన్‌తో ఓ సినిమా, అలాగే 'న్యూసెన్స్ 2' వెబ్ సిరీస్ చేస్తున్నాను. నేను నటించిన మరికొన్ని వెబ్ సిరీస్‌లు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇక నుంచి సోలో హీరోగా మంచి కథలతో సినిమాలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు.

అతిగా తినను... ఉపవాసం ఉండను

సిల్వర్ స్క్రీన్‌పై మెరుపు తీగలా కనిపించడానికి కథానాయికలు కఠినమైన కసరత్తులు చేస్తారు... డైట్ ఫాలో అవుతారు. అయితే ఒక్కొక్కరిది ఒక్కో డైట్... చేసే వ్యాయామాలు కూడా వేరుగా ఉంటాయి. హీరోయిన్ కియారా అద్వానీ తానేం చేస్తారో ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్నారు. ''నేను ఎంత త్వరగా బరువు పెరగగలనో అంతే త్వరగా తగ్గగలను. బరువు పెరగడం, తగ్గడం రెండూ నాకు సులభమే. డ్యాన్స్, స్విమ్ చేయడం చాలా ఇష్టం. స్కూల్ డేస్‌లో అప్పుడప్పుడూ ఈ రెండూ చేసేదాన్ని. కానీ ఎప్పుడైతే సినిమా రంగంలోకి వచ్చానో అప్పట్నుంచి వీటిని నేను నా దినచర్యలో భాగంగా ప్లాన్ చేసుకుని చేస్తున్నాను. జిమ్, డ్యాన్స్, స్విమ్మింగ్.. ఇవన్నీ ఫిట్‌నెస్‌లో భాగమే. వీటిని మనం ఇష్టంగా చేస్తే సరదాగా ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు కియారా. ఇంకా తన ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతూ- ''నచ్చిన ఆహారాన్ని అతిగా తినడం, ఉపవాసాలు చేయడం వంటివి పాటించను. మసాలా ఎక్కువగా ఉందని ఇంటి భోజనం తినడానికే ఇష్టపడతాను'' అన్నారు.


● కియారా అద్వానీ

యేవమ్ అంటే...


● ప్రకాశ్, చాందిని

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందిన సినిమా 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ- ''ఈ చిత్రకథ వికారాబాద్ నేపథ్యంలో జరుగుతుంది. తెలంగాణ కల్చర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయి. నేను మొదటిసారి పోలీసాఫీసర్‌గా నటించిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. సైకలాజికల్ ఎమోషన్స్ చాలా ఉంటాయి'' అన్నారు. ''యేవమ్' అంటే 'ఇది ఇలా జరిగింది' అని అర్థం. విభిన్నమైన వ్యక్తిత్వాలు ఉన్న నలుగురు వ్యక్తులు అనుకోని పరిస్థితుల్లో కలుసుకుని, అక్కడి నుంచి వారి ప్రయాణాన్ని మొదలు పెడితే ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమా కథాంశం'' అన్నారు ప్రకాశ్.

అందుకే రక్షణ టైటిల్ పెట్టాం

- ప్రణదీప్ ఠాకోర్



''ఓ పోలీసాఫీసర్ జీవితంలో జరిగిన ఘటనను స్ఫూర్తిగా తీసుకుని కల్పిత కథతో 'రక్షణ' తీశాను. ఈ సినిమాలో చిన్న సందేశం కూడా ఉంది. సినిమా మొత్తం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లా ఉంటుంది. బాధితుల కోసం పోరాడటంతో పాటు వారిని రక్షించేలా ఉంటుంది కాబట్టి 'రక్షణ' అని టైటిల్ పెట్టాం'' అన్నారు దర్శక-నిర్మాత ప్రణదీప్ ఠాకోర్. పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రక్షణ'. ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ- ''గుణశేఖర్‌గారి వద్ద 'ఒక్కడు, సైనికుడు, రుద్రమ దేవి' సినిమాలకు అసిస్టెంట్ కో డైరెక్టర్‌గా పని చేశాను. ఆనంద్ రంగా 'ఓయ్' చిత్రానికి, భాస్కర్ 'ఆరెంజ్' సినిమాకి కో-డైరెక్టర్‌గా చేశాను. ఓ పెద్ద కథ పట్టుకుని చాలామంది వద్దకు వెళ్లాను... కానీ కుదరలేదు. అందుకే చిన్న సినిమా తీసి, నిరూపించుకోవాలని 'రక్షణ' తీశాను. ఇందులో పాయల్ అద్భుతంగా నటించారు. 'రక్షణ' తర్వాత ఆమెకు మరింత పవర్‌ఫుల్ రోల్స్ వస్తాయి. సినిమా తీయడం క్రియేటివ్... రిలీజ్ చేయడం మార్కెటింగ్ థింగ్. నేను సినిమా బాగానే తీశా. కానీ, మార్కెటింగ్‌లో పూర్. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని రిలీజ్ చేయడమే కష్టంగా మారింది'' అన్నారు.

'మా'లో హేమ ప్రాథమిక సభ్యత్వం సస్పెన్షన్


● హేమ

బెంగళూరు రేవ్ పార్టీ కేసులో హేమ అరెస్టు అయిన సంగతి తెలిసిందే. దీంతో 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' (మా) ఆమె ప్రాథమిక సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది. హేమ సభ్యత్వాన్ని సస్పెండ్ చేసే విషయమై 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ప్యానెల్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారట. ఆమె ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు 'మా' కార్యదర్శి రఘుబాబు ఓ లేఖ విడుదల చేశారు. మే నెలలో బెంగళూరు రేవ్ పార్టీలో హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసుల నివేదికలో నిర్ధారణ కావడంతో 'మా' ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు 'మా' నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆమె నుంచి స్పందన లేకపోవడంతో సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు, విచారణ తేలేవరకూ ఈ సస్పెన్షన్ కొనసాగుతుందన్నట్లు హేమకు 'మా' లేఖ పంపినట్లు తెలిసింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	692	75,075
నిఫ్టీ ▲	201	22,821

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,175	▽ 13
డోజోన్స్	38,825	▲ 18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,285	▲ 38
డాక్స్	18,647	▲ 71
షాంఘై	3,049	▽ 17
నికాయ్	38,703	▲ 213

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో – ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,757	▲ 771
బంగారం (99.5 స్వచ్ఛత)	72,466	▲ 768
వెండి (కేజీ)	90,407	▲ 1,877

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.00	84.02
€	యూరో	89.78	92.15
¥	జపాన్ ఎన్ (100)	53.07	54.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	54.70	56.64
£	బ్రిటన్ పౌండ్	104.20	109.13
S$	సింగపూర్ డాలర్	59.61	64.30
SAR	సౌదీ రియాల్	21.36	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	21.84	23.62
¥	చైనా యువాన్	10.40	12.47

రెండో రోజూ మార్కెట్ ర్యాలీ

- సెన్సెక్స్ 692 పాయింట్లు అప్
- 75,000 అధిగమించిన ఇండెక్స్
- 201 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
- 22,821 వద్ద ముగింపు
- అమ్మకాల బాటలోనే ఎఫ్‌పీఐలు



ముంబై: అనిశ్చితికి తెరదించుతూ మూడోసారి బీజేపీ కూటమి అధికారాన్ని చేపట్టనుండటంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభాల దౌడు తీశాయి. సెన్సెక్స్ 692 పాయింట్లు జంప్‌చేసింది. 75,000 పాయింట్ల మైలురాయిని అధిగమించి 75,075 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 201 పాయింట్లు ఎగసి 22,821 వద్ద నిలిచింది. తొలుత ఒక దశలో గరిష్టంగా సెన్సెక్స్ 75,298కు చేరగా.. నిఫ్టీ 22,910ను తాకింది. వెరసి సెన్సెక్స్ 915 పాయింట్లు, నిఫ్టీ 290 పాయింట్లు చొప్పున దూసుకెళ్లాయి. దీంతో బీజేపీకి మెజారిటీ లభించకపోవడంతో మంగళవారం నమోదైన రూ. 31 లక్షల కోట్ల మార్కెట్ విలువ నష్టంలో చాలావరకూ రికవరైంది. గత రెండు రోజుల్లో బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ రూ. 21 లక్షల కోట్లకుపైగా బలపడింది. ఫలితంగా బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ దాదాపు రూ. 416 లక్షల కోట్లకు(4.98 ట్రిలియన్ డాలర్లు) చేరింది.

నేటి ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలపై దృష్టి

నేడు(శుక్రవారం) ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో ఇకపై ఇన్వెస్టర్ల దృష్టి వడ్డీ రేట్లవైపు మళ్లనున్నట్లు మార్కెట్ నిపుణులు వివరించారు. కాగా.. రియల్టీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్స్, ఐటీ, ఆయిల్, మెటల్ రంగాలు 5–1.5 శాతం మధ్య లాభపడ్డాయి. మరోవైపు హిందాల్కో, హీరోమోటో కార్ప్, ఏషియన్ పెయింట్స్, ఎంఅండ్ఎం, నెస్లే, ఇండస్‌ఇండ్, సిప్లా, బ్రిటానియా 2.4–1% మధ్య నీరసించాయి.

కాగా, బీఎస్‌ఈలో ట్రేడైన షేర్లలో 2,981 లాభపడితే.. కేవలం 878 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) మరోసారి అమ్మకాలకే ప్రాధాన్యమిచ్చారు. రూ. 6,868 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. దేశీ ఫండ్స్ మాత్రం రూ. 3,718 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. గత 2 రోజుల్లో ఎఫ్‌పీఐలు రూ. 18,000 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసు కున్నారు.

బీహెచ్‌ఈఎల్ 9% జంప్

అదానీ పవర్ రూ. 3,500 కోట్ల భారీ ఆర్డర్ నేపథ్యంలో బీహెచ్‌ఈఎల్ షేరు తాజాగా 9 శాతం జంప్‌చేసింది. రూ. 278 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 15% దూసుకెళ్లి రూ. 292ను అధిగమించింది. మార్కెట్ విలువ రూ. 7,974 కోట్లు బలపడి రూ. 96,854 కోట్లకు చేరింది.

అదానీ షేర్లు జూమ్



వరుసగా రెండో రోజు అదానీ గ్రూప్ కౌంటర్లకు డిమాండ్ నెలకొంది. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీలలో అదానీ పోర్ట్స్ స్వల్ప వెనకడుగు వేయగా.. ఎనర్జీ సొల్యూషన్స్, టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ, పవర్, విల్మర్, ఏసీసీ, ఎంటర్‌ప్రైజెస్, గ్రీన్ ఎనర్జీ, అంబుజా 5– 2 శాతం మధ్య ఎగశాయి. గ్రూప్ మార్కెట్ విలువ రూ. 17 లక్షల కోట్లను అధిగమించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
7-6-2024	
విశాఖ	450-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

బెటర్ న్యూట్రిషన్‌లో పీవీ సింధు పెట్టుబడులు



న్యూఢిల్లీ: అగ్రి స్టార్టప్ సంస్థ గ్రీన్‌డేకి చెందిన బెటర్ న్యూట్రిషన్ బ్రాండ్‌లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఇన్వెస్ట్ చేశారు. సదరు బ్రాండ్‌కి ఆమె ప్రచారకర్తగా కూడా వ్యవహరించనున్నారు. సింధు ఎంత ఇన్వెస్ట్ చేసినదీ వెల్లడి కాలేదు. కీలకమైన పౌష్టికాహార లోపాలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న బ్రాండ్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉందని సింధు తెలిపారు. దేశీయంగా 50 శాతం మంది ప్రజలు జింక్, ఐరన్, ప్రొటీన్ మొదలైన వాటి లోపాలతో బాధపడుతున్నారని గ్రీన్‌డే సీఈవో రస్తోగి తెలిపారు. ఈ నేపథ్యంలో తాము సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉండే పంటలను పండించేందుకు 15,000 మంది పైచిలుకు రైతులతో కలిసి పని చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్‌కి 75 పైచిలుకు అగ్రి–ఇన్‌పుట్ స్టోర్స్, కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. బెటర్ న్యూట్రిషన్ పేరిట బియ్యం, గోధుమ పిండి, రాగులు మొదలైనవి విక్రయిస్తోంది.

భారత్‌కు ఎంజీ బింగో ఈవీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ కార్ల విపణిలో బింగో ఈవీ 2025లో రంగ ప్రవేశం చేయనుంది. ఎంజీ మాతృ సంస్థ ఎస్‌ఏఐసీ ఈ మేరకు సిద్ధం అవుతోంది. ఎంజీ మోటార్ ఇండియా గ్లోస్టర్ అప్‌డేటెడ్ వర్షన్‌తోపాటు ఎంజీ క్లౌడ్ ఈవీని ఈ ఏడాది భారత్‌లో ప్రవేశపెడుతోంది. బింగో హ్యాచ్‌బ్యాక్ తొలుత చైనాలో ఎంట్రీ ఇచ్చింది. ఇండోనేషియాలోనూ విక్రయిస్తున్నారు. ఎంజీ కామెట్ మాదిరి కాకుండా అయిదు డోర్లతో బింగో ఈవీ రూపుదిద్దుకుంది. గ్లోబల్ స్మాల్ ఎలక్ట్రిక్ వెహికిల్ ప్లాట్‌ఫామ్‌పై ఈ కారు తయారైంది. 3,950 మిల్లీమీటర్ల పొడవు ఉంది. 41 హెచ్‌పీ మోటార్, 17.3 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ 203 కిలోమీటర్ల వరకు, 68 హెచ్‌పీ మోటార్, 31.9 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ 333 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.



ఆరు సంస్థలుగా వేదాంతా

ఎస్‌బీఐసహా రుణదాతల గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ బిజినెస్‌ల విడదీతకు రుణదాతలు ఆమోదముద్ర వేశారు. దీంతో ఆరు స్వతంత్ర లిస్టెడ్ కంపెనీలుగా ఆవిర్భవించేందుకు వేదాంతాకు వీలు చిక్కనుంది. ఎస్‌బీఐసహా రుణదాతలు అంగీకరించడంతో 52 శాతానికిపైగా అనుమతి లభించినట్లేనని వేదాంతా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరు పేర్కొన్నారు. అధిక శాతం రుణదాతలు విడదీతను సమర్థించినట్లు వెల్లడించారు. విడదీత ప్రణాళికకు 75% ఆమోదం లభించవలసి ఉండగా.. వారం, పది రోజుల్లో మిగిలిన లక్ష్యాన్ని సైతం చేరుకోగలమని తెలియజేశారు. కొన్ని అనుమతులకు కమిటీ మీటింగ్, బోర్డు సమావేశాల కోసం చూస్తున్నట్లు తెలియజేశారు. వీటి తదుపరి ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రధాన రుణదాత ఎస్‌బీఐ ఇప్పటికే సమ్మతించగా.. 20 బిలియన్ డాలర్ల విలువైన విడదీత ప్రణాళికకు దారి ఏర్పడినట్లు వివరించారు. గత జనవరి–మార్చిలో రూ. 6,155 కోట్ల నికర రుణభారాన్ని తగ్గించుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో రుణ భారం రూ. 56,388 కోట్లకు చేరినట్లు తెలియజేసింది. వేదాంతా రుణదాతల జాబితాలో ఎస్‌బీఐ, బీవోబీ, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, ఐవోబీ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో పాటు.. ప్రయివేట్ బ్యాంకులైన యస్ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, కొటక్ మహీంద్రా ఉన్నాయి.

విడదీతలో భాగంగా వేదాంతా.. అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యుత్, స్టీల్, ఫెర్రస్ మెటీరియల్స్, బేస్ మెటల్స్ సంస్థలుగా ఏర్పాటు కానుంది. ఇవన్నీ స్వతంత్ర కంపెనీలుగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నాయి

దేశీ విమాన ప్రయాణికుల్లో వృద్ధి




- మే నెలలో 1.39 కోట్ల మంది ప్రయాణం
- గతేడాదితో పోలిస్తే 5.1 శాతం అధికం
- ఇక్రా రేటింగ్స్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా మే నెలలో 1.39 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. 2023 మే నెలతో పోలిస్తే ఇది 5.1 శాతం అధికం. కోవిడ్ ముందస్తు కాలంతో పోలిస్తే 14 శాతం ఎక్కువ అని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా తాజా నివేదిక వెల్లడించింది. ఏప్రిల్‌లో 1.32 కోట్ల మంది రాకపోకలు సాగించారు. 2024–25లో ట్రెండ్ కొనసాగుతుందని ఇక్రా భావిస్తోంది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణికుల ట్రాఫిక్‌లో సానుకూల ధోరణి కొనసాగుతుందని పేర్కొంది. నివేదిక ప్రకారం.. గత నెలలో వియానయాన సంస్థల సామర్థ్యం 2023 మే నెలతో పోలిస్తే 6 శాతం, 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2 శాతం పెరిగింది. భారత్ నుంచి 2023–24లో 24 శాతం అధికంగా 2.97 కోట్ల మంది విదేశీయానం చేశారు. పరిశ్రమ కోవిడ్‌కు ముందు స్థాయిల కంటే అధిక రాబడి అందుకుంది.

హరిత ఇంధనాల్లో 500 బిలియన్ డాలర్ల అవకాశాలు

ఐపీఈఎఫ్ సదస్సులో భారత్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా పునరుత్పాదక ఇంధనాలు, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు తదితర పర్యావరణ అనుకూల ఇంధనాల వినియోగ వ్యవస్థలో భారీగా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేసేందుకు ఆస్కారం ఉందని ఇండో–పసిఫిక్ ఎకనమిక్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రాస్పరిటీ (ఐపీఈఎఫ్) క్లీన్ ఎకానమీ ఇన్వెస్టర్ ఫోరంలో పాల్గొన్న సందర్భంగా వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ తెలిపారు. గత దశాబ్ద కాలంగా వ్యాపారాల నిర్వహణకు అనువుగా భారత్ అమలు చేసిన పలు సంస్కరణలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. రెండు రోజుల ఈ సదస్సులో ప్రాంతీయంగా టాప్ ఇన్వెస్టర్లు, పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థల కోసం కృషి చేస్తున్న కంపెనీలు, స్టార్టప్‌లు పాల్గొన్నాయి. పర్యావరణ అనుకూల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగానికి సంబంధించి తమ కాన్సెప్టులను తెలియజేసేందుకు భారత్ నుంచి నాలుగు సంస్థలు (రెన్యూ పవర్, అవాడా ఎనర్జీ మొదలైనవి) షార్ట్‌లిస్ట్ అయ్యాయి. అలాగే క్లైమేట్ టెక్ విషయంలో వినూత్న ఐడియాలను ఆవిష్కరించేందుకు 10 భారతీయ స్టార్టప్‌లు, కంపెనీలు ఎంపికయ్యాయి.



నెక్ట్స్‌వేవ్‌కు డబ్ల్యూఈఎఫ్ లిస్టులో చోటు

NXT WAVE

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏఐ ఆధారిత కోడింగ్ కోర్సులు అందిస్తున్న హైదరాబాదీ స్టార్టప్ సంస్థ నెక్ట్స్‌వేవ్ తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) లిస్టులో చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 100 టెక్ స్టార్టప్‌లతో డబ్ల్యూఈఎఫ్ రూపొందించిన టెక్నాలజీ పయొనీర్స్ జాబితాలో భారత్ నుంచి ఎంపికైన 10 సంస్థల్లో నెక్ట్స్‌వేవ్ కూడా ఉంది. మిగతా వాటిలో పిక్సెల్, నిరామయ్, సర్వమ్ ఏఐ తదితర సంస్థలు ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి బయోటెక్, స్పేస్, న్యూరోటెక్నాలజీ తదితర రంగాల్లో సొల్యూషన్స్‌ను రూపొందిస్తున్న సంస్థలతో డబ్ల్యూఈఎఫ్ ఈ లిస్టును తయారు చేసింది.

సాక్షి స్పోర్ట్స్

రెజ్లర్ అమన్‌కు రజతం



పొల్యాక్ ఇమ్రి–వర్గా జోనస్ స్మారక ర్యాంకింగ్ సిరీస్ రెజ్లింగ్ టోర్నీలో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ రజత పతకం సాధించాడు. హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో అమన్ పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. రె హిగుచి (జపాన్)తో జరిగిన ఫైనల్లో అమన్ 1-11 పాయింట్లతో ఓడిపోయాడు. నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన అమన్ 11-1తో రొబెర్టి డింగాష్‌విలి (జార్జియా)పై, సెమీఫైనల్లో 14-4తో టిసిటర్స్ (బెలారస్)పై గెలుపొందాడు.

క్వార్టర్స్‌లో సుమిత్ నగాల్



జర్మనీలో జరుగుతున్న నెకర్ కప్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో సుమిత్ 6-4, 6-1తో జేవియర్ కొసానో (స్పెయిన్)పై గెలుపొందాడు.

సరబ్‌జోత్ 'పసిడి' గురి



మ్యూనిక్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ పతకాల ఖాతా తెరిచింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. వరల్డ్ చాంపియన్, నాలుగుసార్లు ఒలింపియన్ తదితర మేటి షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో 22 ఏళ్ల సరబ్‌జోత్ 242.7 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. బు షుహైహాంగ్ (చైనా; 242.5 పాయింట్లు) రజతం నెగ్గగా... రాబిన్ వాల్టర్ (జర్మనీ; 220 పాయింట్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-9, 21-15తో ప్రపంచ 12వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)పై విజయం సాధించాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో లక్ష్య సేన్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో లక్ష్య సేన్ 2-3తో వెనుకంజలో ఉన్నాడు. మరోవైపు భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రియాన్షు 10-21, 17-21తో ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

గాయత్రి జోడీ నిష్క్రమణ

డబుల్స్ విభాగాల్లో భారత జోడీల కథ ముగిసింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21-19, 19-21, 19-21తో మయు మత్సుమోటో–వకానా నాగహార (జపాన్) జంట చేతిలో... అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీ 13-21, 21-19, 13-21తో హనా బేక్–సో హీ లీ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయాయి. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి జోడీ 9-21, 11-21తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ ద్వయం సి వె జెంగ్–యా కియాంగ్ హువాంగ్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది.

అమెరికా 'సూపర్' సంచలనం

'సూపర్ ఓవర్'లో పాకిస్తాన్‌పై విజయం

డాలస్: టి20 ప్రపంచకప్‌లో పెను సంచలనం... టోర్నీ 11వ మ్యాచ్‌లో 'సూపర్ ఓవర్' ద్వారా అనూహ్య ఫలితం వచ్చింది. తొలిసారి వరల్డ్ కప్ బరిలోకి దిగిన ఆతిథ్య అమెరికా జట్టు అద్భుతం చేసింది. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో సత్తా చాటి మాజీ చాంపియన్ పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. 20 ఓవర్ల సమరంలో ఇరు జట్లు సమంగా నిలవడంతో 'సూపర్ ఓవర్' అనివార్యమైంది. గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో యూఎస్‌ఏ 'సూపర్ ఓవర్'లో 5 పరుగులతో పాక్‌ను ఓడించింది. 2009 విజేత పాకిస్తాన్ సమష్టి వైఫల్యం కారణంగా పరాభవంతో టోర్నీని మొదలు పెట్టగా...తొలి మ్యాచ్‌లో కెనడాపై నెగ్గిన యూఎస్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. పాక్ తరఫున ఆమిర్ వేసిన సూపర్ ఓవర్లో అమెరికా 18 పరుగులు చేయగా... గెలవాలంటే 'సూపర్ ఓవర్'లో 19 పరుగులు చేయాల్సిన పాక్... అమెరికా బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్ వేసిన సూపర్ ఓవర్లో ఒక వికెట్ కోల్పోయి 13 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. అంతకుముందు టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. బాబర్ ఆజమ్ (43 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాదాబ్ ఖాన్ (25 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించగా... షాహిన్ అఫ్రిది (16 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) చివర్లో కీలక పరుగులు చేశాడు. అమెరికా బౌలర్లలో నాస్తుష్ కెన్‌జిగే 3 వికెట్లు పడగొట్టగా, సౌరభ్ నేత్రావల్కర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం అమెరికా 20 ఓవర్లలో 3 వికెట్లకు 159 పరుగులు సాధించింది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (38 బంతుల్లో 50; 7 ఫోర్లు, 1 సిక్స్), ఆరోన్ జోన్స్ (26 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), గూస్ (26 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఒక దశలో చేతిలో 9 వికెట్లతో 8 ఓవర్లలో 56 పరుగులు చేయాల్సిన మెరుగైన స్థితిలో నిలిచిన అమెరికా ఆ తర్వాత పాక్ బౌలింగ్ ముందు తడబడింది. అయితే 19వ ఓవర్ వరకు పట్టు బిగించిన పాక్...చివరి ఓవర్లో వెనుకంజ వేసింది. రవూఫ్ వేసిన ఈ ఓవర్లో గెలుపు కోసం 15 పరుగులు చేయాల్సి ఉండగా యూఎస్ ఫోర్, సిక్స్ సహా 14 పరుగులు రాబట్టింది.



షాదాబ్ ఖాన్



మోనాంక్ పటేల్

స్టొయినిస్ షో

తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం ● 39 పరుగులతో ఒమన్ ఓటమి

బ్రిడ్జ్‌టౌన్: మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా టి20 ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో విజయం కోసం కాస్త శ్రమించాల్సి వచ్చింది. చిన్న జట్టే అయినా ఒమన్ గట్టి పోటీనివ్వడంతో కంగారూలు ఆరంభంలో తడబడినా చివరకు గట్టెక్కారు. 'ప్లేయర్ ఆఫ్ మ్యాచ్' స్టొయినిస్ (36 బంతుల్లో 67 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు; 3/19) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. గురువారం జరిగిన గ్రూప్ 'బి' పోరులో ఆస్ట్రేలియా 39 పరుగుల తేడాతో ఒమన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు సాధించింది. వార్నర్ (51 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం ఒమన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేయగలిగింది. అయాన్ ఖాన్ (30 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మెహ్రాన్ ఖాన్ (16 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు పెద్దగా అనుకూలించని పిచ్‌పై హెడ్ (12) విఫలం కాగా... మిచెల్ మార్ష్ (14), మ్యాక్స్‌వెల్ (0) వరుస బంతుల్లో అవుట్ కావడంతో ఆసీస్ 50/3 వద్ద నిలిచింది. ఈ స్థితిలో వార్నర్, స్టొయినిస్ నాలుగో వికెట్‌కు 64 బంతుల్లోనే 102 పరుగులు జోడించి చెప్పుకోదగ్గ స్కోరును అందించారు. ఒమన్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పవర్‌ప్లేలో 37 పరుగులే చేసిన ఆసీస్... 14 ఓవర్లు ముగిసేసరికి 80 పరుగులే సాధించింది. అయితే ఆ తర్వాత స్టొయినిస్ చెలరేగిపోయాడు. మెహ్రాన్ ఖాన్ వేసిన 15వ ఓవర్లో అతను నాలుగు సిక్సర్లు బాదాడు. 27 బంతుల్లో స్టొయినిస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, వార్నర్ అర్ధ సెంచరీకి 46 బంతులు పట్టాయి. చివరి 6 ఓవర్లలో ఆసీస్ 84 పరుగులు సాధించడం విశేషం. తాజా ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆస్ట్రేలియా బ్యాటర్‌గా డేవిడ్ వార్నర్ (3155) నిలిచాడు. ఈ క్రమంలో ఆరోన్ ఫించ్ (3120)ను అతను అధిగమించాడు.



స్టొయినిస్

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఐర్లాండ్ X కెనడా

వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సునీల్ ఛెత్రి వీడ్కోలు

జాతీయ జట్టు తరఫున చివరి మ్యాచ్ ఆడిన కెప్టెన్

- భారత్, కువైట్ మ్యాచ్ 0–0తో 'డ్రా'



కోల్‌కతా: రెండు దశాబ్దాలుగా భారత ఫుట్‌బాల్ ముఖచిత్రంగా ఉన్న సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఫుట్‌బాల్ ప్రపంచ కప్–2026 ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా గురువారం కువైట్‌తో జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌ను సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు 0–0తో 'డ్రా' చేసుకుంది. నిర్ణీత సమయంలోపు రెండు జట్లు ఒక్క గోల్ కూడా చేయలేకపోయాయి. నాలుగో నిమిషంలో కువైట్ ప్లేయర్ ఈద్ అల్ రషీది కొట్టిన షాట్‌ను భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ నిలువరించాడు. అనంతరం 11వ నిమిషంలో అన్వర్ అలీ కొట్టిన హెడర్ షాట్ లక్ష్యాన్ని చేరలేకపోయింది. 48వ నిమిషంలో భారత ప్లేయర్ రహీమ్ అలీ 'డి' ఏరియాలోకి వెళ్లినా అతను కొట్టిన షాట్‌లో బలం లేకపోవడంతో బంతి నేరుగా కువైట్ గోల్‌కీపర్ చేతుల్లోకి వెళ్లింది. ఆ తర్వాత రెండు జట్లకు గోల్ చేసేందుకు ఒకట్రెండు అవకాశాలు వచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాయి. భారత్ తన చివరి మ్యాచ్‌ను జూన్ 11న ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో ఆడనుంది.

2005లో జాతీయ సీనియర్ జట్టుకు తొలిసారి ప్రాతినిధ్యం వహించిన సునీల్ ఛెత్రి ఓవరాల్‌గా భారత్ తరఫున 151 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 94 గోల్స్ సాధించాడు. ఇందులో నాలుగు 'హ్యాట్రిక్'లున్నాయి. జాతీయ జట్టు తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్స్ జాబితాలో ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 206 మ్యాచ్‌ల్లో 128 గోల్స్), అలీ దాయ్ (ఇరాన్; 149 మ్యాచ్‌ల్లో 109 గోల్స్); లయనెల్ మెస్సీ (అర్జెంటీనా; 180 మ్యాచ్‌ల్లో 106 గోల్స్) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. రికార్డుస్థాయిలో ఏడుసార్లు జాతీయ ఉత్తమ ఫుట్‌బాల్ ప్లేయర్ అవార్డు గెల్చుకున్న సునీల్ ఛెత్రికి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న' (2021లో)... అర్జున అవార్డు (2011లో), పద్మశ్రీ (2019లో) లభించాయి.

టైటిల్ పోరుకు స్వియాటెక్, జాస్మిన్



స్వియాటెక్



జాస్మిన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో నాలుగో టైటిల్ గెలిచేందుకు పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ విజయం దూరంలో నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన స్వియాటెక్ గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో 6–2, 6–4తో మూడో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా)పై గెలిచింది. రెండో సెమీఫైనల్లో 12వ సీడ్ జాస్మిన్ పావ్లిని (ఇటలీ) 6–3, 6–1తో రష్యాకు చెందిన 17 ఏళ్ల మిరా ఆంద్రీవాపై విజయం సాధించింది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 5–7, 6–2, 2–6తో బొలెలీ–వావసోరి (ఇటలీ) జోడీ చేతిలో ఓడింది.

క్లుప్తంగా...

ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్ -1 ఫలితాలు విడుదల

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్-1 ఫలితాలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం గురువారం విడుదల చేసింది. ఈ ఫలితాలపై రీ టోటలింగ్ కోరే విద్యార్థులు ఈనెల 14 లోపు ప్రతి సబ్జెక్టుకు రూ.2 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాసరావు సూచించారు.

నీట్ ఫలితాల్లో శ్రీగోసలైట్స్ విద్యార్థుల ప్రతిభ



మాట్లాడుతున్న నరేంద్రబాబు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నీట్ ఫలితాల్లో విజయవాడ తమ అకాడమీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ నరేంద్రబాబు చెప్పారు. మొగల్రాజపురంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లాంగ్‌టర్మ్ బ్యాచ్‌లో ఎస్.మల్లిఖార్జునరావు-706 మార్కులు, జి.పూజిత, ఎస్.రోహిత్ శివసాయి-705 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్ డైరెక్ట్ నుంచి కె.సంజోగ్ నాయుడు-711 మార్కులు, గోమేధికం నయన్-705 మార్కులు, సరాబు శ్రీ నిఖిల్-700 మార్కులు, నాము అక్రిత్-700 మార్కులు, ఎం.మయూఖ్ శర్మ-700 మార్కులు సాధించారని చెప్పారు. నీట్ ఫలితాల్లో లాంగ్‌టర్మ్ నుంచి ముగ్గురు, ఇంటర్ డైరెక్ట్ నుంచి ఐదుగురు 700కుపైగా మార్కులు సాధించారన్నారు. మొత్తంగా 700 మార్కులు పైన 8 విద్యార్థులు, 600 పైన మార్కులు 520 మంది విద్యార్థులు సాధించినట్లు వివరించారు. నీట్-2024లో 1,500 పైగా ఫ్రీ మెడికల్ సీట్లు సాధిస్తామని తెలిపారు.

సెమీకండక్టర్ల టెక్నాలజీపై జైకా, ఐఐటీహెచ్ మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: సెమీ కండక్టర్ల రూపకల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) మధ్య ఒప్పందం కుదిరింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు రెండు సంస్థలు వెల్లడించాయి. అభివృద్ధిలో వినూత్న పరిజ్ఞానం అందించడం జైకా ముఖ్య ఉద్దేశ్యం. ఈ భాగస్వామ్యం వల్ల సెమీకండక్టర్ల రూపకల్పనలో సరికొత్త పురోభివృద్ధి సాధ్యమని జైకా ఇండియా ప్రతినిధి సైటో మిట్స్‌నోరి తెలిపారు. ప్రపంచంలోనే సరికొత్త సెమీ కండక్టర్లు దీనివల్ల బయటకొచ్చే వీలుందని తెలిపారు.

జోసా కౌన్సెలింగ్‌కు సర్వం సిద్ధం!

- 9న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు • 10 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం
- 17 వరకు మాక్ కౌన్సెలింగ్ • ఆ తర్వాత రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ఎంపిక
- ఐదు రౌండ్లలో కౌన్సెలింగ్ • జూలై 23 నాటికి ప్రక్రియ పూర్తి
- ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, జీఎఫ్‌టీఐల్లో 57,152 సీట్లు




జోసా కౌన్సెలింగ్ తేదీలు..
- జూన్ 18న అభ్యర్థుల రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ఎంపిక
- జూన్ 20న మొదటి విడత సీట్ల కేటాయింపు
- జూన్ 27న రెండో విడత సీట్ల కేటాయింపు
- జూలై 4న మూడో విడత సీట్ల కేటాయింపు
- జూలై 10న నాలుగో విడత సీట్ల కేటాయింపు
- జూలై 17న ఐదో విడత సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇతర జాతీయస్థాయి విద్యాసంస్థ (జీఎఫ్‌టీఐ)లలో కౌన్సెలింగ్‌కు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 9న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల కానున్నాయి. 10 నుంచి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించనుంది. 17 వరకు మాక్ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఆ తర్వాత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. మొత్తం ఐదు రౌండల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూలై 23 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే ఇతర విద్యా సంస్థల్లో మొత్తం 57,152 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ మేరకు జోసా సీట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక కసరత్తును చేపట్టింది.

గణనీయంగా పెరిగిన సీట్లు..

గత ఐదేళ్లలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీల్లో గణనీయంగా సీట్ల సంఖ్య పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతుండడం, ఉపాధి అవకాశాలతో ఇంజనీరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. అయితే 2019 ముందు వరకు అత్యున్నత ప్రమాణాలతో నడిచే ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీల్లో విద్యార్థుల డిమాండ్‌కు తగ్గట్టు సీట్ల సంఖ్య ఉండేది కాదు. దీంతో ఉన్నత ప్రమాణాలతో



కూడిన సాంకేతిక విద్య కోసం భారతీయ విద్యార్థులు ఏటా విదేశాలకు వెళ్లిపోయేవారు. దీన్ని నివారించడానికి 2024 నాటికి ఐఐటీలు, తదితర జాతీయ విద్యాసంస్థల సంఖ్యను పెంచడంతో పాటు వాటిలో సీట్ల సంఖ్యను 50 శాతం మేర పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అలాగే అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడం ద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని కూడా ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల సంఖ్యను పెంచింది. అనేక రాష్ట్రాల్లో కొత్తగా ఈ సంస్థలను అందుబాటులోకి తెచ్చింది.

5 ఏళ్లలో 18 వేలకు పైగా సీట్ల పెంపు

ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర సంస్థల్లో సీట్ల సంఖ్యను 2020లో ఒక్కసారిగా కేంద్రం పెంచింది. 2019లో దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీలు,

2023లో జోసా కౌన్సెలింగ్‌లో పాల్గొన్న సంస్థల్లో సీట్లు..

కేటగిరీ	ఐఐటీలు	ఎన్ఐటీలు	ఐఐఐటీలు	జీఎఫ్‌టీఐలు
ఓపెన్	3,082	6,689	9,169	3,409
ఓపెన్ పీడబ్ల్యూడీ	134	350	475	176
జనరల్ ఈడబ్ల్యూఎస్	718	1,659	2,261	802
జనరల్ ఈడబ్ల్యూఎస్ పీడబ్ల్యూడీ	84	133	30	33
ఎస్సీ	1,096	2,472	3,372	1,159
ఎస్సీ పీడబ్ల్యూడీ	50	136	180	51
ఎస్టీ	556	1,252	2,017	723
ఎస్టీ పీడబ్ల్యూడీ	18	58	109	24
ఓబీసీ	1,961	4,456	5,934	1,617
ఓబీసీ పీడబ్ల్యూడీ	106	234	311	75

ఐఐఐటీలు, జీఎఫ్‌టీఐలలో 38,704 సీట్లు ఉండగా దాన్ని 2020లో ఒకేసారి 50,822కు పెంచింది. 2021లో 52,453 సీట్లు, 2022లో 54,477, 2023లో 57,152 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితోపాటు ఆయా విద్యా సంస్థల్లో మహిళలకు 20 శాతం సూపర్ న్యూమరరీ కోటాతో సీట్లు కేటాయించుకునే వీలును కేంద్రం కల్పించింది.

కౌన్సెలింగ్‌కు మొత్తం 121 విద్యా సంస్థలు..

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జనవరి, ఏప్రిల్ సెషన్లలో జేఈఈ మెయిన్‌ను నిర్వహించింది. అందులో టాపర్లుగా నిలిచిన 2.50 లక్షల మందికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేసింది. ఈ నెల 9న అడ్వాన్స్‌డ్ తుది ఫలితాలను విడుదల చేయనుంది. అనంతరం 10 నుంచి నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభించనుంది. మొత్తం 121 విద్యా సంస్థలు కౌన్సెలింగ్‌లో పాల్గొననున్నాయి. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌ల్లో మెరిట్ ర్యాంకులు సాధించిన వారికి ఎన్ఐటీలు, ఐఐటీలు, ఐఐఐటీలు, జీఎఫ్‌టీఐల్లో జోసా ప్రవేశాలు కల్పిస్తుంది. ఆయా విద్యా సంస్థల్లో సీట్లు మిగిలిపోతే జూలై 17 నుంచి వాటికి ప్రత్యేక కౌన్సెలింగ్ చేపట్టనుంది.

నేటి నుంచి ఇగ్నో పరీక్షలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే జూన్-2024 టర్మ్ ఎండ్ పరీక్షలు ఈనెల 7 నుంచి జూలై 15 వరకూ జరగనున్నాయని ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డి.ఆర్.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ హాల్ టికెట్లు ఇగ్నో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి అభ్యర్థులు తమ అధ్యయన కేంద్రాలను థియరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని డాక్టర్ శర్మ పేర్కొన్నారు. ఇతర వివరాలకు విజయవాడ కొత్తపేట హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253లో సంప్రదించవచ్చన్నారు.

రేపు ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష

ఏయూక్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షను ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఆచార్య టి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 10,805 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 52 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 7 నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారని ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే సమయంలో హాల్ టికెట్, తమ గుర్తింపు కార్డును తీసుకు రావాలని పేర్కొన్నారు.

9న మోదీ ప్రమాణ స్వీకారం

నేడు ఎన్డీఏ ఎంపీల భేటీ • మోదీని తమ నేతగా ఎన్నుకోనున్న ఎంపీలు

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఎన్డీఏ పక్ష నేతలు సమావేశమై మోదీని తమ నేతగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. కొత్తగా ఎంపికైన 293 మంది ఎన్డీఏ లోక్‌సభ సభ్యులు శుక్రవారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. మోదీని తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఈ భేటీ అనంతరం మోదీ తనకు మద్దతు తెలుపుతున్న ఎంపీల జాబితాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయనున్నారు. మోదీతో పాటు కూటమి సీనియర్ నేతలు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ కూడా రాష్ట్రపతిని కలుస్తారని కూటమి వర్గాలు వెల్లడించాయి. ఎన్డీఏలోని పార్టీల అధ్యక్షులు కూడా మోదీకి మద్దతుగా రాష్ట్రపతికి లేఖలు సమర్పించనున్నారు.

ప్రమాణస్వీకారానికి ఇరుగుపొరుగు దేశాధినేతలు

బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, భూటాన్, నేపాల్, మారిషస్, సీషెల్స్ దేశాధినేతలు ఆదివారం మోదీ ప్రమాణస్వీకారానికి హాజరయ్యే అవకాశాలున్నాయి. బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, నేపాల్ ప్రధాని ప్రచండ, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, భూటాన్ ప్రధాని తెర్సింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాని ప్రవింద్ జుగ్‌నాథ్, సీషెల్స్ అధ్యక్షుడు వావెల్ రామ్‌కలవాన్‌లకు భారత్ ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. మాల్దీవులతో భారత్ సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఆ దేశాధ్యక్షుడు ముయిజ్జును మోదీ ఆహ్వానించడం విశేషం.

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- కారుచోల గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి



తలకు గాయాలైన తలతోటి దావీదు




తలకు తీవ్ర గాయాలైన మద్దూరి పాలు

యడ్లపాడు : వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామపెద్దలు, బాధిత కుటుంబాలు వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ కాలనీలోని చర్చి కింద జాలాది మార్గంలోని చెరువులో సుమారు 3.5 ఎకరాల ఆక్రమిత సాగుభూమి ఉంది. దీనిపై వచ్చే ఆదాయాన్ని ఏటా సంఘ పెద్దలు చర్చి అభివృద్ధి పనులకు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గతేడాది కౌలుకు తీసుకున్న కనపర్తి రత్తయ్య తన కౌలు డబ్బులు ఇస్తానంటూ చర్చికి రావాలని సంఘ పెద్దల్ని కోరాడు. దీంతో సంఘ పెద్దలు ఆరుగురు బెజ్జం అనిల్, వలేరు లాజర్, వడ్డానం మాణిక్యరావు, గడ్డ సీమోను, తిరుపతి రామారావు, మద్దూరి మనోహర్, తలతోటి దావీదు చర్చికి చేరుకుని కౌలు డబ్బులతో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. పెద్దలంతా చర్చి నుంచి బయటకు వస్తున్న క్రమంలో ఆ ప్రాంతానికి వచ్చిన గ్రామ టీడీపీ నాయకుడు మైలవరపు వెంకట కోటయ్య.. సంఘ పెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకుడైన తలతోటి దావీదుతో వాగ్వాదం పెట్టుకున్నాడు. అదేకాలనీలోని తమ పార్టీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి.. అంబడిపూడి నాగభూషణం, మద్దూరి ముసలయ్యలతో పాటు మరికొందరితో కలిసి దాడికి దిగారు. దావీదుతో వచ్చిన మరో పెద్ద మద్దూరి మనోహర్ పరారు కాగా, దావీదును నాపరాయితో తలపై మోదారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మద్దూరి మనోహర్ అనే వలంటీర్ దావీదును తన బైక్‌పై ఎక్కించుకుని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ఇదిలా ఉండగా పొలం నుంచి కాలనీ వైపు టీవీఎస్‌పై వస్తున్న మద్దూరి పాలు.. టీడీపీ కార్యకర్తలు కర్రలతో ఆవేశంగా రావడం గమనించి బండి వెనక్కు తిప్పే ప్రయత్నం చేశాడు. అతన్ని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో పట్టుకుని దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గుంపుల్ని చెదరగొట్టి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. తీవ్రంగా గాయపడిన పాలును తొలుత చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి.. తర్వాత ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

12న చంద్రబాబు ప్రమాణస్వీకారం

- 11న టీడీపీ శాసనసభాపక్ష సమావేశం
- మంత్రివర్గ కూర్పుపై ఊహాగానాలు
- తొలి విడతలో కొందరికే అవకాశం



సాక్షి, అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈనెల 12వ తేదీన చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. తొలుత 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించినా అదేరోజు ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తుండడం.. ఆ కార్యక్రమానికి హాజరవ్వాల్సి వుండడంతో చంద్రబాబు తన కార్యక్రమాన్ని 12కు వాయిదా వేసుకున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆ రోజున రాజధాని ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ప్రమాణ స్వీకారం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దానికి ముందు 11వ తేదీన టీడీపీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆ రోజు టీడీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును టీడీపీ పక్ష నేతగా ఎన్నుకుంటారు. చంద్రబాబును టీడీఎల్పీ నేతగా ఎన్నుకుని గవర్నర్‌కు నివేదించాక 12న ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది.

తొలి విడతలో 10 మందికి మంత్రులుగా అవకాశం..

చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజే తొలి విడతగా కొందరిని మంత్రులుగా ప్రమాణం చేయించనున్నట్లు తెలిసింది. సుమారు పది మందికి తొలి విడతలో అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ నుంచి ఐదారుగురు, జనసేన, బీజేపీ నుంచి నలుగురు ఆ జాబితాలో ఉండే అవకాశం ఉంది. తొలి విడతలో కింజరాపు అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు వంటి వారికి అవకాశం ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన నుంచి పవన్‌కళ్యాణ్ మంత్రివర్గంలో చేరతారా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. మంత్రివర్గంలో చేరితే చంద్రబాబుతోపాటే ఆయన ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. అలాగే, నాదెండ్ల మనోహర్ కూడా తొలివిడతలోనే ఛాన్స్ దక్కించుకోనున్నట్లు సమాచారం. బీజేపీ తరఫున సుజనాచౌదరికి తొలి విడతలోనే మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం ఖాయమని చెబుతున్నారు. మంత్రి పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో తొలి విడతలో ముఖ్యులకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కొద్ది సమయం తీసుకుని సామాజిక సమీకరణలు, సీనియారిటీ, జిల్లాల ప్రాతిపదికన మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశం ఉంది.

టీడీపీకి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి?

మరోవైపు.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ప్రధాన పార్టీగా ఉండడంతో టీడీపీ లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, బీజేపీ అగ్రనేతలు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. జాతీయ స్థాయిలో ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా స్పీకర్ పదవిని తన వద్దే ఉంచుకోవాలని బీజేపీ చూస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చంద్రబాబు ఆ పదవి కావాలని గట్టిగా పట్టుబడితే ఏమైనా నిర్ణయం మారే అవకాశం ఉందంటున్నారు. కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ ఐదుకి పైగా స్థానాలు కోరుతుండడం, కీలకమైన జలశక్తి, రవాణా వంటి శాఖలు అడుగుతుండడంతో దానిపైనా రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ పౌర విమానయాన, ఉక్కు శాఖలను టీడీపీకి ఇవ్వాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. శుక్రవారం జరిగే ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశం తర్వాత దీనిపై ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అసెంబ్లీ స్పీకర్‌గా 'ఆనం'..?

ఇదిలా ఉంటే.. అసెంబ్లీ స్పీకర్‌గా ఆనం రామనారాయణరెడ్డిని నియమించే యోచనలో టీడీపీ ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనైతే సభను హుందాగా నడిపిస్తారనే ఆలోచన ఉన్నట్లు భావిస్తున్నారు. 'ఆనం' కాదనుకుంటే గతంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కళా వెంకట్రావుకు అవకాశం ఇవ్వవచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ పదవి తనకు కావాలని ఉండి నియోజకవర్గం నుంచి గెలిచిన కనుమూరి రఘురామకృష్ణరాజు కోరుతున్నట్లు ప్రచారం జరుగుతున్నా అందుకు చంద్రబాబు అంత సుముఖంగా లేరని సమాచారం.

పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ పొడిగింపు

- వచ్చే వారం వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- తదుపరి విచారణ ఈ నెల 13కి వాయిదా
- రాత్రి 10.20 గంటలు కావడంతో విచారణ వాయిదా
- ఉదయం నుంచి కేసులు చేసి చేసి అలసిపోయిన న్యాయమూర్తి
- వాయిదాకు సమ్మతి తెలిపిన ఫిర్యాది తరపు న్యాయవాదులు



సాక్షి, అమరావతి : మూడు వేర్వేరు కేసుల్లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మధ్యంతర ముందస్తు బెయిల్ ఇస్తూ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పిన్నెల్లి వ్యాజ్యాలను విచారించేందుకు తగినంత సమయం లేకపోవడం, అప్పటికే రాత్రి 10.30 గంటలు కావడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేశారు.

మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం పిటిషన్లు

ఈవీఎం ధ్వంసం కేసులో హైకోర్టు ఈ నెల 23న పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయగా, ఆ వెంటనే పోలీసులు ఆయనపై రెండు హత్యాయత్నం కేసులతో సహా మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా నమోదు చేసిన ఈ తప్పుడు కేసులపై పిన్నెల్లి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు మధ్యంతర ముందస్తు బెయిల్ కోరుతూ మూడు అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. టీడీపీ నేతలు అస్మిత్‌రెడ్డి, చింతమనేని ప్రభాకర్ తదితరులు కూడా ఇదే రకమైన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సి ఉందని అభ్యర్థించడంతో ఈ నెల 6వ తేదీ వరకు వారందరికీ మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

వాదనలు ముగిసేలోపు అర్ధరాత్రి అవుతుంది

పిన్నెల్లి పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం మరోసారి విచారణ జరిపారు. హైకోర్టుకు వేసవి సెలవుల కారణంగా అత్యవసర కేసులను విచారిస్తుండటంతో ఈ వ్యాజ్యాలు రాత్రి 9.30 గంటల సమయంలో విచారణకు వచ్చాయి. పిన్నెల్లి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, న్యాయవాది ఎస్.రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై ఫిర్యాదుదారు నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారని, పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కౌంటింగ్ కేంద్రానికి వెళ్లొద్దని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. అంతేకాక ఈ నెల 6న విచారణకు రానున్న వ్యాజ్యాలను పరిష్కరించాలని హైకోర్టుకు తెలిపిందన్నారు. తమ వ్యాజ్యాల్లో వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని, వాస్తవాలన్నింటినీ కోర్టు ముందు ఉంచి వాదనలు పూర్తి చేసేందుకు సమయం పడుతుందన్నారు. ఆ తరువాత తమ వాదనలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఫిర్యాదుదారు తరఫు న్యాయవాదులు స్పందించాల్సి ఉంటుందని, ఇవన్నీ పూర్తయ్యే లోపు అర్ధరాత్రి దాటుతుందని నిరంజన్‌రెడ్డి వివరించారు. పైపెచ్చు సుప్రీంకోర్టు 6వ తేదీనే ఈ వ్యాజ్యాలను పరిష్కరించి తీరాలని చెప్పలేదని, ఎలాంటి గడువు నిర్దేశించకుండా ఆ రోజున విచారణకు వచ్చే వ్యాజ్యాలను పరిష్కరించాలని మాత్రమే చెప్పిందన్నారు. అనంతరం ఆయన కేసుకు సంబంధించిన వాదనలను వినిపించారు. పోలీసులు తప్పుడు సమాచారంతో కోర్టును తప్పుదోవ పట్టించారని, ఇందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని హైకోర్టు సైతం స్పష్టంగా పేర్కొందని వివరించారు. పిన్నెల్లి విషయంలో పోలీసుల తీరు దురుద్దేశపూర్వకంగా ఉందన్నారు. ఉదయం 10.30 నుంచి విరామం లేకుండా వరుసగా అనేక కేసులు విచారణ జరిపి న్యాయమూర్తి తీవ్రంగా అలసిపోయినట్లు ఉండటాన్ని గమనించిన నిరంజన్‌రెడ్డి.. విచారణను శనివారానికి వాయిదా వేయాలని, ఆ రోజు పూర్తిస్థాయిలో వాదనలు వినిపిస్తామని చెప్పారు. శనివారం తాను కేసు వినేందుకు నిబంధనలు అనుమతించవని, ప్రధాన న్యాయమూర్తి అనుమతించాల్సి ఉంటుందని జస్టిస్ విజయ్ స్పష్టం చేశారు. అలా అయితే విచారణను వచ్చే వారానికి (13వ తేదీకి) వాయిదా వేయాలని, ఆ రోజున పూర్తిస్థాయి వాదనలు విని నిర్ణయాన్ని వెలువరించవచ్చని నిరంజన్ రెడ్డి చెప్పారు. తాము కూడా ఉదయం నుంచి పలు కేసుల్లో వాదనలు వినిపిస్తూ వస్తున్నామని చెప్పారు. ఇప్పుడే వాదనలు వినిపించాలని కోర్టు ఆదేశిస్తే అందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీంతో న్యాయమూర్తి ఫిర్యాదుదారు తరఫు న్యాయవాదుల అభిప్రాయం కోరారు.

వాదనలు విని తీర్పు చెప్పేలోపు తెల్లారుతుంది

ఫిర్యాదుదారు శేషగిరిరావు తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. మూడు క్రైం నంబర్లు ఒకే అంశానికి సంబంధించినవైనందున, అన్నింటినీ కలిపే విచారించాలని కోరారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి.. అన్ని వ్యాజ్యాలపై వచ్చే వారం విచారణ జరుపుతానని తెలిపారు. ఇప్పటికే 10.20 అయిందని, ఇప్పుడు వాదనలు విని, తీర్పు చెప్పేలోపు తెల్లారి అవుతుందని, తాను అందుకు సిద్ధమేనని, అయితే కోర్టు సిబ్బంది ఇళ్లకు వెళ్లాల్సి ఉందని గుర్తు చేశారు. విచారణను వాయిదా వేయడంపై పోసాని వెంకటేశ్వర్లు అభిప్రాయం కోరగా, ఆయన కూడా అందుకు అంగీకరించారు. దీంతో న్యాయమూర్తి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు పిన్నెల్లి అరెస్ట్ విషయంలో ఉన్న మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. వాయిదాకు ఫిర్యాదుదారు తరఫు న్యాయవాదులు అంగీకరించిన విషయాన్ని కూడా తన ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

అలాంటి మాటలు ఇంకెవరి ముందైనా చెప్పండి

పోలీసు అధికారి నారాయణ స్వామి (పిన్నెల్లి ఫిర్యాదు మేరకు ఇతన్ని ఎన్నికల సంఘం విధులకు దూరంగా ఉంచింది) తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ స్పందిస్తూ.. 6వ తేదీనే ఈ వ్యాజ్యాలను పరిష్కరించాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లు చేయకుంటే బాగుండదన్నారు. దీనిపై మళ్లీ ఎవరైనా సుప్రీంకోర్టుకు వెళ్లవచ్చన్నారు. ఈ వాదనపై న్యాయమూర్తి తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. 'సుప్రీం కోర్టుకు వెళితే వెళ్లనివ్వండి. ఎవరో వెళతారని మీరెలా చెబుతారు? ఇలాంటివన్నీ ఇంకెవరి ముందైనా చెప్పండి. ఈ కోర్టుకు కాదు. కోర్టు పని వేళలు సాయంత్రం 4.15 గంటల వరకే. ఈ సమయం దాటి కేసులు విచారించకూడదు. మరి దీని గురించి ఏమంటారు' అంటూ న్యాయమూర్తి ఘాటుగా స్పందించారు. దీంతో వెనక్కి తగ్గిన అశ్వనీ కుమార్ కోర్టును క్షమాపణలు కోరారు. అల్లర్లలో నారాయణస్వామి తలకు తీవ్ర గాయమైందన్నారు. దీనికి నిరంజన్ రెడ్డి స్పందిస్తూ.. నారాయణస్వామి తలకు తగిలిన గాయం స్వల్పమైనదేనని, ఈ విషయాన్ని ఆయన సమర్పించిన మెడికల్ రిపోర్ట్ చూస్తే అర్థమవుతుందని చెప్పారు. స్వల్ప గాయమని డాక్టర్లు చెబుతుంటే, తీవ్రమైనదని ఎలా చెబుతారని ప్రశ్నించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు చెవిరెడ్డి భరోసా
- బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శ



టీడీపీ నేతల దాడిలో గాయపడిన చంద్రగిరి పంచాయతీ వార్డు సభ్యుడు వంశీని పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి (తిరుపతి జిల్లా): 'అధైర్యపడకండి.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా.. గొడవలు చేయడం మన సంస్కృతి కాదు.. అలాగని మన ఇంటి మీదకు వచ్చి దాడిచేస్తే మాత్రం వదిలేది లేదు.. దాడి చేసినా, అర్ధరాత్రి ఫోన్లు చేసి బెదిరించినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.. పోలీసులు కేసు నమోదు చేయకుంటే ప్రైవేట్ కేసులు పెడదాం.. ఎవరికి ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటా' అని టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ధైర్యం చెప్పారు. గత రెండు రోజులుగా తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో 11 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడి చేశారు. ఈ నేపథ్యంలో గురువారం టీడీపీ నేతల దాడుల్లో గాయపడ్డ చంద్రగిరి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మస్తాన్, చంద్రగిరి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు వంశీ, అనిల్, తిరుపతి అర్బన్ మండలం సప్తగిరి కాలనీకి చెందిన మహమ్మద్ ఖాసీం బాషా అలియాస్ అద్దాల బాషా, మహేశ్వర రెడ్డి, మొదిలియార్ రమేష్, చిట్టి, చిలమంద హరికృష్ణ, చిలమంద వంశీ ఇళ్లకు వెళ్లి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పార్టీ కార్యాలయం ఆధ్వర్యంలో లీగల్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏకపక్షంగా వ్యవహరించే పోలీసులకు కోర్టు ద్వారానే సమాధానం చెబుదామన్నారు. టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపైనా దాడులు చేయలేదని వెల్లడించారు. కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సేవ చేశామని గుర్తు చేశారు. ఆపద అంటూ తమ దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆదుకున్నామే తప్ప ఒక్క టీడీపీ కార్యకర్తకు కూడా హాని తలపెట్టలేదన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.